ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

జూన్ 22, 1949

★ పూరీ పుణ్యక్షేత్రంలో జగన్నాథ దేవాలయం ★



జగత్ప్రసిద్ధ పూరీ జగన్నాథదేవాలయం: పూరీనగరం రహదారినుండి కనబడు దృశ్యం.



రథయాత్ర: జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవుల రథముల ఊరేగింపు; భారతదేశంలో నలుదిశల నుంచీ వేలాది యాత్రికులు వచ్చి ఊరేగింపులో పాల్గొంటారు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

సంపుటము 41

సంచిక 40

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు నా

యొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర జ్యేష్ఠ బహుళ ఏకాదశి బుధవారము



'గృహస్థి' హిందీ చిత్రంలో కులదీప్

ఆంధ్రపత్రిక

1949-వ సం॥ జూన్ నెల 22-వ తేది బుధవారము

కాంగ్రెస్ సంస్థ: కాంగ్రెసువాదులు

మద్రాసు మంత్రులు కొందరిపై రాష్ట్ర శాసనసభ కాంగ్రెస్ పక్ష సభ్యులు కొందరు చేసిన ఆరోపణలనుగురించి కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ శంకరరావు దేవ్‌గారు గత వారమురోజులుగ జరిపిన విచారణ ఫలితము లెట్లుండునో, అట్టి విచారణ రాష్ట్రమునందలి కాంగ్రెస్ రాజకీయములను సరిదిద్దుటకు ఎంతవరకు ఉపయోగపడునో మున్ముందుగాని తెలియదు. ఆరోపణలు సహేతుకమైనవా? నిర్హేతుకమైనవా యను ప్రశ్నలకు విచారణాధికారి తీర్పు చెప్పగలడు. కాని దాదాపు మూడు సంవత్సరములుగ ఈ రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయములు ఏ మార్గమును అనుసరించు చున్నవో బోధపరచుకొనుటకు ఈ ఆరోపణలు, అందుకు మంత్రుల సమాధానములు కొంతవరకు ఉపయోగపడగలవు. రాష్ట్ర కాంగ్రెస్ రెండు వర్గములుగ విభాగమైనట్లు ఇందువలన స్పష్టమగుచున్నది. కాంగ్రెస్ ఐక్యత పూర్తిగ విచ్ఛిన్నమైనదనుటకు ఇంతకుమించిన నిదర్శనము అవసరములేదు. ఒక చెన్న రాష్ట్ర కాంగ్రెస్‌నే ఈ 'వ్యాధి' పీడించుటలేదు. దాదాపు అన్ని రాష్ట్రములందును కాంగ్రెస్ రాజకీయములు ఇదే విధముగ నున్నవి. రాజస్థాన్ కాంగ్రెస్ సంఘము ప్రధానిపై అవిశ్వాసమును ప్రకటించి, హీరాలాల్ శాస్త్రి వెంటనే రాజస్థాన్ ప్రధాన మంత్రిపదవికి రాజీనామా నివ్వవలెనని కోరుచు తీర్మానించెను. రెండు మాసముల క్రితమె మధ్యభారత్ కాంగ్రెస్ సంఘము మధ్య భారత్ ప్రధానిపై ఇదేవిధముగ విశ్వాస రాహిత్య తీర్మానమును చేసియుండెను. ఫలితము మంత్రివర్గమునందు మార్పులు. పశ్చిమ బెంగాల్‌లో కూడా కాంగ్రెస్ వ్యవహారములు చాల అసంతృప్తికరముగ నున్నవనుటకు ఇటీవలి దక్షిణ కలకత్తాలో ఎన్నిక ఫలితమె నిదర్శనము.

ఈ విషమ పరిస్థితికి అంతటికీ కారణము రాష్ట్రపతి పట్టాభి సీతారామయ్యగారు ప్రకటించినట్లు కాంగ్రెస్ సంఘములకూ, కాంగ్రెస్ ప్రభుత్వములకూ ప్రస్తుత సంబంధములు అంత సంతృప్తికరముగ లేకపోవుటే. ఉభయవర్గములకు సఖ్యత లేకపోవుటేగాక, నానాటికి వారి మధ్య వైషమ్యములు పెరిగిపోవుచున్నవి. తప్పు లెన్నుటే ఉభయులకు కార్యక్రమమైనట్లు కన్పించుచున్నది అందుపై బహిరంగముగ వాద ప్రతివాదములను సాగించుటవలన సామాన్య ప్రజలకు కాంగ్రెస్ వాదులయెడ గౌరవము తగ్గిపోవుట, కాంగ్రెస్ వాదులలో క్రమశిక్షణ అంతరించుట జరిగినది. వీటన్నింటి ఫలితముగ సామాన్యప్రజలకు కాంగ్రెస్ సంస్థఎడల కొంతఅసంతృప్తి ఏర్పడినది. అయితే కాంగ్రెస్ అగ్రనాయకులలో సామాన్యప్రజలకు గల విశ్వాసము ఏమాత్రము తగ్గలేదు. కాని ఆ భక్తి గౌరవములు రెండవ శ్రేణికి చెందిన కాంగ్రెస్ నాయకుల నెంతోకాలము కాపాడజాలవు.

జయపూరు కాంగ్రెస్ నందు కాంగ్రెస్‌వాదుల నైతిక వర్తనపై జరిగిన తీర్మానమును కాంగ్రెస్ వాదులందరు శిరసావహించి యుండిన నేటి విషమపరిస్థితి ఏర్పడి యుండెడిది గాదు. కాంగ్రెస్‌తీర్మానములలో ప్రజలకు పూర్వముండిన విశ్వాసము తగ్గియుండెడిది గాదు. ఈనాడు కాంగ్రెస్ పూర్వమువలె ఒక జాతీయసంస్థగ గాని, లేక ఇతర రాజకీయ పక్షములవలె ఒక రాజకీయపక్షముగ గాని లేదు. దేశమునందు ఇతర రాజకీయపక్షములు ఏర్పడి వృద్ధియగుచుండ కాంగ్రెస్ జాతీయ సంస్థవలె వ్యవహరించుట సాధ్యముగాదు. ఒక రాజకీయపక్షముగనే వ్యవహరింపవలసి యుండును. దేశము స్వాతంత్ర్యమును పొందిన అనంతరము కాంగ్రెస్ వాస్తవమునకు జాతీయసంస్థగ నుండవలసిన అవసరము తీరినదనే చెప్పవచ్చును. భారత ప్రజానీకమునకు అంతటికి ప్రాతినిధ్యము వహించు జాతీయ, రాజకీయ పక్షముగనె ఇంకమీదట వ్యవహరింపవలసి యుండును. అందుకు కాంగ్రెస్ వాదులలో కఠినమైన క్రమశిక్షణ ఉండవలెను. ఏ విచారణ అయినను, ఏ సంఘటన అయినను అట్టి క్రమశిక్షణను ఏర్పరచుటకే ఉపయోగపడవలెను.

లంచగొండితనము గాని, కులమత అభిమానముగాని, స్వజన పక్షపాతము ఏ ఒక్క ప్రాంతమునకును సంబంధించినవి కావు. ప్రభుత్వమును నిర్వహించు వారిలోనూ, రాష్ట్ర సంఘముల నిర్వహించు వారిలోనూ కూడ, ఈ లోపములు ఉండవచ్చును. కాంగ్రెస్ ప్రభుత్వములనేగాక, కాంగ్రెస్ సంఘములనుకూడ సంస్కరించిన గాని ఈ సమస్యలు పరిష్కారము కాజాలవు. అయితే కాంగ్రెస్ సంఘముల విధానములు పద్ధతుల కంటె ప్రజలలో అసంతృప్తి ఏర్పడుటకు కాంగ్రెస్ ప్రభుత్వ పద్ధతులే కారణము కావచ్చును. కాని కాంగ్రెస్ పూర్వము ఆక్రమించియుండిన ఉన్నత స్థానమును పొందవలెనన్న ఈ రెండు రంగములందును సంస్కరణలు జరుగవలసియుండును. ఈ విధముగ ప్రాంతీయ విచారణలను జరుపుటకంటె అసలు కాంగ్రెస్ ప్రభుత్వములకును-కాంగ్రెస్ సంఘములకును గల సంబంధములను విచారించి వాటిని సరియైన విధముగ తిరిగి ఏర్పరచుట మంచిది. కాంగ్రెస్ ప్రభుత్వములపై, కాంగ్రెస్ సంఘములపై వచ్చు ఫిర్యాదులను విచారించి పరిస్థితిని చక్కచేయుటకు, అదే పనిగ వ్యవహరింపగల సంఘములను నియమించుట మంచిది. ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దుటకు అదొక్కటే మార్గము.

చంద్రనగరవాసుల నిర్ణయము

"అంధకార బంధురమైన శతాబ్దముల నిద్రాణజీవనము మన కింతటితో తొలగిపోయినది" అని చంద్రనగర పరిపాలన సంఘాధ్యక్షులు శ్రీ దేవేన్ దాస్ చెప్పిరి. చంద్రనగరమునకు పరజాతి దాస్యమునుండి ముక్తి లభించనున్నది. ఫ్రెంచి పాలకుల కుతంత్రములు వ్యర్థమైనవి. ప్రజాప్రాతినిధ్య పరిపాలనము పేర నొనర్చు అకార్యములను వారింకెంతమాత్రము లోకమునుండి కనుమరుగు చేయజాలరు. చంద్రనగర వాసులు ఫ్రెంచి పాలకుల బెదరింపులకుగాని, తియ్యని వాక్కులకుగాని లొంగలేదు. చంద్రనగరమును భారత దేశముతో నైక్యము చేయవలెనని జూన్ 19 వ తేది ఆదివారమున నిర్ణయించిరి.

చంద్రనగరపుర పరిపాలక సంఘము ఇదివరలో ఒక తీర్మానములో జనవాక్య నిర్ధారణ సమయమున భారత ప్రభుత్వము తరఫున ఒకరును, భారత, ఫ్రెంచి ప్రభుత్వములు రెండింటికినీ సమ్మతమైనవా రొకరును పర్యవేక్షకులుగ నియమింపబడవలెనని సూచించినది. ఫ్రెంచి ప్రభుత్వ మీ తీర్మానమును మన్నించలేదు. స్వయముగ అంతర్జాతీయ న్యాయ సంస్థ ఉపాధ్యక్షుని ఆశ్రయించి, పర్యవేక్షకులను నియమించుకొన్నది. వీరిని నియమించుచున్నప్పుడు భారత ప్రభుత్వమునకుగాని, చంద్రనగర పురపరిపాలక సంఘమునకుగాని తెలుపలేదు. వారి యనుమతిని పొందలేదు. నిర్ధారణ కార్యక్రమమును గూడ న్యాయసమ్మతముగ ఏర్పాటు చేయలేదు. ప్రచారమునకు అల్పవ్యవధిని మాత్రమే ఇచ్చిరి. జాతీయవాదుల కెన్నియో ఆటంకములు కల్పించిరి. అయిననూ ప్రజల వాంఛను నిరోధింపజాలకపోయిరి.

జనవాక్య నిర్ధారణ విషయమున చంద్రనగర పరిస్థితి, తదితర ఫ్రెంచి వలసనగరముల పరిస్థితికంటె భిన్నమని ఫ్రెంచిఇండియా హైకమీషనరు యం. చాంబర్ చెప్పిరి. చంద్రనగరము కలకత్తాకు ఉత్తరమున 22 మైళ్ళ దూరమున నున్నది. మిగిలిన నాలుగునగరములు పాండుచేర్రి, మాహి, యేనాం, కరైకాల్ దక్షిణమున సముద్రతీరమున నున్నవి. అందువలన ఈ నాలుగు నగరముల స్థితియూ ఫ్రెంచివారి దృష్టిలో చంద్రనగరముకంటె భిన్నముగా నుండుటలో ఆంతర్యము బోధపడుచునే యున్నది.

పాండుచేరి నగరములోనూ, మిగిలిన మూడు నగరములలోనూ డిసెంబరు మాసములో జనవాక్య నిర్ధారణ జరుగనున్నది. అప్పుడు ఈ నగరవాసులందరూ భారత దేశముతో నైక్యమగుటకే నిర్ణయించెదరనుటలో సందేహము లేదు.

శ్రీ అరవిందాశ్రమము పాండుచేరి భారత దేశములో నైక్యము కావలెనని సూచించుచూ ఇటీవల ఒక ప్రకటన చేసినది.

చంద్రనగరము వారికి తెన్ను జూపినది. ప్రజోద్యమములను నిరంకుశ పాలకులు అణచివేయజాలరని చంద్రనగరము తిరిగి నిరూపించినది. పాండుచేరి, మాహి, యేనాం, కరైకాల్ నగరములుగూడ త్వరలో భారత దేశములో నైక్యము కాగలవని యాశింపవచ్చును.

నవల:

నాకబలి

వి.ఎడి. ప్రసాదరావు

2

సంగు తిరిగి, రాజబాటకద్దకు వచ్చేసరికే బాగా ప్రొద్దు వాలింది.

"యూనివర్శిటీకే పోదామా, లేక సిటీలోకి పోయి సినిమాకు పోయివద్దామా?" అని ఒక నిమిషం ఆలోచిస్తూ నిలబడ్డాడు. కాలీగా, వెళ్లే ఎక్కా ఏదీ కనబడలేదు.

యూనివర్శటీకేసి రెండడుగులు నడిచాడు.

"రాఘవరావు !—"- ఆంజనేయులు కంఠం వినిపించింది.

వరుసను మూడు ఎక్కాలు వస్తున్నాయి. తొమ్మండుగురు గాంధీటోపీల విద్యార్థులు, జాతీయగీతాలు పాడుకుంటూ ఎక్కాలలో సిటీలోకి పోతున్నారు. వాళ్లల్లో అన్ని భాషల వాళ్లూ ఉన్నారు. అంజనేయులూ, నారాయణ అనే మునుపు కాంగ్రెస్‌లో జైలుకు వెళ్లిన విద్యార్థులు, పూర్తిఖద్దరులో ఉన్నారు. హిందీ, మహారాష్ట్రపు విద్యార్థులకు గాంధీ టోపీయే ఖద్దరు-చిహ్నము.

"ఎక్కడికి?" అని అడిగాడు రాఘవరావు.

"పికెటింగ్‌కు పోతున్నాం. వస్తావా!" అని నవ్వుతున్నాడు అంజనేయులు.

రాఘవరావు తటపటాయిస్తున్నాడు.

"వస్తే వెనకనుంచి ఎక్కా చేసికొని రా!"- బళ్లు పరుగులుతీస్తూ వెళ్లిపోయాయి.

వెళ్తూన్న బళ్లవైపు చూస్తూ కాసేపు నిలబడ్డాడు.

ఒక నిట్టూర్పు విడిచి, "ఊహూ" అన్నట్లు, తల ఆడించుకొని, వెనుకకు యూనివర్శిటీ కేసే మళ్లాడు -

తండాలు తండాలుగా నడిచి కొందరూ, ఎక్కాల్లో కొందరూ, సిటీలోకి పోతున్నారు. ఆగి నిలబడ్డాడు - విద్యార్థులు చౌక్‌లో పికెటింగ్ చేయబోతున్నారు. జండా కఱ్ఱల మ్యాటలు మొదటి మూడు ఎక్కాలలోనే వెళ్లి పోయాయి.

జరిగే కోలాహలం చూద్దామని వెళ్లే వాళ్లే ఎక్కువమంది ఉన్నారు- శర్మ, పుల్లయ్య అనే తన క్లాసు విద్యార్థులు, మరి కొందరు తెలుగు వాళ్లూ, శుద్ధ ఖద్దరులో బయలుదేరారు. తనవి ఖద్దరు దుస్తులు కావు.

"అప్పుడే ఎప్పుడు బయలుదేరేవోయ్! ఆగావేం? ముందు ఎవళ్లు వెళ్లారా ఏమిటి!" అని శర్మ అడుగుతున్నాడు.

"తను అప్పుడే యూనివర్శిటీనుంచి పికెటింగ్ కోసమనే చౌకుకు బయలుదేరినట్లుగా వాళ్లు భావిస్తున్నారు. ఆ భ్రమకు దోహదంగానే ప్రవర్తించాలి.

"ఆంజనేయులు, నారాయణ ఎక్కాలో వెళ్లారు" అని మాట కలిపాడు.

"అరె! పద పద! గాంధీ టోపీ లేదా?" అంటూ శర్మ జేబులోనుంచి మరో గాంధీ టోపీ తీసి రాఘవరావుతలకు తగిలించాడు.

వాళ్లు తొందర తొందరగా నడుస్తున్నారు. తనకు వంట్లో అంత సత్తువ కనబడటల్లేదు. పుల్లయ్య పొట్టివాడయినా పెద్దపెద్ద అడుగులు వేస్తూ పళ్లబిగువుకు తానూ శక్తి తెచ్చుకు నడుస్తున్నాడు.

చౌకుదగ్గరకు వచ్చేటప్పటికి గుంపు చాలా పెరిగిఉంది. నెమ్మదిగాతోసుకుంటూ ముందుకు నడిచాడు. అటు దశాశ్వమేధ ఘట్టందాకాకూడ జనం కిక్కిరిసి ఉన్నారు! చౌక్ దగ్గర మాత్రం మధ్య ఒక బస్సు పెట్టుకొని లాఠీలతో పోలీసులు ఒక సార్జంటు నిలబడి ఉన్నారు.

జనంలోంచి తోసుకుంటూ ఆ నలుగురితోటి

౨

చౌక్ దాటి ఆంజనేయులు, నారాయణ వాళ్లున్నవయిపుకు నడిచాడు. వాళ్ళకు యింకో 50 గజాల దూరంలో ఉండగానే తను ఆగి నిలబడ్డాడు. మార్వాడీల బట్టల కొట్లముందర ఒకొక్క కొట్టుకి యిద్దరిద్దరు చొప్పున విద్యార్థులు తిష్ఠవేసుకుని బేరగాళ్లకి అడ్డంగా కూర్చున్నారు. ఆంజనేయులు, నారాయణ చివర కొట్టుదగ్గ రున్నారు. మార్వాడీలు విద్యార్థులను వెళ్లిపొమ్మని బ్రతిమాలుతున్నారు. విద్యార్థులు వాళ్లని మళ్లీ బ్రతిమాలుతున్నారు. ఇద్దరిలోను కలయికలు లేవు.

కొట్లదగ్గర బట్టలు కొనబోతున్న పల్లెటివాళ్లు కూడా బట్టలు కొనడం మానేసి సిగ్గుపడినట్లుగా వెనకకి జరిగి జనంలో నిలబడి వింతలు చూస్తున్నారు.

చౌక్‌దగ్గర పోలీసులు ఏమీ నిర్ణయం తేల నట్లుగా అల్లాగే చాలాసేపు నిలబడి ఉన్నారు. చివరకి సార్జంటు వాళ్లని నాలుగు బాచీలుగా చీల్చాడు. చౌక్‌లో నాల్గుమూలలా నాల్గుబాచీలను పెట్టాడు. సార్జంటే ఒక కానిస్టేబిల్‌ని పిల్చాడు. కానిస్టేబిల్ ముందుకు వచ్చి ఒక బూరాలోంచి మాట్లాడుతూ జనాన్ని సర్దుకు పొమ్మని, విద్యార్థులను వెనక్కి వెళ్లిపోవలసినదని, లేకపోతే లాఠీలు ఉపయోగించవలసి వస్తుందని మూడు మూడు మాట్లు చౌక్ చుట్టూ తిరుగుతూ గట్టిగా అరిచాడు. జనం కొట్లమీదే కొద్దిగా అంచులకు సర్దుకుంటున్నారు. నారాయణ, మరో మహారాష్ట్రవిద్యార్థి తాము పికిట్ చేస్తూన్న కొట్లదగ్గర వేరే విద్యార్థులను నిల్పి కాంగ్రెస్ జండాలు ఎగురవేస్తూ "భారత్ మాతకి జయ్, గాంధీకి జయ్!" అనే నినాదాలతో చౌక్ మధ్యకు వచ్చారు. "మహాత్మ గాంధీకి జయ్" అన్న నినాదం జనంలో ఒక్కసారి చెలరేగింది. సార్జంటు మొహం కందగడ్డయింది. "చార్జ్"అని కేక వేశాడు. పోలీసులు దశాశ్వమేధ ఘట్టం ముఖంగా లాఠీలనువిసురుకుంటూ జనాన్ని తరమటం మొదలుపెట్టారు. అటు జనం చెల్లాచెదురుగా పారిపోతున్నారు. తక్కిన మూడు వైపులా జనం భయంతోనూ ఉత్సాహంతోనూ వెనక్కీ ముందుకీ పరుగులెత్తుతున్నారు తప్ప రద్దీ తగ్గటంలేదు. నారాయణ జండా పైకి పుచ్చుకొని మళ్లీ "గాంధీకి జయ్", "భరతమాతకి జయ్" అని అరిచాడు. మహారాష్ట్రవిద్యార్థి "వందేమాతరం" అని నినాదంచేసి "భాయిలోగ్" అంటూగట్టిగా ఉపన్యాసం ప్రారంభించాడు. సార్జంటు దగ్గరే ఉన్నాడు. ఇద్దరు పోలీసులు వాళ్లిద్దరి మీద లాఠీలు విసిరారు. మహారాష్ట్ర విద్యార్థికి నోటి నుంచి నెత్తురు కారుతోంది. సార్జంటు వెంటనే మరిద్దరు పోలీసులచేత వాళ్లని లారీలో పడేయించాడు. పోలీసులు చుట్టూ కఱ్ఱలు విసురుతున్నారు. సార్జంటు కాంగ్రెసు జండా విరిచి నేలవేసి కొట్టాడు. ఆంజనేయులు పరిగెత్తుకొంటూ ముందుకు వచ్చాడు. విరిగిన జండా కఱ్ఱలు పుచ్చుకొని పైకెత్తుతూ "భరతమాతకు జయ్. జండా వుంచారహే హమారా" అంటూ పాట పాడుతున్నాడు. సార్జంటు స్వయంగా లాఠీ విసిరాడు. స్థాయిగా నిలబడి దెబ్బ తింటున్న వాళ్లకి దెబ్బతోటి ఉద్రేకం, అహింసాతత్వం కూడా పెచ్చుపెరిగి పోతున్నాయి. దెబ్బలు తిన్నకొద్దీ మరింత సంతోషంతో నినాదాలు చేస్తూ పీఠాలు వేసుకుని కూర్చుంటున్నారు. రాఘవరావు అచేతనుడై నిలబడి చూస్తున్నాడు. ఆ పరిగెత్తే జనంలో పరిగెత్తి పోవడానికికూడా అతని బుద్ధి ముందుకు సాగటం లేదు. జనం వూపుమాత్రం ఒకచోట నిల్చున్న మనిషిని అక్కడ నిలవనియ్యకండా యిటూ అటూ తోసేస్తున్నది. పోలీసులు లాఠీలు విసిరిస్తున్నారేగాని సరిగ్గా జనాన్ని చెదరగొట్టలేకండా ఉన్నారు. ముందు అర్ధ మనస్కతతోటి లాఠీలు విసిరారు గాని జనం కదలని మొండితనం చూసేటప్పటికి వాళ్లకీ ఉద్రేకం వచ్చి లాఠీలు గట్టిగా విసరసాగారు.

రాఘవరావు కదలాలన్నా కదలలేని స్థితిలో జనసమ్మర్దం మధ్య పడివున్నాడు. అతని ముందు నుంచి పాయిగా చీల్చుకుంటూ జనం వెనక్కి పారిపోతున్నారు. ఒక పోలీసు లాఠితో తరుముకొస్తూ నిల్చున్న రాఘవరావు వాళ్ళన దాటి పారిపోతున్న వాళ్ళమీదకు పరిగెడుతున్నాడు. ఎవళ్లో ఆ పోలీసు లాఠీ లాగేశారు. పోలీసులకి కూడా జనసమ్మర్దం చూస్తే లోపల భయంగానే ఉంది. అంతవరకు రాఘవరావు పక్కన ఊరక్కే నుంచున్న పుల్లయ్య ఒక్క ఉరుకున ఆంజనేయులు పక్కకి వెళ్లి 'గాంధీకి జయ్, ఇన్‌కిలాబ్, జిందాబాద్' అంటూ జండా కఱ్ఱ పుచ్చుకుని నిలబడ్డాడు. లాఠీ దెబ్బల కిద్దరు క్రింద పడిపోయారు.

రాఘవరావుకి ముందుకి వెడదామా అని ఉద్రేకం ఉద్రూత లాడింది. స్పృహ తప్పి పోయిన ఆంజనేయులును, పుల్లయ్యను కూడా సార్జంటు లారీలో కెక్కించాడు. పోలీసు లంతా లాఠీలతో లారీ ఎక్కుతున్నారు. జనం ఒక్కసారి కోలాహలంగా ముందుకు సాగబోయారు. రాఘవరావుకూడా ముందుకు రాబోయాడు. చౌక్ వెనక వైపునుంచి కోలాహలంగా జనం పారిపోవటం మొదలు పెట్టారు. అటునుంచి మౌంటెడ్ పోలీసు, గుర్రాలతో జనాన్ని నలగతొక్కుకుంటూ ముందుకు వస్తున్నారు. మరొక వైపునుంచి మిలిటరీ లారీ వచ్చింది. తుపాకులు బారు చేసుకుంటూ గూర్ఖాపటాలం ఒకటి దిగింది. చీమలు పుట్టల్లోకి పాకిపోయినట్లుగా జనం ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ చెల్లాచెదరయి పోయారు. సముద్రంలో అలలతో పుడు ఎక్కడో వచ్చిపడ్డ మనిషిలాగా రాఘవరావు దశాశ్వమేధ ఘట్టంలో పడాడు. గంగమెట్ల మీద నిల్చి చూస్తూంటే చౌక్‌లో సిపాయి తప్ప మనిషి లేడు. నలుగురు విద్యార్థులు స్పృహ తప్పి చౌక్‌మధ్య పడివున్నారు. గూర్ఖా సిఫాయిల తుపాకులు నాల్గువైపులకి బారుచేసి వున్నాయి. ఎటో తుపాకి పేలిన శబ్దం వినబడింది. రాఘవరావు హడావిడిగా గంగవొడ్డున కాలిబాటను నడక సాగించాడు. క్షణికంగా బయలుదేరిన ఉద్రేకం క్షణికంగానే అట్లానే చల్లారిపోయింది. ఎక్కడా ఆగకుండా యూనివర్సిటీకి చేరుకున్నాడు.

గదిదగ్గర కొచ్చేటప్పటికి నుల్చునేందుకు కూడా శక్తి లేదు. మెస్‌కుర్రవాడు తాళలో భోజనం అమర్చుకొని అప్పుడే గదిదగ్గర కొచ్చి నిల్చున్నాడు. "బాబూజీ చాలా ఆలశ్యం అయిందే? కంచం తెచ్చాను." అని హిందీలో అన్నాడు. వాడనే మాటల హిందీ అంతా పూర్తిగా అర్థమయే భాషాజ్ఞానం యిన్నాళ్లు గడిచినా సరిగ్గా రాలేదు. తలుపుతీసి కంచం లోపల పెట్టించాడు.

తిండి సయించలేదు. లైటార్పి అల్లాగే "తఖత్" మీద కూర్చుని ఆలోచిస్తున్నాడు. దేహం అంతా సిగ్గుతో కుమిలిపోతోంది.


నీచప్రవర్తన అయిన సాహసం ఉత్తమ కార్యం అనుకున్నారు. పని చేయటానికి తోడు కాకుండా పోయింది.

దెబ్బలు తిని క్రింద పడి ఉన్న పుల్లయ్య, ఆంజనేయులు తోటి విద్యార్థుల రూపాలు కళ్లముందాడుతున్నాయి. నాలిక ఆడ గల్గినంతసేపు వాళ్లు "గాంధీకి జయ్" అంటూనే ఉన్నారు. తను విడిగా నుల్చునికూడా ఒక్కసారి ఆ నినాదం చేయలేకపోయాడు.

శర్మ గదిలోకి వచ్చాడు. "ఏమోయ్, ఎంత వరకు ఉన్నావేం? ఏంజరిగింది" అని అడిగాడు.

ఏం జరిగిందో సరిగా తనకే తెలియదు. అంతా ఏదో కలలో అర్థం గాకుండా జరిగినవి. మయాల్లాగున్నాయి అవన్నీని. ఆంజనేయులు,

(21 వ పేజీ చూడుడు)



ఈ నెల 10-వ తేదీని భారతదేశంలో తుదిపర్యాయం బ్రిటిష్‌రాజు జన్మదినోత్సవం జరిగింది. ఈ సందర్భంలో ఢిల్లీ ప్రభుత్వభవనంలో విందులో పాల్గొన్నవారు పండిట్ నెహ్రూ, రష్యా రాయబారి, లేడీ నై, జనరల్ కరియప్పగార్లు.

విషయ సూచిక

భారతీయ పరిశ్రమల స్థితిగతులు

శ్రీ కే. గోపాలకృష్ణ

ప్రపంచపారిశ్రామిక దేశములసమీపమున హిందూదేశము సంపాదించుకొన్న స్థానమెట్టిది? నాగరిక దేశములను ముఖ్యముగ పశ్చిమదేశములను ప్రామాణికముగా చూచిన మనదేశము పారిశ్రామికముగ వెనకబడియుంట మనపరిశ్రమల అభివృద్ధి అలస్యమనుట నిస్సందేహము. అయ్యది శోచనీయముకూడ. నవయుగపరిశ్రమ, అనగా, యంత్రశక్తి యుపయోగింపబడిన పరిశ్రమ మనదేశమున ప్రవేశపెట్టబడి శతసంవత్సరములే అయినది. 19వ శతాబ్దమధ్యమునసే యిట్టి పరిశ్రమలు ప్రవేశపెట్టబడినవి. పారిశ్రామికానుగుణ్యమయిన మూలపదార్థములు (*Resources*) అవకాశములు (*Opportunities*) ఉన్న దేశము శతసంవత్సరములయినను, పారిశ్రామికముగ అభివృద్ధి చెందలే దనుట సిగ్గుచేటు. చిన్నదేశమయ్యు జపాను పారిశ్రామికముగా అనన్యసాధారణమయిన ప్రతిభను అభివృద్ధిని చూపగల్గినది. భూవైశాల్యమున చిన్నదయ్యు పెద్దదయ్యు ఏదేశమయిన, పారిశ్రామికముగ ప్రపంచమునందు అగ్రగణ్యత నొందవలెననెడు నిశ్చయము, నిర్ధారణ, పట్టుదల ఉన్న యెడల ఆదేశము అసమానమయిన, పరుల కసూయ కల్గించునట్టి ఫలితముల నొందగల్గును. శీతోష్ణస్థితి అంగీకారయోగ్యమై, మానవశక్తి సుసమృద్ధమై, ముడిపదార్థము లతివిస్తరములై, ఖనిజలోహాదు లత్యంతవిరివిగా నున్న మనదేశము శతసంవత్సరములయినను ఎవ్విధమయిన అసమానమైన అభివృద్ధిని, పేర్కొనదగిన ప్రతిభను చూపకపోవుట ఏ భారతీయుడును గర్వింపదగ్గవిషయము కానేరదు. కాని, విచారింపదగినది కాదు. దీనికారణము అందరికి తెలిసియున్నదే— బానిసబ్రతుకు; అభివృద్ధి నొందచేసిన స్వదేశప్రయత్నముల నరికట్టు శ్వేతమలాందత, ప్రభుత్వ ఉపేక్ష.

హిందూదేశము సర్వకాలసర్వావస్థలయందు పారిశ్రామికముగ వెనుబడియున్న దురదృష్టదేశమా? కాదు, ముమ్మాటికి కాదు. నిస్సందేహముగా కాదు. ఈమాటలు నేనే కాదు; స్వల్పయింగితజ్ఞానము స్వల్పదేశభక్తి యున్న ప్రతీభారతీయునకు యీవిషయమున నొక్కివక్కాణింపగలశక్తి యున్నది. చారిత్రకపుటల నొక్కసారి త్రిప్పిచూచిన గణనీయమయిన, గర్వింపదగిన గొప్పతనము మనచరిత్రయందు సుస్పష్టము. పురాణప్రసిద్ధమయిన మతమునకు మన మాతృభూమి పుట్టినిల్లు. సారమయిన సారస్వతమునకు స్వగృహము. కళకు కన్నతల్లి. ఇన్నివిషయములయందు వన్నెకెక్కిన భారతభూమి పూర్వము పారిశ్రామికముగా నభివృద్ధిచెందలే దను ఊహ దురూహ్యము. గృహపరిశ్రమలకు భారతభూమి గని. రాకపోకలు సులభసామాన్యము కాని రోజున, జ్ఞాన మభివృద్ధిచెందనినాడున మనదేశమంత అభివృద్ధిని చెందియుండ, అన్నిసదుపాయములు కల్గియున్న యీనాడు మనదేశము వెనుకబడియుండ శోచనీయమయ్యు విచారింపదగనిది.

"నవయుగపారిశ్రామికవిధానమునకు పుట్టినిల్లయిన యూరపుదేశము, అనాగరకజాతులకు నివాసయోగ్యమయియున్న కాలమున హిందూదేశము, రాజుల సంపదకు ప్రజ్ఞాధురంధరులయిన శిల్పుల (*Craftsmen*) నేర్పరితనమునకు పేరొందియుండెను". అని ప్రభుత్వముచే నియమింపబడిన ఒకానొక సంఘము ముప్పదిసంవత్సరముల క్రితము ఒకానొకనివేదికను తయారుచేసినది. ప్రస్తుత పరిశ్రమలకు పురాతనకాలమున పునాదిరాయి వేయబడియేయున్నది. 5000 సం॥ క్రితము వెలసిన సైంధవనాగరికతయందు నేతపరిశ్రమ సర్వసామాన్యమే. ఇనుము మొదలగు లోహసంబంధవస్తువులు ప్రబలముగా నుండెను. రాగివస్తువులకు లెక్కలేదు. పెద్ద రాగిసామానులను యిటీవలనే చరిత్రపరిశోధకులు గుంజీరియా (*Gungeria*) అనుచోట కనిపెట్టినారు. శీతోష్ణాది వాయుస్థితులకు శిథిలముకాని చంద్రగుప్తుని యినుపస్తంభమే ఇనుప ఉక్కు పరిశ్రమలకు ప్రామాణికమ్ము. మొగలులకాలమున సంచారముచేసిన బెర్నియర్ టేవర్నియర్ల వ్రాతలే హిందూదేశవస్త్రసంపదకు, బంగారువెండివివితకు నగిషీపనలందు నేర్పునకు తార్కాణము. అనుదినావసరములయిన యీవస్తువులను తయారుచేయు పరిశ్రమలేకాక కళను పోషించెడి పరిశ్రమలుకూడ అప్పుడుండెను. పవిత్రకాశి యిత్తడిసామానుల పరిశ్రమకు పేరొందియుండెను. సౌందర్యకాశ్మీరు శాలువలకు ప్రసిద్ధి. చారిత్రకప్రసిద్ధమయిన మూర్షిదాబాదున సిల్కుపరిశ్రమ విరివిగా సాగుచుండెను.

ప్రాచీనహిందూదేశపరిశ్రమలు ముఖ్యముగా గ్రామపరిశ్రమలు. హిందూదేశమున కెల్లప్పుడు గ్రామములే వెన్నముక. అనేక నగరములు యీనాడు మన దేశమందున్నను 7 లక్షల ప్రజలు పల్లెలందు నివసించుచున్నారు. రాకపోకలానాడు లేనందున దేశవైశాల్య మతివిస్తరమయినందున, అప్పటి గ్రామములు స్వయంపోషకములు, స్వయం సమృద్ధములు నయియుండవలసివచ్చెడిది. గ్రామములందు చాలమంది వ్యవసాయము చేయుచుండినను కొన్నికుటుంబములు వంశపారంపర్యముగ కళాపరిశ్రమ సాగించెడివారు.

ఆనాటి జీవితము సామాన్యమగుటచే ఆవశ్యక విషయము లప్పుడతిస్వల్పము. మరియు వారు సులభముగా లభించెడి ముడిపదార్థములనే వాడుచుండిరి. కర్ర యినుము ప్రత్తి సులభములుగాన వీనినే ఆనాటి పారిశ్రామికులు విరివిగా నుపయోగించెడివారు. ఆనాటి వ్యాపారము వస్తువులను తయారుచేయు పారిశ్రామికునకును, వస్తువు లావశ్యకమున్న వారికిని జరుగుచుండెడిది గాని, ఇప్పటి మధ్యవర్తులుండెడివారు కారు. పరికరములు సామాన్యమయినవయినను వాని సాయమున ప్రజ్ఞాధురంధరుడయిన భారతీయశిల్పి అసాధారణమయిన కళావిశేషములను తయారుజేయ గల్గియుండెను.

అనాడు నగరవాసముకూడ యుండెను. కళానిపుణు లిచటను నివసించుచుండిరి. వారి లలితకళావిశేషములు తమదేశమందే కాక పరదేశములందుకూడ ముఖ్యముగా అరేబియా, చైనా, మలయా, పెర్షియా ఇటలీలందు అమ్మబడుచుండెను. పెట్టుబడికయి వీరు స్వదేశీధనికులపైనను, వర్తకులపైనను ఆధారపడియుండిరి. ఈవిధముగా శిల్పి (*Artisan*) ధనికుని సేవకుడయ్యెను.

16వ శతాబ్దమున వ్యాపారముచేయ ఈస్టిండియా కంపెనీ వచ్చినప్పటి పరిస్థితి యిది. తొలుత యీ ఐరోపావర్తకులు తమవస్తువులను హిందూదేశవస్తువులతో మార్చుకొనెడివారు (*Exchange*). ఆవిధముగా ఉన్ని మొదలగు ముడిపదార్థములతో భారతీయసుగంధద్రవ్యము ప్రత్తివస్త్రములను మార్చుకొనెడివారు. కాని భారతీయవర్తకులు ముడిపదార్థములందు శ్రద్ధచూపక బంగారు, వెండి వీనియందు అపేక్ష గొనియుండిరి. అందుచే పరదేశవర్తకులు వస్తువులను తామే తయారుచేయించుకొన మొదలిడిరి.

కంపెనీవారు తొలుత యంత్రాగారములను నిర్మింపకపోయినను తరువాత స్వంతధనమునందు యంత్రశాలల నిర్మించి అందు దేశీయశిల్పులకు వేతనము లిచ్చి పని చేయించెడివారు. ఈవిధముగ ప్రస్తుత పారిశ్రామిక విధానము ప్రవేశపెట్టబడినది. కాని యీనాటికిని ఆనాటికిని పారిశ్రామిక విధానములో ఒక్కటే భేదము. ఈనాడు యంత్రశక్తి యుపయోగింపబడుచున్నది. ఆనాడు కేవలము మానవశక్తి.

ఈవిధముగ తయారయిన వస్తువులు ఇంగ్లండు మొదలగు యూరపియను దేశములందు ప్రాముఖ్యత, ప్రాధాన్యము, పేరు వచ్చెను. తొలుత ఆంగ్లేయులీ వస్తువులందమితశ్రద్ధను చూపుచుండిరి. హిందూదేశవస్త్రములను ధరించుట అప్పుడొక నాజూకుగా మారెను. కాని, కొంతకాలమునకు ఇంగ్లండుపారిశ్రామికులు హిందూదేశవస్త్రములవలన తమ పరిశ్రమలకు నష్టము కలుగుచున్నదను ఒకఅలజడిని లేవదీసిరి. 1720 నాటికి ఇంగ్లండులో హిందూదేశవస్త్రములు యించుమించుగా నిషేధింపబడెను. 1813లో వీనిపై అమితముగా సుంకములను విధించిరి. తూర్పుయిండియా కంపెనీకూడ తన వ్యాపారవిధానమును మార్చుకొనెను. భారతశిల్పి (*Artisan or Craftsman*) నాపగోగము తగ్గెను. యంత్రములందు తయారయినవియు, చవకయిన వస్తువు భారతదేశమునకు దిగుమతి కాజొచ్చెను. ముడిపదార్థములు ఇచ్చటినుండి ఎగుమతి చేయబడెను పురాణప్రసిద్ధమయిన భారత పరిశ్రమల త్రోసిపుచ్చి, సీమలో తయారయిన వస్తువుల కన్నివిధముల సహకారము, తోడ్పాటు, ప్రోత్సాహ మొసంగబడెను.

భారతశిల్పియొక్క స్థితి అధ్వాన్నము కాజొచ్చెను. స్వదేశవ్యాపారమంతయు పరదేశవస్తువులతో నిండిపోయెను. చవకయిన మాంచెస్టరు (*Manchester*) మిల్లువస్త్రములు విరివిగా వాడబడుచుండెను. అందమయినట్టి, చవకయినట్టియు యీ పరదేశవస్తువులతో హిందూదేశవస్తువులు పోటీ చేయలేకపోయెను. క్రొత్తగా కనిపెట్టబడిన శాస్త్రీయవిధానములు హిందూదేశపరిశ్రమలకు వేరుపురుగయ్యెను. హిందూదేశఇండిగోపరిశ్రమ శాస్త్రీయరంగుల ధాటికి ఆగలేకపోయెను. కనూజ్ నందు తయారయ్యెడి సహజసుగంధద్రవ్యముల పేరే లేకుండపోయెను. ప్రస్తుత శాస్త్రీయమందులు రాహువై, యూనాని, ఆయుర్వేద ఔషధచంద్రులను కబళించెను. ముడిపదార్థములు ఎక్కువగా కావలసినందున లలితకళానిపుణులుకూడ వ్యవసాయము చేయ మొదలిడిరి. కాని వీరికి స్వంతభూమి లేనందున వీరు కూలీలుగా మారిరి. వీరే "భూమి లేని కూలీజాతి" (*Landless Labourers*) గా మారిరి.

హిందూదేశమున పరిస్థితు లిట్లుండ బ్రిటనునందు పారిశ్రామిక విప్లవము సంభవించెను. పారిశ్రామిక పరివర్తన ఫలితముగా ఇంగ్లండు "ప్రపంచకర్మాగార" మయ్యెను. 19వ శతాబ్దమధ్యమున గాని హిందూదేశమున యంత్రబలము పరిశ్రమలందుపయోగింపబడలేదు. ప్రథమమున ప్రత్తివస్త్రములను తయారుచేయుటకై యంత్రబలముపయోగింపబడెను. 1860నాటికి హిందూదేశమున కొన్ని ప్రత్తి, జనపనార యంత్రాగారములు, బొగ్గుగని పరిశ్రమ స్థాపింపబడెను. ఈ సమయముననే ఘామశకటములు కూడ ఉపయోగింపబడెను. 1900 నాటికి ప్రత్తి, జనపనార పరిశ్రమ లభివృద్ధి నొందెను. బొగ్గుపరిశ్రమ ద్విగుణీకృత మయ్యెను. 1905సం॥ ప్రాంతమున స్వదేశవస్తువులకు సానుభూతి చూపబడినందున పురాతనపరిశ్రమలు మరల తల లెత్తెను. కార్మికుల సంఖ్యబట్టి మన దేశపారిశ్రామికాభివృద్ధిని తెలిసికొననగును. 1892నాటికి వీరి సంఖ్య 3 లక్షలు; 1914 నాటికి 9 లక్షలు.

ప్రథమప్రపంచమహాసంగ్రామమువలన పరిశ్రమాభివృద్ధి మనదేశమున బాగుగ జరిగెను. ఇనుప ఉక్కుసామానులు, జనజనార, చర్మ ఉన్ని వస్తువులు మిత్రమండలివారికి కావలసివచ్చెను. పశ్చిమమున యివి సమృద్ధముగా లేనందున హిందూదేశపరిశ్రమ లాభము నందెను. ఈ సమయముననే కాగితము, అగ్గిపెట్టెలు, సిమెంటు, పంచదారపరిశ్రమలు మన దేశమున స్థాపింపబడినవి. 1918-19 లో మనదేశములో నున్న రిజిష్టరుకంపెనీలు 2,700 పైమాట. వాటి మొత్తము మూలధనము 100 కోట్లరూపాయలు. 1921-22 లో నున్న కంపెనీలు 4,700 పైబడి యుండెను. వాటి మూలధనము 220 కోట్లు. ఇంత అభివృద్ధికి మొదటి ప్రపంచయుద్ధమే కారణ మనుట నిస్సందేహము. కాని 1922 లో యీ అభివృద్ధి తగ్గెను.

రెండు ప్రపంచయుద్ధములమధ్య మన పరిశ్రమలు చాల అభివృద్ధి నొందెను. ప్రత్తిపరిశ్రమ యీ 20 సం॥లలో పేర్కొనదగిన అభివృద్ధి నొందెను. భారతదేశము ఉక్కుపరిశ్రమయందు స్వయంసమృద్ధ మయ్యెను. కాని యిందువలన మన దేశము పారిశ్రామికదేశ మయ్యె నని చెప్పలేము. ఇంతకుముందు పేర్కొన్న విధముగా కార్మికసంఖ్య ననుసరించి పరిశ్రమాభివృద్ధిని మనము అంచనా వేయగలము.

1897నాటి	కార్మికసంఖ్య		4, 21,000.
1914	,,	,,	9, 51,000.
1922	,,	,,	13, 61,000.
1939	,,	,,	17, 51,000.

ద్వితీయప్రపంచమహాసంగ్రామము హిందూదేశపరిశ్రమలందనేకమార్పుల కలుగచేసెను. జర్మనీసేనలు ఒకవైపు విజయదుందుభులను మ్రోగించుచుండ జపానుసేనలు త్వరితముగ తూర్పుదేశముల నాక్రమించుచుండ యుద్ధతొలినాళ్లలో యింగ్లండునకు తత్తరపాటు కల్గెను. అందువలన ఇండియా మొదలగు బ్రిటిష్ సామ్రాజ్యభాగములు మిత్రమండలివారికి తమ శక్త్యనుసారముగ సాయము చేయవలసివచ్చెను. తత్ఫలితముగా అద్భుతముగా యినుముఉక్కు పరిశ్రమాభివృద్ధి కల్గెను. 1939లో 15 లక్షల టన్నుల యినుము తయారయ్యెను. 1942 లో 20 లక్షల టన్నులు తయారయ్యెను. ఉక్కు 1939 లో 9 లక్షల (తొమ్మిది) టన్నులు, 1942లో 14 లక్షల టన్నులు తయారయ్యెను. ఈ విధముగనే యితర పరిశ్రమలుకూడ భారగా ఉత్పత్తిచేయ మొదలిడెను.

ఇంత అభివృద్ధి మన పరిశ్రమలందు కల్గినను యంత్రములకై మన దేశము యూరపు, అమెరికాలపై ఆధారపడియుండెను. ఇంతే కాదు. అమ్మోనియా (*Ammonia*), కాస్టిక్ సోడా (*CausticSoda*), క్లోరిన్ (*Chlorine*), బ్లీచింగ్ పౌడరు (*Bleaching Powder*) మొదలగు ప్రాథమికరసాయనద్రవ్యములుకూడ దిగుమతిచేయవలసియుండెను. యంత్రములను చేయు కర్మాగారములను స్థాపింప యుద్ధసమయమున వీలులేకపోయెను. కాని 1941లో ప్రభుత్వమువారు యుద్ధపరికరములను తయారుచేయు యంత్రశాలలను నెలకొల్పిరి. 54 కంపెనీలు ఈవిషయమున లైసెన్సులను పొందినవి. ఈ సమయముననే రసాయనద్రవ్యముల నుత్పత్తిజేయుటకయి ప్రయత్నములు చేయబడెను. 1938-39సం॥లో మన దేశము నుండి యెగుమతిచేయబడిన స్వదేశవస్తువుల విలువ 48 కోట్ల రూపాయలు. 1940-41లో 81 కోట్ల రూపాయలు విలువగల వస్తువులు ఎగుమతిచేయబడెను.

ఇంత అభివృద్ధి మన పరిశ్రమలందు కన్పట్టినను అది అంత సంతృప్తికరమైనది కాదు. ఇప్పుడిపుడే మన దేశమున నౌకానిర్మాణపరిశ్రమ, సైకిళ్ల ఉత్పత్తి, విమానపరిశ్రమ ప్రారంభింపబడినవి. ఫ్యాక్టరీల చట్టము ప్రకారము కొన్నియంత్రాగారముల స్థాపించుటకై ప్రభుత్వసమ్మతి కొన్ని కంపెనీలకు యివ్వబడినది. ఇట్టి కంపెనీలు 1939 నాటికి 11,630. ఈ పరిశ్రమలేకాక మన దేశమున వేరొకవిధమయిన పరిశ్రమలుగూడ కలవు. అవే కుటీరపరిశ్రమలు. ఈ పరిశ్రమలందు రెండు కోట్ల ప్రజలు పనిచేయుచున్నారు.

పారిశ్రామికదేశ మగుటకు కావలసిన సదుపాయము లన్నియు మన దేశమున కున్న వనిన వింత కానేరదు. మన దేశమున అతివిస్తారముగ ప్రత్తి, జనుము పండుచున్నది. విరివిగ ఇనుము బ్రగ్గు లభించుచున్నవి. తరుగని మానవశక్తికా మన దేశ మసమానము. తయారయిన వస్తువులను విదేశముల కెగుమతిచేయవలయునంతటి అగత్యమే లేదు. మన దేశమే, ఒకకొనుగోలుస్థలము (*Market*). ఇన్ని అవకాశములు సదుపాయములు లాభము లున్నను మనము సంతృప్తికరమయిన అభివృద్ధిని చూపకపోవుట సంతాపకరము. దీని కారణమును మన నాయకులు, ఆర్థికవేత్తలు పారిశ్రామికులు గుర్తెఱింగియున్నారు. దీనిని నిరోధించుట కనేకవిధముల కృషిచేయుచున్నారు. కొన్నిరోజులక్రితము నెహ్రూపండితు డిచ్చిన ఉపన్యాసము ప్రపంచములోని అనేక పారిశ్రామికకేంద్రములలో సంతృప్తిని కలుగజేసినది.

మన పారిశ్రామికవిధానము ధనికుని ఇంకా ధనికునిగా చేయక, పేదవాని స్థితిని బాగుపరచునట్టిదయి యుండవలెను. సర్వమంగళదాయకమయి యుండవలెను.

సుఖప్రదమైన గృహవాసం:


సూర్యరశ్మి సహాయంతో, శీతకాలంలో వెచ్చన, వేసవిలో చల్లబాటు

శీతవాతాతపాలకి లోనుగాకుండా సుఖప్రదమైన నివాసం ఏర్పాటు చేసుకోడానికి మానవుడు ఆదినుంచీ కృషి చేస్తూనే ఉన్నాడు. వివిధదేశాలలో అక్కడక్కడి శీతోష్ణపరిస్థితుల్ని బట్టి గృహనిర్మాణ విధానాలు వెలిశాయి. కాలం మారుతున్న కొద్దీ కూడా విధానాలు మారాయి.


ఉత్తరధృవప్రాంతంలో మంచుతో కట్టబడిన ఇళ్లు మొదలు న్యూయార్కులో గగనం చుంబించే మహోన్నత భవనాలవరకూ రకరకాల గృహాలు నిర్మాణమైనాయి.

సుఖప్రదమైన గృహవాసం ఏర్పాటు చేసుకోవాలంటే అనేకసమస్యల్ని పరిష్కరించాలి. ఉగ్ర శీతోష్ణ వాయువులనుంచి శరీరాన్ని కాపాడుకోవడం వానిలో ఒకటి. లోకానికి నిత్యం చిత్రవిచిత్రాలు ప్రసాదించే అమెరికాలో ఈ సమస్యను పరిష్కరించే ఒక గృహం ఇటీవలనే డోవర్ (మెసాఛూసెట్స్) లో నిర్మించబడింది.


వేసవిలో చల్లగానూ, శీతకాలంలో వెచ్చగానూ ఉండి, సర్వఋతువుల్లోనూ గృహవాసం సౌఖ్యప్రదంగా ఉండేటట్లు చేయడానికి ఇందులో సదుపాయం చేయబడింది. సూర్యరశ్మి సహాయంతో ఈ ఏర్పాటు ఎలా చేయబడినదీ ఈ మూడు చిత్రాలలోనూ వివరించబడింది. వేసవిలో వుష్ణోగ్రత, శీతకాలంలో శీతోగ్రత బాధించకుండా సూర్యరశ్మినే ఇందులో పరికరంగా ఉపయోగిస్తారు. గృహం దక్షిణాభిముఖముగా ఉంటుంది. ఇంటికప్పు దక్షిణాన ఎత్తుగా ఉండి, ఉత్తరానికి వాలుగా దిగి, ఉత్తర దిశను చూరుకిందుగా ఉంటుంది. దీనివలన, (ఉత్తరమెరికా ఉత్తరార్ధగోళంలో ఉన్న సంగతి జ్ఞప్తిలో ఉంచుకోవాలి.) సూర్యుడు భూమధ్య రేఖకు ఉత్తరంగా ఉన్నప్పుడు సూటి కిరణాలు ఇంటిలోకి అధికంగా పడవు.



ఈ చిత్రంలో సూర్యరశ్మిని ఈ గృహంలో ఎలా ఉపయోగిస్తారో చూపబడింది. శీతకాలంలో సూర్యకిరణాలు సూటిగా గృహద్వారముఖంపై పడతాయి. ఇంటి పైఅంతస్తున కప్పబడిన రెండుపొరల గాజుపలకలపై సూర్యకిరణాలు పడి, అవి ఆ పలకగుండా వెనుకనున్న నల్లని లోహపు పలకపై పడతాయి. ఈ లోహపుపలక వేడిమిని గ్రహిస్తుంది. విద్యుచ్ఛక్తిపంకాలు విసిరి పలకవద్దనుంచి వేడిని గాలిసహాయంతో క్రింది అంతస్తులోని అలమార్లవంటి నిలయాలకు ప్రసరింపచేస్తారు. ఆ నిలయాలలో పాత్రలతో నిండిన గాఙల్స్‌సాల్టు వేడిని గ్రహిస్తాయి. ఇంటిలోకి వెచ్చన కావలసినప్పుడు వేడిమిని ఈ నిలయాలలోనుంచి శీతోష్ణప్రసారగణనరీత్యా నిర్మించబడిన పంకాలద్వారా గదుల్లోకి విసురుతారు. కొంతసేపు విసిరినతరవాత తిరిగి గాలిని అలమార్లలోకి లోవర్లద్వారా (ఒకరకం తూములు) పంపుతారు. దానిని అటకలపైకి పంపి తిరిగి వెచ్చచేస్తారు.



శీతకాలంలో చలి అధికంగా ఉన్నప్పటికీ, సూర్యునికిరణాలు దిగువకోణంనుంచి ప్రసరిస్తాయి కాబట్టి, పైకప్పులో కిరణాలు సులువుగా ఆకర్షింపబడతాయి. వానిద్వారా ఇల్లు వెచ్చన చేసుకుంటారు.



వేసవిలో సూర్యుడు ఆకాశంలో ఎత్తుకోణంలో ఉంటాడు కాబట్టి ఇంటిలోకి అట్టే వేడిమి ప్రవేశించదు. చల్లగా ఉంటుంది.

శబ్దము లేని చంద్రుడూ, శబ్ద మున్న ప్రపంచం

శ్రీ వి. పాల్ ప్రసాదరావు

చంద్రుడిలో గాలీ లేదు; ప్రాణులూ లేవు; పోనీ రాకెట్టులో ఎవరన్నా వెళ్లి దిగితే వాడు పీల్చేగాలిని వాడు పట్టుకెళ్లాలి. ప్రక్కన అగ్నిపర్వతం బ్రద్దలైనా వీడికి వినిపించదు. పగలు సూర్య వేడిమి తీక్ష్ణత ఎక్కువగా ఉంటుంది. నేల మాడిపోతుంది. పోనీ వాయువన్నా ఉంటే, ఈ వేడిని అటూఇటూ కలియబెట్టేది. అదీ లేదు. గాలి లేనిదే ఆవిరి మాత్రమెట్లా ఉంటుంది? కాన అదీ లేదు. సూర్య వేడిమి తీక్ష్ణత తగ్గించడానికి మబ్బూ కప్పదు. రాత్రులలో చంద్రుడు మరీ చల్లగా ఇగపైపోకుండా ఉంచటానికి కంబళిలాటి మబ్బూ లేదు. గాలివంటి దుప్పటీ లేదు. ఉష్ణోగ్రత తారతమ్యాలలో బ్రతుకటే కష్టం. పోనీ భూమి మీదికి తిరిగి వస్తే గాలి లేదనుకుందాము. ఏదో విధంగా ఊపిరిపోసుకుంటున్నా, బాహ్యప్రపంచానికీ మనకూ వినికిడి సంబంధమే చాలవరకు ఊడిపోతుంది. ప్రక్కన మనిషి మాట్లాడితే మనకు వినిపించదు. ఒక కర్రపట్టుకొని, ఒక ప్రక్క,నొకరు అరిస్తే, మరొకరు మరొకప్రక్క చెవి అతికిస్తే, మాట వినబడుతుంది; లేక నీటిలోకెళ్లి మాట్లాడితే, నీటిలో చెవిబెట్టి వినాలి; వాయువు లేదు. అందువల్ల దానిలో శబ్దమూ లేదు. గాలిలేని లోకం నిశ్శబ్దప్రపంచమే. గంట కొట్టుకుంటూనే ఉంటుంది; గంటశబ్దం వినిపించదు. బళ్లె వెనకగా వస్తూవున్నా అది నెట్టిందాకా తొలగనే తొలగలేము.

శబ్దము ఉద్భవించాలంటే, శబ్దంచేసే వస్తువుండాలి. గంట మోగిందంటే, గంట మధ్య గుండు గలగల కొట్టుకోవడమే కాదు. గంట అతి త్వరితంగా, సెకండుకు కొన్నివందలసార్లు వణకాలి. తీగెవాయిద్యములో తీగెను మీటితే, అది సెకండుకు 256 సార్లు ఊగితేనే "స" అనే శబ్దము వినపడుతుంది. మరొక కీచుగొంతు "స" వినిపించాలంటే 512 సార్లు తీగ ఆడాలి. దీనినే ప్రకంపనవేగ మంటారు. ఇది శబ్దించే వస్తువు కొలతేకాదు; ఆ శబ్దము కొలత కూడా. ఒక్కొక్క కల్తీలేని శబ్దాని కొక ప్రకంపన వేగ ముంటుంది.ఎన్నో శబ్దాల ప్రకంపన వేగము కలిస్తే ఒకమాటవుతుంది. ఎన్నో మాటలు కలిస్తే రాగమవుతుంది. ప్రపంచములో గాలి లేకపోతే పై "ఊసే" ఉండదు. వీణ కంపించినా మనకు వినిపించదు; పిల్లనగ్రోవి ఊదినా చెవిని బడదు. హార్మోనియమ్ మెట్లు, పైకి క్రిందికి ఆడినా, డ్యాన్సుకు వీలు కాదు; తాళాలు తబలాలు తాండవమాడినా హుషా రెక్కదు. ఈల వేస్తే కోతిమూతిలాగే కనిపిస్తుంది; అరిస్తే గొంతు పగులతీసుకున్నట్టే ఉంటుంది; గాలిలేని ప్రపంచము చెవిటిప్రపంచమే.

జంతుసముదాయాన్ని చూద్దాము. క్రిమికీటకాదులు కొన్ని పిల్లలను పిలువడానికి గుర్తుగా ఇతరులను తెలిసికొంటానికీ, మరి ప్రేయసిని రాబట్టడానికి, శబ్దాలు చేస్తవి. చిమ్మటలు, ఇలకోళ్ళు, బొద్దింకలూ అరవడం అందరూ గుర్తించే ఉంటారు. మరి గాలి లేకపోతే ఎంత ప్రాణవాయువు ఎక్కించినా, కీటకప్రపంచంలోనూ అది హుళక్కిప్రపంచమే. చిలుకలు ఒకదానితో నొకటి "కీచ్ కీచ్" లాడలేవు, పందిరలో పిచ్చుకలు "పీచ్" "పీచ్" అనలేవు. కాకులు మూకలుగ కూడి "కావ్" బాతాఖానీ కొట్టలేవు. గోరువంకలు కిచులాడలేవు. ఇక కోవెల "కూ...ఊ" అన లేదు; దాని గొంతుకను దాని సతీ వినలేదు; మనమూ విని ఆతృతపడలేము. ప్రపంచములో గాలిఉంటే, ఈ పిట్టలకూతల ప్రకంపన వేగము, చాల ఎక్కువని గ్రహిస్తాము. మనలోనూ, ఆడవారిగొంతు ప్రకంపనవేగము మగవాడికన్నా ఎక్కువ. అనగా ఆడువారివి కీచుగొంతులు. కొద్ది తేడా లుండవచ్చు. మనచెవి 20 నుండి 3800 ప్రకంపన వేగశబ్దాలే వింటుంది. కొన్ని పిట్టలువేసే కూతలు 3800 వేల వేగాన్ని దాటుతవి; అవి మనకు వినిపించవు: కాని కుక్కలకు వినిపిస్తవి. చిన్నప్పటి చదువు చూద్దామ తూనీగ ఝుంకారిస్తుంది. కప్ప బెక బెక లాడుతుంది. పంది గీపెడుతుంది. కుక్క మొరుగుతుంది. గాడిద ఓండ్రపెడుతుంది. గుఱ్ఱం సకిలిస్తుంది, పెద్దపులి గర్జిస్తుంది. ఏనుగ ఘీంకారిస్తుంది. గాలి లేకపోతే ఇవన్నీ వినిపించవే! మరి పుస్తకాలూ మారవలసివస్తుంది. పోనీ ఆ మృగాలలో పిల్ల మొత్తుకునేది తల్లికి వినిపించదు. అత్త చెప్పే మాట కోడలికి సోకదు. పెండ్లాము మగడి కేదైనా చెప్పాలన్నా నిజంగా చెవిలోనే ఊదాలి. గాలి ఉన్నా శబ్దము బాగా పోటానికి గాలి ఒకటే సాంద్రతలో ఉండాలట. దూరపు శబ్దాలు, పగటివేళ మనకు వినిపించవు దీనికి కారణం వేరే శబ్దాల ఆటంకము. గాలి ఎక్కుతూ దిగుతూ వస్తూఉండి చెదరగొడుతుంది. శబ్దాన్ని ఒకేదిక్కున కెక్కువ దూరము పోనివ్వదు. రాత్రిదూరానఉన్న సినీమాపాటలూ వినిపిస్తవి. ఇంట్లో గుసగుసలు బట్టబయల్కై. కారణం గాలిసాంద్రతి సమానంగా ఉండుటే. కాన శబ్దం దూరం వెళ్లగలుగుతుంది. గాలి లేకపోతే పుట్టిన పిల్లవాడి కేకా వినిపించదు. వాడూ శబ్ద మన్న భయపడలేడు. తల్లిజోలపాటలూ వినిపించవు; మాటలూ లేవు, మందలింపూ లేదు.సినీమా కు వెడితే ఫిలిము మాట్లాడాలేదు. మరి వాడు గుర్రమని క్లిక్ అని ఆడితే విని సంతోషించాలేము. బడిలో పాఠాలు చెప్పలేరు. మరి మనవాడు పద్యాలు వల్లిస్తుంటే ఉబలాటపడలేము...గాలి లేకపోతే ఇదంతా శబ్దములేని శూన్యప్రపంచమే.

తన కెప్పుడేం కావాలో, అ దెల్లా తెచ్చుకోవాలో



పక్కాగా తెలిసిన విచిత్రవ్యక్తి

పిల్లలా, పిడుగులా!

ఈమధ్య నొకసారి నేను ఒక మిత్రు డింటికి వెళ్లాను. ఆ మిత్రుడు మాంచి తన్మయంలో ఉన్నాడు. ఆనందం అణుమాత్రం లేకుండా ఉన్నాడు. తన ఆరు మాసాల కొడుకు ఆడుకోవడం చూశాడు. తనుకూడా అచ్చంగా అల్లాగే ఆనందంగా ఆడుకోగల నన్నాడు. పాపాయి మాదిరిగానే నేలమీద వెల్లకిలా పడుకుని కాళ్లూ చేతులూ గాలిలో తన్నుకోవడం ఆరంభించాడు. తరవాత బోర్లపడి, ముంజేతులు నేల కానించి పాకడం మొదలెట్టాడు. తరవాత దొర్లాడు. ఇల్లా అరగంట చేసేసరికి నా మిత్రుడికి సత్తువ ఉడిగిపోయింది. ముచ్చెమటలు పోశాయి. చాలివచ్చినంతి పనయింది, పాపాయి మాత్రం ఇంకా పువ్వులా ఆడుకుంటూనే ఉన్నాడు.

శారీరకంగానూ, మానసికంగానూ పసిబిడ్డలు పయోజనులకంటె చాలా మేలు. ఈ విషయాన్ని చాలామంది గమనించిఉండరు. కాని ఇది నిరూపించగలను. దీనికి పైది ఉపోద్ఘాతమనుకోండి.

పసిబిడ్డలికి చాలా అద్భుత లక్షణాలున్నాయి. అసలు పుట్టకముందే అసాధారణ లక్షణా లుంటాయి. పుట్టకముందు బిడ్డల్ని డాక్టరు అతిసున్నితమైన శస్త్రపరకరాల సహాయంతో పరిశీలించారు. గర్భస్థ శిశువులుకూడా దగ్గుతారుట. తుమ్ముతారు. ఆవలిస్తారు. వారికి ఎగుపులుకూడా వస్తాయి. వేలు చీకుతారుట కూడా. కిచకిచలు పెట్టగలిగితే పకపకమంటారుట. పరిశీలించిన డాక్టర్లు చెప్తారివి. కడుపులో బిడ్డలు ఏడవడం చాలామంది డాక్టర్లు చూశారుట. ఒక గర్భిణీస్త్రీ సినిమా చూస్తున్నప్పుడు గర్భంలో ఉన్న పాపాయికూడా ఆనందహర్షాలు సూచించినట్లు తెలిసింది. ఒకామె ఒళ్లో ఏవస్తునైనా పెట్టుకుని పనిచేస్తున్నప్పుడు గర్భంలోని శిశువు పేచీలు పెట్టి ఏడ్చిందిట. ఒళ్లోంచి ఆ వస్తువు తీసేవరకూ ఊరుకోదుట.

పుట్టని బిడ్డలో మరొక అద్భుతవిశేషం ఉంది. తల్లి శరీరంలోనుంచి బిడ్డ తన సత్తువకు అవసరమైన పదార్థాలు గ్రహిస్తుంది. ఈ గ్రహించడంలో అజ్ఞాతంగానే తల్లి, బిడ్డ చక్కగా ఒకరికొకరు సర్దుబాటుచేసుకుంటారు. బిడ్డకి సున్నసారం (కాల్షియం) కావలసివచ్చిం దనుకోండి. తల్లిశరీరం నుంచి కావలసినంతా సంజురుంటుంది. ఈ ఆదాన ప్రదానాలలో బిడ్డ అవసరాలకే మొదటి పంతు ఇచ్చింది ప్రకృతి. తల్లి ఒంటిలో ఖనిజాల సారం లోపంగా ఉంటే ఉన్న కాస్తా బిడ్డ పీల్చేస్తుంది; తల్లే ఎక్కువ నీరసపడుతుంది. ఒకవేళ తల్లికి ఏ గ్రంథులలోనైనా రసవహనం తగ్గిం దనుకోండి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటే తల్లికి కావలసిన దానిని బిడ్డ సప్లయి చేస్తుంది. అందువల్లనే సామాన్యంగా కొన్ని ధాతువుల లోపం వల్ల బాధపడే స్త్రీలు గర్భిణిగా ఉన్నప్పుడు కొంత కోలుకుంటారు. ఇద్దరికీ కావలసిన ధాతువుల్ని, రసాల్ని బిడ్డ తయారుచేసుకోగలదు. తల్లి, బిడ్డ కష్టసుఖాల్ని సమానంగా పంచుకుంటారు.

ఈత:

పుట్టగానే ఈ విచిత్ర వ్యక్తి హృదయానికి పయోజనుల హృదయాల కంటె రెట్టింపు బలం ఉంటుంది. రక్తంలో ఎర్రకణాలు 80 లక్షలుంటాయి. అంటే మన కున్నదున్నవానికంటె పదిలక్షలో 20 లక్షలో ఎక్కువ. మనకంటె వేగంగా శ్వాస పీలుస్తాడు. రక్తప్రవాహగతి సామాన్య మానవులలోకంటే మేలుగా ఉంటుంది. అందువల్లనే పసిపాపల్లో వర్థమాన శబలత నిత్యం పాలపొంగువలె ఉంటుంది. వారికి ఆహారంలో ధాతువు అధికంగా ఉండాలి. ప్రొటీన్లు మనకంటె మూడురెట్లు కావాలి. ఒక్క సంవత్సరంలో పాపాయి బరువు రెండురెట్లు పెరుగుతుంది.

కొత్తగా పుట్టిన బిడ్డని నీళ్లలో వొదిలితే ఈదగలడు. మెత్తని శరీరాన్ని చేపవలె వొంచి ఈదగలడు. కానయితే పాపం చేపలాగే తలకూడా నీళ్లలో పూర్తిగా ముంచి మరీ ఈదుతాడు. అందువల్ల ముక్కూ నోరూ నీటిపైన ఉండేలా పట్టుకుంటే చక్కగా ఈదుతాడు. పసిబిడ్డలు నీటిలో ఈదే విషయమై డా॥ మిర్టిల్ మెక్‌గ్రా చాలా పరిశోధన చేశాడు. ఈత నేర్వడానికి సరైనవయస్సు మొదటి ఏడాది అని అతనంటాడు. ఏడాది వెళ్లే సమయంలో, అంటే భయం మొదలైనవి నేర్చుకోకముందే, ఈత నేర్చుకోడానికి ప్రకృతి చక్కని అవకాశం, సహజనైపుణ్యం ప్రసాదించిందట.

గట్టిపిండం:

పసిపాప చాలా గట్టిపిండం. ఒక్క చెయ్యి పట్టుకుని ఎత్తవచ్చును. కాలుపట్టుకుని ఎత్తవచ్చును. ఏ ప్రమాదం రాదు. ఒక్క చేత్తో ఏదైనా పట్టుకుని వేళ్లాడగల బలం ఉంది. యుద్ధానంతరం యూరప్‌లో పసిపిల్లలు అర్ధాకలితో చిక్కిపోయినప్పటికీ అనేక విపత్తులనించి బతికి బైటపడ్డారు. నీరుతప్ప ఇంకేమీ తీసుకోకుండా పసిపాప లుండగలిగినంతకాలం మనం ఉండలేం.

పసిబిడ్డ పుట్టినప్పుడు కుడుచుకోగలగడమే అతనికి రక్ష. మూతి, నోరు చూడండి. కింది పెదవి లోపలికి చొచ్చుకుని ఉంటుంది.

దీనివల్ల ఇట్టే చన్నుకొస అందుకోగలడు. బలంగా పట్టిపీల్చడానికి వీలుగా బుగ్గలు దట్టంగా ఉంటాయి. లోబుగ్గల్లో కొవ్వు కండరాలు ఉఓకి బుల్లి ముద్దల్లా ఉంటాయి. స్పర్శకి పెదవు లిట్టే కదుల్తాయి. పైపెదవిని వేలుతో తాకి చూడండి. తాకగానే పెదవులు రెండూ ముందుకొచ్చి తెరుచుకుని, పట్టి పీల్చడానికి సిద్ధపడతాయి.

గుండెబలం, రక్తసార బలాధిక్యత మొదలైనవి కాక, సామాన్యంగా అందరిలోనూ సృష్టి అయ్యే రోగనిరోధక పదార్థాలు తల్లివద్దనుంచి బిడ్డ పొందుతుంది. అందువల్లనే కొత్తగా పుట్టినబిడ్డకి ఆరంభమాసాలలో రోగాలు దరిచేరవు. తరవాతమాత్రం పడిస్తాయి. రెండువారాలలోపు బిడ్డలకు పడిశం పట్టడం ఎక్కడా ఎవరూ చూడరు. ఆ తరువాత కూడా ఇంట్లో అందరూ దగ్గులతోనూ తుమ్ములతోనూ బాధపడుతున్నాసరే పసిపాపలకి అంటేది బహు కొద్ది.

అందరి శరీరాల్లోనూ రోగనిరోధక శక్తి గల పదార్థాలు సృష్టి అవుతాయి. వీటిలో కొన్ని మంచివి. కొన్ని చెడ్డవికూడా ఉంటాయి. చెడ్డవి అంటే స్వతహాగా రోగనిరోధకాలే అయినా అపదార్థాలు ఆ శరీరతత్వానికి పడవన్నమాట. కాని విచిత్ర మేమిటంటే, శిశువుల్లోమాత్రం మంచివే సృష్టి అవుతాయికాని చెడ్డవి అసలు పుట్టనేపుట్టవు. "ఇదేం అన్యాయమో కాని, శిశువులపట్ల ఈ పక్షపాతం ఏమిటో, ఎల్లా సంభవిస్తోందో తెలియడంలేదు" అని హార్వర్డు పరిశోధకుడు డా॥ క్లెమెంట్ స్మిత్ అంటాడు.

తొమ్మిదిమాసాలు గర్భంలో గడిపి, ఆతరువాత బహిఃప్రపంచంలో శిశువు ఎలా సమర్థించుకు పోతాడో చూస్తే వింతగా ఉంటుంది. ఇల్లాసర్దుకుపోయే శక్తి శిశువుల్లో అపారం. గర్భంలో ఉన్న తొమ్మిది మాసాలూ దెబ్బలు తగలకుండా, ధ్వని వినిపించకుండా ప్రపంచంలోని సర్వ-అసౌఖ్యాలకీ దూరంగా ఉంచుతూ శిశువుల్ని గర్భకుడ్యాలూ చుట్టూ చిక్కని ద్రవమూ రక్షించాయి. గర్భస్థ శిశువుల్ని సామాన్యంగా ప్రమాదా లంటవు. తల్లి కిందపడినా తన్నులుతిన్నా చెక్కు చెదరని శిశువులున్నారు.

ఆకస్మికంగా ఒకరోజున శిశువు ఈ స్వర్గాన్ని విడిచి భూమిపైన అవతరిస్తాడు. చంచలశీతోష్ణాలతో నిమిత్తం లేకుండా కన్ను విప్పి చూడనక్కరలేకుండా గడిపిన స్వర్గధామాన్ని విడిచి, చీకటివెలుగుల్లోకీ నిత్యచంచల శీతోష్ణవాతావరణంలోకీ, శబ్దమయప్రపంచంలోకీ వచ్చిపడతాడు. ఇదివరలో వెతుక్కోకుండా ఆహారం లభించేది. ఇప్పుడు వెతుక్కోవాలి. గర్భంలో తేలియాడిన శిశు విప్పుడు పడకపై శయనించాలి, ఎంత మృదువైన హంసతూలికాతల్పాలు రచించినా మాతృగర్భంతో సమానం కాదు. పూర్వం క్రిమికీటాదుల బాధ ఎరుగని పాప ఇప్పుడు వానిచేత ముట్టడించబడుతుంది. ఇంతవరకూ గాలితో నిమిత్తం లేకుండా గడిపిన పాప ఇప్పుడు శ్వాసకోశాలను విప్పి ఉచ్ఛ్వాసనిశ్వాసాల కుపక్రమించాలి.

"అసలు శిశువులు బతుకుతున్నా రంటేనే వింతల్లోకెల్ల వింతగా ఉంది" అంటుంది న్యూయార్కు నగర ప్రజారోగ్య శాఖోద్యోగి డా॥ లియోనా బామ్‌గార్ట్నర్.

అన్నీ తెలుసును:

శరీరబలంలోనే కాదు, శిశువులశక్తి సామర్థ్యాలు కనిపించేది. శిశువులకి సునిశిత వివేచనాబుద్ధి, సూక్ష్మబుద్ధికూడా కనిపిస్తాయి. తన కెప్పుడేం కావాలో, అ దెల్లా తెచ్చుకోవాలో పాపాయికి తెలుసును. సమాజంతో వ్యవహరించడానికి రెండు చక్కని సాధనా లున్నాయి నవ్వు, ఏడుపు.

నవ్వు ముఖంలో క్రమంగా మెల్లగా వికసిస్తుంది. మొదట ఏదో వింత భంగిమ ముఖంలో కనపడుతుంది. అది చూసేవారి దృష్టికి ఆని తిరిగి పరిశీలన కుపక్రమించేసరికి హాసం వికసించి ముఖం వింతవెలుగు విరజిమ్ముతుంది. ఈ మధుర హాసం సమాజంలో బాగా చలామణీ అవుతుంది. ఫలితం అధికం. ఈ నవ్వుతో మొదట చిన్న కేరింత, లేక ఒక కితారింపు వస్తుంది. ఆ పైన కిలకిలా, పకపకా నవ్వు. ఏడుపుకూడా సరిగ్గా ఇదేవిధంగా ప్రయోగిస్తాడు. ఏడుపుతో అమ్మనో, నాన్ననో, లేక ఇద్దరినో పిలుచుకుంటాడు. వారివల్ల ఆహారం రప్పించుకుంటాడు. సంరక్షణ చేయించుకుంటాడు.

శిశువుయొక్క విషయ పరిగ్రహణాపాటవంలో, నవ్వు ఏడుపుల నెలా ఉపయోగించాలో ఎంత శీఘ్రంలో నేర్చుకోగలడో చూస్తే ఆశ్చర్యమౌతుంది. ఒక్క ఏడాదిలో డజను నూతన నైపుణ్యాలు ప్రతి శిశువూ నేరుస్తుంది. ఇంత శీఘ్రంగా నేర్వడం పయోజనులకి సాధ్యం కాదు. మొదటి ఏడు బోర్లపడ్డం, పాకడం, కూచోడం, నిలబడ్డం, నడవడం నేరుస్తారు. రెండో ఏడాది నిండేసరికి తప్ప తప్ప మాటల మొదలు మాట్లాడ్డం వరకూ నేరుస్తారు. తల్లినీ తండ్రినే కాక బంధువర్గాన్ని, మిత్రవర్గాన్ని, గుర్తించగలరు. అప్పటివరకూ నేర్చిన దానికి ఆపైన మెరుగులు పెట్టడం మాత్రమే మిగుల్తుంది. జ్ఞానాంశాలు స్థూలంగా ఆ బుల్లి బుర్రలో అప్పటికి ఇమిడిపోతాయి.

"ఒక్క ఏడాదిలో శిశువు నేర్వగలిగినన్ని విషయాల్ని పయోజనుల్లో ఎవరైనా నేర్వగలిగితే, వారిని మహామేధావు లని చెప్పవచ్చును" అని వ్రాసిం ది న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్‌లో ఇసబెల్ పాటర్సన్.

మానవశరీరం యంత్రంలాగే కొన్ని కఠిన నియమాల ననుసరించి నడుస్తుం దంటాడు డా॥ ఆర్నాల్డ్. పళ్లు వచ్చేటప్పుడు గడ్డం కొంచెం ముందుకి వస్తుంది. దవడఎముకలు బలపడతాయి. జీర్ణకోశం పెద్దదవుతుంది అప్పటికి పాపాయికి అన్నం పెట్టడం ఆరంభించవచ్చును. పుట్టినప్పుడే శిశువులకి నడవడానికి అవసరపడే కండరాలు అన్నీ ఉంటాయి. నిజానికి చేత్తో పట్టుకుంటే కొద్దిరోజుల పాప కూడ నడవడం చూశాం. ఏ శిశువునైనాసరే చేతులు పట్టుకుని లేవదీసి నిలబెడితే, ముందుకి అడుగు లేస్తుంది. కాని తూలిపోకుండా నిలబడగలిగే సూక్ష్మం గ్రహించలేరు కాబట్టి నడవలేరు. ఇదే రీతిగా ఇతర శారీరక, మానసిక వ్యాపారాలు కూడా ఆ సమయం వచ్చేసరికి అది నేరుస్తారు.

అసలు ఈ విచిత్ర వ్యక్తిని గురించిన వింత సత్యాలు చెప్పడం ఇంతటితో ఆపెయ్యవచ్చును. కాని ఈ సత్యాలవల్ల కొన్ని విషయాలు పయోజనలు తెలుసుకోవలసినవి ఉన్నాయి.

పాపాయి చాలా విచిత్రవ్యక్తి. సాహసం, పట్టుదల, వివేచన, సహకారబుద్ధి అతనికి ఉన్నాయి. జనంలో కలిసి, జనంతోపాటు నివసించడానికి వస్తాడు. నలుగురిలోనూ చేరడానికే ఆతురపడతాడు. మనం తప్పకుండా నూతన ఆగంతకుల్ని ఆహ్వానిస్తాం. అతన్ని ప్రేమతో ఆదరిస్తాం. కాని మన ప్రేమాదరాల్లో కూడా "మొక్క ముదరకుండానే వెన్నువంచాలి" అనే సామెతకి స్థానం ఏర్పడింది. దీనివల్లనే నిర్దయగా చెయ్యి చేసుకుంటాం.

పసిపిల్లల్ని మనం ఆదరించే పద్ధతి చూస్తే, గాలిలో ఈగని మాసి వెన్ను చరుచుకున్నట్టుంది. మన భావాలూ మన వీలునుబట్టి పసిపిల్లల్ని వారి కెప్పుడేది కావాలో వారికే విడిచిపెట్టడం మంచిదనే సలహాని నిరాకరిస్తున్నాం. బిడ్డ ఆకలివేస్తోం దని చెప్తే, ఇప్పుడు తినకూడదని మందలిస్తాం. పడక పాడుచేస్తే తిడతాం. కొడతాం. బిడ్డ కాదన్నప్పుడు బలవంతపెడతాం. ఇష్టం లేనప్పుడు బలవంతాన తినపెడతాం. అక్కరలేదన్న దాన్నే తినిపిస్తాం. వద్దు మొర్రో అంటే స్నానాలు చేయిస్తాం. తెలియనేరని వయస్సులో పసిబిడ్డలకి అలంకారాలు, శ్లోకాలు బలవంతాన నేర్పుతాం. మనం పెద్దవాళ్లం, బలవంతులం. అందువల్ల మనమాటే నెగ్గుతుంది. పెద్దవాడైనప్పుడు మనమాట వినక మంకుపట్టు పట్టితే శత్రుత్వం వహిస్తాం. లేదా డాక్టర్లకి చూపిస్తాం.

అది కాదు మనం చేయవలసింది. ముందు మన మనస్సునీ, మన హృదయాన్నీ శోధించుకోవలసిన అవసరం ఉంది. ఈ నిర్బంధవిధానం కేవలం మన భ్రమ. మన ఊహాపోహల్నిబట్టి నిర్ణయించుకున్నదే. న్యూగినీలో ఒక అనాగరిక జాతి ఉంది. ఆ జాతిప్రజలు, పసిబిడ్డలకు ఏడేళ్లు వచ్చేవరకూ వా రేది కోరితే అది తీరుస్తారు. ఎన్నడూ నిరాకరించరు. ఆ పిల్లలు పాడైపోలేదు సరికదా కుటుంబంలో చక్కగా కలిసిపోతారు. సమర్థులై బాధ్యత నెరిగి ప్రవర్తిస్తారు. వారిలో విధేయత రవంతైనా లోపించలేదని మార్గరెట్ మీడ్ తెలుపుతోంది. అంటే మనం బిడ్డల్ని వారి ఇష్టంవచ్చినట్లు వారిని గాలికి విడిచిపెట్టమని చెప్పడంలేదు. పసిబిడ్డల మనస్సు కనిపెట్టి, వారి కోరికల్ని మన్నించాలని చెప్తున్నాను. తన శరీరారోగ్యానికి ఏది మంచిదో, ఏది చెడ్డదో మనవలెనే పసిబిడ్డలకికూడా తెలుసును.

పసిపాప ఆకలితో ఏడుస్తోందంటే, ఆకలి వేస్తున్నమాట నిజం. అందులో వీసమైనా అబద్ధం లేదు. దాన్నిగురించి వాదించుకోడం అనవసరం. సామాన్యంగా పసిబిడ్డలకి రెండు గంటల్లో బొజ్జ ఖాళీఅయిపోతుంది. వెంటనే "పొట్టలో ఎలకలు ఏడవడం" ఆరంభిస్తాయి. మంట ఆరంభమౌతుంది. జీర్ణకోశం కండరాలు పెరుతాయి. కొత్తగా పుట్టిన బిడ్డకి కూడా ఆ కండరాలు బలంగా ఉంటాయి. బాధ అణుచుకో వీలుండదు. ఎంతపసివారైనా సరే బిడ్డలకి ఆహారంలో ఏది మంచిదో వారికే తెలుస్తుంది.

మన రాష్ట్రం మన దేశం

★ దేశంలో కాంగ్రెస్ పరపతి
★ కలకత్తా ఎన్నికలో పరాజయం
★ మద్రాసుమంత్రుల పై విచారణ

కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశంలో నెలకొల్ప బడినదిమొదలూ, కాంగ్రెస్ సంస్థ పరపతి నానాటికీ తరిగిపోతోందని అందరూ అంటున్నదే. దీనికి హేతువుల్ని గురించి ఇప్పుడు గట్టిగా తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ వారమే ఈ ఆత్మపరీక్ష ఆరంభమయింది. దక్షిణ కలకత్తా ఎన్నికలో కాంగ్రెస్ పరాజయం దీనికి తక్షణకారణం. డెహరాడూన్ ' ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో దాదాపు ఇలాటి విషయం పైనే చర్చ జరిగింది. కాని అది కాంగ్రెస్ మంత్రివర్గాలపై అవినీతి ఆరోపణలు, వారికి కాంగ్రెస్ సంఘాలతోగల తగాదాలకుమాత్రమే సంబంధించినది. కాంగ్రెస్ పరపతి క్షీణించడానికి కాంగ్రెస్‌వాదులమధ్య వైషమ్యాలు కూడా ఒక హేతువన్నారు రాష్ట్రపతి డా॥ పట్టాభిగారు. దేశంలో ఆర్థికపరిస్థితులు దుస్తరంగా ఉన్నందువల్ల ప్రజలకి అసంతృప్తి కలగడంలో విశేష మేమీ లేదన్నారు.

దక్షిణ కలకత్తా ఎన్నికలో కాంగ్రెస్ పరాజయానికి బోస్ కుటుంబ పరపతి హేతువన్నారు. వాస్తవానికి ప్రజాసామాన్యంలో అసంతృప్తి కలగలేదన్నారు. కాని చెన్నరాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు, సంయుక్త రాష్ట్రాల్లో స్థానిక సంస్థానాల ఎన్నికలు బొంబాయి, బాంద్రా ఎన్నికలు చూస్తే డా॥ పట్టాభిగారి వాదం సమర్థనీయం కాదు.

కాంగ్రెసు సంస్థ పట్ల ఆదరశ్రద్ధలుగల అనేకమంది పరిస్థితుల్ని అవగాహన చేసుకున్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు, కాంగ్రెస్ సంఘాలపట్ల పెరుగుతున్న అసంతృప్తిని నాయకులు గ్రహించడంలేదు. వాస్తవ పరిస్థితిని నాయకు లెప్పుడు గుర్తించగలుగుతారా అని నిరీక్షిస్తున్నారు. కొందరు గ్రహించిన కాంగ్రెస్ వారు గుప్తంగా మనసులోనే ఉంచుకుని గ్రహించనట్లే ప్రవర్తించారు. ఈ ఎన్నికలతో నాయకుల్లో కొంత మత్తు వొదిలిందని చెప్పవచ్చును. ఇటువంటి పరాజయం త్వరలోనే రావాలనీ, నాయకులు కళ్లు తెరవాలనీ అనేకులు కాంక్షించారు. విమర్శకు లందర్నీ ద్వేషపూరితులుగా పరిగణించిన నాయకులకు పాఠం చెప్పింది కలకత్తా ఎన్నిక. ప్రజల్లో అసంతృప్తి లేదని భావించడంగాని ప్రచారం చెయ్యడంగాని ఆత్మవంచనే. లోపాలు పరిశీలించుకుని సరిదిద్దుకునే వివేకం వ్యక్తులకిగాని, సంస్థలకిగాని లేకపోతే అధోగతి తప్పదు.

ప్రజావిశ్వాసం:

బెంగాల్, హైద్రాబాదు ప్రాంతాల కల్లోలాలు, అరాచకం గమనిస్తే కాంగ్రెస్ ప్రభుత్వాల, సంఘాల అసమర్థత తెలుస్తూనే ఉంది. ప్రజల్లోనే కాంగ్రెస్‌పట్ల అచంచల విశ్వాసం, గౌరవం ఉంటే, ఇంత అరాచకం అసంభవమని తోచకమానదు. కాని ఈవిషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఒప్పుకోరు. కాంగ్రెస్‌లో అంతఃకలహాలు, విరోధాలు పెరిగిపోవటంవల్లనే కాంగ్రెస్‌పట్ల ప్రజాసమూహానికి గౌరవం నశించింది.

కలకత్తాలో రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్రమోహన ఘోష్ ఇంటిపై కమ్యూనిస్టుల దాడిసంఘటన విచిత్రంగా ఉంది. ఊరేగింపు జరుగుతోంది. పోలీసు బలగం ముందూ వెనకా కాపలా ఉన్నాయి. ఈ ఊరేగింపులో గుంపులు దారిలోఉన్న ఘోష్ ఇంటిపైన దాడి జరుపుతోంటే, పోలీసులు గమనించలేదట. దుండగులు నిరాటంకంగా దౌర్జన్యకాండ జరిపారు. మర్నాడు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ప్రకటన చేసింది. పోలీసులు గుంపుకి చివర నున్నందువల్ల చూడలేకపోయారని సమర్థించారు. సురేంద్రమోహన ఘోష్ మంత్రివర్గ వ్యతిరేకుల వర్గానికి చెందినవాడు. పై సంఘటన గురించి సమగ్రంగా విచారణ జరిపిస్తున్నారట.

ఇది చూస్తే తూర్పుకృష్ణాజిల్లా జ్ఞాపకం వస్తుంది. రెండు కాంగ్రెస్ వర్గాలూ ఒకరి నొకరు కమ్యూనిస్టు లని నిందించుకోడం, పోలీసులు అరెస్టుచేసే కమ్యూనిస్టుల్ని విడిపించడం మొదలైనవి.

కాంగ్రెస్‌పట్ల ప్రజలకి అసంతృప్తి కలగలేదని డబాయించినందువల్ల లాభం లేదు. విమర్శకుల్ని ద్వేషమనస్కులని నిందించడం నిష్ప్రయోజనం. వెంటనే లోపాలు సవరించడానికి కృషి చెయ్యాలి. వైమనస్యాలు, విరోధాలు నిర్మూలించాలనడం బాగానే ఉంటుంది. కాని విరోధాలకు హేతువులు పరిశీలించి చికిత్స చెయ్యాలిగాని ఏఒక్క వర్గాన్ని నిందించడం వల్ల లాభం లేదు. కాంగ్రెస్‌పట్ల అసంతృప్తి కలిగినది ఆశాభంగం కలిగిన స్వార్థాశయపరులకనీ, మధ్యతరగతివారికేననీ సమర్థించ పూనుకోవడం ఆత్మ వినాశకరం.

శంకర్రావ్‌దేవ్ విచారణ:

కాంగ్రెస్ సంస్థకే ప్రమాదకరమైన ఈ పరిస్థితుల్ని చక్క చెయ్యడానికి మన నాయకు లేం చేస్తున్నారు? డెహరాడూన్‌లో చర్చించారు. తరవాత మద్రాసు మంత్రులపై విచారణకి శంకర్రావ్ దేవ్ గారినీ, బీహార్‌లో ఇలాటి విచారణకే శ్రీ కళా వెంకట్రావుగారినీ రాష్ట్రపతి డా॥ పట్టాభిగారు నియోగించారు. దైవికంగా ఇదే సమయంలో డా॥ పట్టాభిగారు మనుమని ఉపనయనానికి చెన్నపట్నం వచ్చారు. శ్రీ శంకర్రావ్ దేవ్ విచారణ ఈ వారం జరిగింది.

జగద్విదితమైన మంత్రివర్గ రాజకీయాలు, విరోధాలనుగురించి శంకర్రావ్ దేవ్ గారు ఒక్కటే మాట ఘంటాపథంగా చెప్పారు. లోలోపల ఎంత శత్రుత్వాలున్నా, కాంగ్రెస్‌కు చెందినవారు కాని సోదర కాంగ్రెస్ వాదులపై బహిరంగంగా నిందారోపణలు చెయ్యకూడదన్నారు. బహిరంగంగా చెప్పకుండా ఉండలేకపోతే కాంగ్రెసును విడిచివెళ్లిపోవాలన్నారు. అంటే ప్రకాశం ప్రభృతులికి ముందే తమ నిర్ణయం చెప్పేశారన్నమాట. కాంగ్రెస్ ప్రజాసంస్థ, జాతీయసంస్థ. ప్రజాస్వామ్యంలో నాయకుల దక్షతకీ, నీతివర్తనకీ ప్రజాదరమే గీటురాయి. ప్రజలు నిరసిస్తారనే భీతి లేకపోతే, అధికారపదవులు పొందినవారు విశృంఖలంగా ప్రవర్తించే అవకాశం ఉంది. పరిపాలకులు నీతిగానే వర్తిస్తారనే గారంటీ ప్రజాప్రాతినిధ్య పరిపాలనా విధానంలో ఎన్నడూ ఉండదు. అలాటి గారంటీ ఇవ్వవలసింది ప్రజాభిప్రాయమనే అంకుశమే. ఇప్పుడు మనమంత్రులు ప్రజాభిప్రాయాన్ని మన్నిస్తున్నారో ఈకలా ఊదేస్తున్నారో వేరే చెప్పవలసిన పని లేదు. అందరికీ తెలిసిందే. శాసన సభ్యుల్ని బట్టే మంత్రులూ ఉంటారు. శాసన సభ్యుల ప్రవర్తనకూడా పై సత్యాన్నే ఋజువు చేస్తోంది. ప్రజాహితం ప్రజాభిప్రాయం వారి మనసుకి పట్టడంలేదు. శాసనసభలో మంత్రి గోపాలరెడ్డిగారి సమాధానాలు చూస్తే ఈ సత్యం గోచరిస్తుంది. సత్యాన్ని కప్పిపుచ్చి, ప్రజల్ని కన్నుగప్పగలననే ధైర్యం, సాహసం ఏనాయకునిలో కలుగుతుందో, ఆ నాయకుడు పరిపాలనాధికారం పొందడానికి అర్హుడు కాడు. ప్రజల్ని కన్నుగప్పడం చాలా సులువు. అందువల్ల అలాటి నాయకుడు అధికార దుర్వినియోగం చెయ్యడానికి వెనుదియ్యడు. పరిపాలనా వ్యవహారం సక్రమంగా సాగాలన్నా ప్రజాస్వామ్యం ప్రజలమేలుకే నిర్వాహకం కావాలన్నా ప్రజాభిప్రాయాన్ని ఆదరించాలనే సూత్రం ప్రధానమైనది. ప్రజల దృష్టినుంచి ప్రజాసంస్థ అయిన కాంగ్రెస్ వ్యవహారాల్ని మరుగుపరచాలనడం మోసంకిందికే వస్తుంది. వాస్తవానికి అది ఆత్మవంచన. ఏసంస్థయొక్క బలంగాని నిత్యప్రవర్ధమాన శక్తిపైనా, కాలంతోపాటు మారగలిగే శక్తిపైనా ఆధారపడి ఉంటుంది. అందువల్ల శ్రీ దేవ్ గారి అభిప్రాయం సంస్థకు క్షేమకరం కాదు.

శ్రీశంకర్రావ్ దేవ్ చెప్పిన మాటలవల్ల, వారి విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందనే నమ్మకం ఎవ్వరికీ లేకుండా పోయింది.

అసలు విచారణ క్రమంలోనే పెద్ద లోపాలున్నాయి. మంత్రిపదవుల్లోఉన్న వారిపైన ఆరోపణల్ని విచారించినట్లే విచారించి, వారు నిర్దోషు లని తీర్పుచెప్పి, మంత్రివర్గాన్ని, మంత్రుల్నీ కాపాడుతున్నారనే అభిప్రాయం దేశంలో ముందే ఏర్పడిపోయింది. విచారణ సందర్భంలో ఉభయపక్షాల ప్రవర్తన చూస్తే, విచారణపట్ల ఎవరికీ శ్రద్ధా విశ్వాసాలు లేవని బోధపడుతుంది. ఇటువంటి విచారణలవల్ల ప్రజలకి కాంగ్రెస్ వాదుల న్యాయదక్షత, న్యాయవర్తనల్లో కూడా విశ్వాసం పూర్తిగా నశిస్తుంది. వారేది చేసినా చివరికి ఫార్సుగానే పరిణమిస్తుంది.

మంత్రివర్గ నాయకుల మనసుకు నచ్చినట్లు విచారణ జరిపినారని భావించడానికి అవకాశమిచ్చారు. అటు ప్రకాశం ప్రభృతులు, న్యాయవిచారణ వ్యవహారంలో అపూర్వమైన విషయం కోరారు. ప్రతివాదుల ప్రతివాద వివరాలు తెలపమని కోరడంలో, వారికి విచారణ జరగడం ఇష్టంలేదనే తప్ప మరొక అర్థమేమీ కనిపించదు. ఈ విచారణ వారికి నచ్చకపోతే ఆ మాట వారు స్పష్టంగా చెప్పివెయ్యవలసింది.

పార్టీనాయకత్వపు ఎన్నికల సమయానికి జ్ఞాపకంవచ్చి పాతకేసులు పెళ్లగించారని రాష్ట్రపతి డా॥ పట్టాభిగారనడంకూడా విచారణని ఫార్సుగానే చేసింది. అనిష్టంగా విచారణ జరిపేకంటే మానుకోరాదా?

కాంగ్రెస్ ప్రతిష్ఠ, కాపాడుకోవాలంటే నిష్పక్షపాతమైన విచారణ జరగాలి.


కాంగ్రెస్‌లో విద్వేషాలు, వర్గవైషమ్యాలు దేశమంతటా ఉన్నవే. చెన్నరాష్ట్రంలోనూ బీహార్‌లోనూ మంత్రులపై ఆరోపణల్ని మాత్రమే కేవలం విచారించి లాభం లేదు. కాంగ్రెస్ సంస్థలో ఈ ముసలం పుట్టడానికి మూలహేతువుల్ని కనుక్కోవాలి. అవినీతి,

(20 వ పేజీ చూడుడు)

డా. క్లారాడేవిస్ ఒక సారి కొంతమంది పసిపిల్లల ముందు కొన్ని పళ్లేలలో రకరకాల ఆహారపదార్థాలు పెట్టింది. ఎంత కావలిస్తే అంత తీసుకుతినడానికి అవకాశ మిచ్చింది. ఒక బిడ్డ తీపి సరుకులు విడిచేసి కాడ్‌లివర్ ఆయిల్ తీసుకు తాగింది. ధాతులోపంవల్ల బాధపడుతున్న ఒక బిడ్డ ఉప్పు బాగా తిన్నాడు. ఉప్పు తినేటప్పుడు ముఖం వికారంగా పెట్టాడు. కాని తినడం మానలేదు.

మీకు, మీపాప మీదే ఆపేక్ష ఉన్నట్లయితే, ఆ పాప పొరపాట్లకి దండించవద్దు. పాపనికూడా ప్రత్యేకవ్యక్తిగా, వ్యక్తిగతావసరాలు, వ్యక్తిగత హక్కులు గల వ్యక్తిగానే ఆదరంగా, పాపవ్యక్తిత్వాన్ని మీ రాదరించాలి. ఇందువల్ల మీఇంట్లో వస్తువులు పెట్టిన చోట్ల ఉండకపోవచ్చు; ఇల్లంతా మన్ను కాగితపు ముక్కలు ఎగురుతూ ఉండవచ్చు; రణగొణధ్వనితో మీ చెవులు చిల్లులు పడ్డం సంభవమే; ఇందుకు మీరు విచారించకూడదు. కాని మీబిడ్డలు శక్తివంతులు, బుద్ధిమంతులు, వివేకవంతులు, ప్రవీణులు, వర్ధమానులూ కాగలరు.

[జార్జి కెంట్]



గాంధీనగర ప్రారంభోత్సవం. అడయార్‌లో కొత్తగా నిర్మింపబడిన ఈ కాలనీకి రాష్ట్రపతి డా॥ పట్టాభిగారు ప్రారంభోత్సవం జరిపారు. శ్రీ శంకర్రావ్ దేవ్, మద్రాసు గృహనిర్మాణ శాఖామంత్రి సంజీవిరెడ్డిగార్లుకూడా చిత్రంలో ఉన్నారు.

మధ్యప్రాచ్యము : 2

బ్రిటిష్, ఫ్రెంచి సంరక్షకుల ద్రోహం

శ్రీమతి కమలాదేవి చట్టోపాధ్యాయ

ఈజిప్టులో ఈ రాజకీయ పరిణామంతో పాటు, మారాన మరొక దిక్కున మరొక పరిణామం ప్రారంభమయింది. అది టర్కీ రాజరికంపై లేచిన విప్లవం. ఈ విప్లవానికి రెండు సాంఘాతిక హేతువు లున్నాయి. మొదటిది ఉదారరాజకీయవాదుల (లిబరల్) టర్కీ యువజనోద్యమం. రెండవది టర్కీ కేంద్రప్రభుత్వాన్ని బలపరచడానికి 1864 లో పరిపాలనావిధాన సంస్కరణలవల్ల వచ్చిన రాజకీయ వాతావరణం. దీని ఫలితంగా టర్కీలోని అన్ని రాష్ట్రాలలోనూ తుర్కీభాషను నిర్బంధంగా విధించారు. దీనిపై ప్రజలలో తీవ్రఅసంతృప్తి కలిగింది. ఎందుచేతనంటే అరబ్ భాషాభ్యసనం, అరబ్బీ సాంప్రదాయ పునరుద్ధరణ అరబ్బీ జాతీ యైక్యతాందోళనకు ప్రధానాంశాలు. అరబ్బీ జాతీయోద్యమాభివృద్ధికి టర్కీ యువజనులు ఇస్తాంబుల్ లో అల్-ఇఖా అల్-అరబీ అల్-ఉత్మనీ స్థాపించారు. ఇది కొన్నాళ్లు ఉచ్ఛదశలో ఉంది. కాని టర్కిష్ సుల్తాన్ అణిచివేశాడు. అప్పుడిది గూఢసంస్థగా పనిచేసింది. అరబ్బీదేశాలలో గూఢసంస్థలనేకం వ్యాపించాయి. వీనివల్ల విప్లవోద్యమం నిలదొక్కుకో గలిగింది. ఇంక బహిరంగంగా నిలిచిన పార్టీలలో సంస్కరణ సమితి ఒక్కటే మిగిలింది. దీనిలో సభ్యులు దేశాంతర్గతులైన అరబ్బులు. ఈ సమితి 1913 లో పారిస్ లో ఒక కాంగ్రెస్ ను సమావేశపరిచింది. ఈ కాంగ్రెస్ అరబ్ దేశీయ స్వపరిపాలనోద్యమం ప్రారంభించింది. ఈ ఉద్యమం అరబ్ దేశాలన్నిటిలోనూ చురుగ్గా వ్యాపించింది.

టర్కీ సామ్రాజ్యంనుంచి వివిధ అరబ్ దేశాలను విడగొట్టాలని కోరేవారి ఉద్యమం క్రమముగా బలపడింది. రాబోయే యుద్ధంలో వీరు బ్రిటిషు, ఫ్రెంచి ప్రభుత్వాల సహాయాన్ని ఆశించారు. సంగ్రామం ప్రారంభంకాకముందే కార్యక్రమం అంతా సిద్ధమయింది.

టర్కీపరిపాలన నుంచి ముక్తి పొందగోరిన అరబ్ నాయకులకు యూరోపియన్ల జోక్యం వల్ల ఎట్టి ప్రమాదం సంభవిస్తుందో తెలియక పోదు. జాతీయోద్యమం వలన దేశంలో విజ్ఞానాభివృద్ధి కార్యక్రమాలకు దోహదం కలిగింది. కాని జాతీయోద్యమం రహస్యంగా నడుస్తున్నందువల్ల కొంత అంతరాయం కలిగింది. విజ్ఞానాభివృద్ధి కార్యక్రమాలు విద్యావంతులు, సైనికాధికారులకేగాని ప్రజాసామాన్యానికి సన్నిహితంగా పోలేదు. అందువల్ల ఈ కార్యక్రమాలకు బలం ప్రోత్సాహం లోపించాయి. ప్రథమ ప్రపంచసంగ్రామం ఈ ఉద్యమానికి అపూర్వావకాశం ఇచ్చింది. మిత్రరాజ్యాల తోడ్పాటుతో వచ్చిన అరబ్ విప్లవం, ఆ తరువాత పరదేశీయుల ద్రోహం చరిత్ర ప్రసిద్ధవిషయాలే. అరబ్ విప్లవాన్ని గురించి లార్డ్ వేవెల్ ఈ రీతిగా అన్నాడు.

"బ్రిటిష్‌సైన్యానికి ఈ విప్లవం అమూల్యావకాశాలిచ్చింది. అరబ్ సైన్యాలు చేసిన సహాయానికి వారు పొందిన ప్రతిఫలం బంగారం, మందుగుండు సామగ్రి సద్వినియోగాలైనాయని చెప్పాలి." కాని ఆ పరదేశాల ప్రభుత్వాలు చెప్పిన మాటలు వేరు. విప్లవం నీగిపోయినా అంత నష్టం లేకపోయేది. కాని బ్రిటిష్ సైన్యజోక్యంవల్ల కొంత అపకారమే కలిగిందన్నారు.

మిత్రరాజ్యకూటం తలపెట్టిన ద్రోహాన్ని విసమంతా ఎరగని అరబ్ జాతీయవాదులు 1920 లో డమాస్కస్ లో సమావేశమైనారు. ఫైజాల్ రాజుగా విశాలరాజ్యం స్థాపిస్తున్నట్లు ఆ కాంగ్రెస్ ప్రకటించింది. కాని ఒక మాసంలో సాన్ రీమో సమావేశంలో సిరియా, లెబనాన్ దేశాలు ఫ్రాన్సు సంరక్షణకు ఒప్పగించబడ్డాయి. తరువాత సెవర్స్ సంధిప్రకారం ఇరాక్, ట్రాన్స్‌జోర్డన్, పాలస్తీనాలు బ్రిటన్ కు ఒప్పగించబడినాయి. రహస్యంగా తయారైన ఈసంధి విషయాలు గమనిస్తే ఈతంత్రం పూర్వమే పన్నినట్లు తెలుస్తోనే వుంది.

శీఘ్రపరిణామం చెందుతున్న ప్రపంచంలో కొత్తగా అప్పుడప్పుడే రాజకీయ చైతన్యం పొందుతున్న ప్రాచ్యదేశవాసుల మహోద్దేశాలను నిరాకరించి ఏర్పరచిన దీ నూతన వ్యవస్థ. ఇదంతా పాతనాటకమే. రెండు శత్రు సామ్రాజ్యవర్గాలమధ్య జరిగిన పంపకం ఇది. అయితే దీనికి కొత్తరూపం తెచ్చిపెట్టారు. దీనిపేరు 'సంరక్షణ' (ప్రొటెక్టరేట్.) భారత దేశాన్ని అదుపులో పెట్టుకోడానికి ఇదే బ్రిటన్ కు ఉత్తమ సాధనం. మధ్యప్రాచ్యంలో బ్రిటన్ కొన్ని పరిపాలనాధికారాల్ని చేజిక్కించుకుందంటే ఆ సాధనం చిక్కినట్లే.

యుద్ధకాలంలో ఇరాక్ పరరాజ్య సైన్యాల ఆక్రమణలోకి వచ్చింది. అక్కడ సైనికప్రభుత్వం స్థాపించబడింది. ఈప్రభుత్వవిధానాలు భారత దేశంలోని బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఆజ్ఞలననుసరించి ఉండేవి. బ్రిటిష్ ఇండియా సైన్యం అరబ్ జాతీయోద్యమం పట్ల విరోధం వహించి ఉండేవి.

ఈ ప్రాంతంలో జనవాక్యనిర్ధారణ (ప్లెబిసైట్) జరపడం గురించి బ్రిటిషు ఛీఫ్ సివిల్ కమిషనర్ ఈ క్రింది ఉత్తరువు ఇచ్చాడు" ప్రజాభిప్రాయం మనకు పూర్తిగా అనుకూలంగా ఉందనే నమ్మకం ఉన్న పక్షంలోనే ప్రజాపరిషత్తును సమావేశపరచాలి. అలా సమావేశపరచినా రిచ్చే సమాధానం నాద్వారా ప్రభుత్వానికి నివేదించబడుతుందనే విషయం వారికి తెలియ చెప్పాలి. ప్రజల్లో ఏకాభిప్రాయం లేకపోయినా లేక ప్రజాభిప్రాయం మనకు ప్రతికూలంగా ఉన్న సూచనలు గోచరించినా, సమావేశాన్ని వాయిదా వేసి, ఆ విషయం నాకు తెలిపితే, అప్పుడేం చెయ్యాలో నేను ఉత్తరువులిస్తాను."

సంరక్షకులు అధికారంలోకి రావడంతో దేశమంతటా విప్లవం చెలరేగింది. ఇరాక్ లో ఇరువైపులా అపార ప్రాణనష్టం సంభవించింది. సైన్యాల ధ్వంసంవల్లా, పన్నులు వసూలు కాకపోవడంవల్లా, దాదాపు నాలుగులక్షుల పౌనల నష్టం కలిగింది. బ్రిటిషు ఆయుధబలం, భారత సైన్యబలం కలిసి అరబ్ జాతీయోద్యమాన్ని అణచివేశాయి. కాని కొంతైనా ప్రజలను సంతృప్తి పరచక తప్పలేదు. సిరియానుంచి ఫ్రెంచివారు వెళ్లగొట్టిన ఫైజాల్ రాజును బ్రిటిషు పాలకులు రాజుగా ఆహ్వానించారు. ఫైజాల్ రాజుకు అరబ్బీలు హృదయపూర్వకమైన స్వాగతం ఇవ్వలేదు. ఫైజాల్ ను రాజుగా అంగీకరిస్తున్నట్లు ఒక తీర్మానాన్ని అచ్చువేసి ఆ పత్రాన్ని సంతకాలకు తిప్పి, జనవాక్యనిర్ధారణపేరుతో ఒక ఫార్సు నడిపారు. జాతీయవాదుల నాలకించిన ఉద్యోగుల్ని బర్తరఫ్ చేశారు. కాని ప్రజల్లో అధిక సంఖ్యాకులు పరదేశీయుల పరిపాలనను అంతమొందించాలని కోరారు. బ్రిటిష్‌వారికి తోడ్పడిన అల్పసంఖ్యాకులైనా, చిట్టచివరికి బ్రిటిష్ వారు ఇరాక్ దేశానికి స్వాతంత్ర్యం ఇస్తారనే ఆశతోనే తోడ్పడ్డారు. కాని దేశంలో అధిక భాగాన్ని తమ అధీనంలో ఉంచుకోవాలనే పట్టుదల బ్రిటిష్ వారికి వదల్లేదు. బ్రిటన్, ఇరాక్ ల మధ్య 20 సంవత్సరాల సంధి ఒకటి తయారుచేశారు :

ఆ సంధిప్రకారం ఫైజాల్ రాజా బ్రిటిష్ హైకమీషనరు చెప్పినట్లు నడుచుకోవాలని నిర్ణయించబడింది. కొన్ని వ్యవహారాలకు బ్రిటిష్ సలహాదార్లు, బ్రిటిష్ ఉద్యోగులు నియమించబడాలనికూడా నిర్ణయించబడింది.

ప్రజలీ అవమానకరమైన సంధికి అంగీకరించలేదు. కాని జాతీయ శాసనసభలో అధికసంఖ్యాకుల అంగీకారాన్ని బ్రిటిష్ పాలకులు సాధించారు. ఆ అధికసంఖ్యాకులతో ఏర్పడిన ప్రభుత్వం సంధికి అంగీకరించింది. అప్పటికి కూడా సంధికి ప్రాతికూల్యం ప్రబలంగానే ఉంది. ఒకగంట గడువులో బ్రిటిష్ సైన్యాధికారుల బెదరింపులమధ్య వోటింగు జరిగింది. సంధికి అనుకూలంగా 37 గురు, ప్రతికూలంగా 24 గురు వోటుచేశారు. 8 మంది తటస్థంగా ఉన్నారు. సభకురాని సభ్యుల సంఖ్య 31.



ఇరాక్ నానారాజ్యసమితిలో చేరే పక్షంలోతప్ప, 25 సంవత్సరాలు బ్రిటన్ సంరక్షణలోనే ఉండాలని నానారాజ్యసమితి 1925 లో బ్రిటిష్‌వారి ఒత్తిడిపైన నిర్ణయం చేసింది. బ్రిటన్ తనకు అన్నివిధాలా ఇరాక్ లొంగి ఉండగలదని వాగ్దానమిచ్చినట్లయితే సమితిలో ఇరాక్ సభ్యత్వాన్ని ప్రతిపాదించగలరని బ్రిటిష్‌పాలకులు బేరం పెట్టారు. ఇరాక్ తిరిగి నిరోధించడానికి యత్నించింది. మూడుమాసాలపాటు ఇరాక్ ప్రభుత్వం అనేది లేదు. చివరికి బ్రిటిష్ పాలకుల పౌర్జన్యమే గెలిచింది. పాతిక సంవత్సరాలు బ్రిటన్ షరతులకు లోబడే ప్రభుత్వం ఒకటి భూస్వాములతో నిర్మించబడింది. ఈ షరతుల్లో బ్రిటన్ అధీనంలో విమానాశ్రయాలుంచడం, దేశంలో బ్రిటిష్‌వారికి సైన్యాలనూ తమవస్తువులనూ రవాణాచేసుకునే స్వేచ్ఛ ఇవ్వడం, యుద్ధకాలంలో దేశంలో రవాణాసౌకర్యాలు, తంతి తపాలా దిశాఖలు బ్రిటిష్‌వారి అధీనం చెయ్యడం, నిపుణుల్ని నియమించడంలో బ్రిటిష్‌వారినే ఎంచడం, ఇరాకీ నిపుణుల్ని ఇంగ్లండుకి మాత్రమే పంపడం మొదలైనవి. ఈరీతిగా బ్రిటన్ ప్రతిపాదనపై ఇరాక్ నానారాజ్యసమితిలో సభ్యత్వం పొందింది.

పరిపాలనావ్యవహారాల్లో దినదిన కార్యాలలో ఇరాక్ ప్రభుత్వంలో కలహాలు చెలరేగాయి. పెద్ద ఉద్యోగులందరూ బ్రిటిష్ వారి అండను చేరి వారి కిష్టం వచ్చినట్లు వ్యవహరించారు. కింది ఉద్యోగులు పరదేశీయుల కింద పనిచెయ్యడానికి ఇష్టపడలేదు. ఇరాక్ ప్రభుత్వంలో బ్రిటిష్ ఉద్యోగుల కివ్వబడిన ప్రత్యేక హోదాలు, సదుపాయాలు, ఇతర ఉద్యోగులకు కన్నెర్ర కలిగించాయి. బ్రిటిష్ ఉద్యోగులు నిశ్చింతగా ఉండగా ఇరాకీ ఉద్యోగులకు మంత్రివర్గాలమార్పుల్లో క్షేమం, స్థిరత లేకపోయింది. పరిపాలన కుంటుపడింది. బ్రిటిష్ ఉద్యోగులు, బ్రిటిష్ సైనికాధికారులు తమ దేశహితాన్ని కోరేవారు కారనే విషయాన్ని ఇరాకీ లెన్నడూ మరచిపోలేదు. సామ్రాజ్యవాదులు స్వలాభమే ప్రధానంగా గణిస్తున్నట్లు వారికి తెలుసును.

నానారాజ్యసమితి తోడ్పాటుతో అరబ్ స్వతంత్రరాజ్యమైన సిరియాని ఫ్రాన్సు నిస్సంకోచంగా నిర్భయంగా అంత మొందించింది. కాని అక్కడ తమకు క్షేమం లేదని ఫ్రెంచివారు గ్రహించారు. సిరియాలోని బహుళమతవర్గాలున్నందువల్ల ఫ్రాన్సు మిత్రభేదోపాయాన్ని చక్కగా ప్రయోగించగలిగింది.

సిరియాలో సున్నీ మహమ్మదీయులు మొత్తం జనాభాలో నూరింట ఎనభైవంతు లున్నారు. అనేక అల్పసంఖ్యాకవర్గాలున్నాయి. క్రైస్తవమత యుద్ధాలకాలంలో వచ్చిన క్రైస్తవు లున్నారు. క్రైస్తవ సంప్రదాయాలనవలంబించుకున్న మహమ్మదీయ వర్గాలున్నాయి. వివిధవర్గాల విశిష్టతలకు ఆటోమన్ సామ్రాజ్యం ప్రాధాన్యమిచ్చింది. రాష్ట్రస్వరూపాలు మార్చబడినాయి. ఏ ఒక్కవర్గానికీ పూర్తి సంఖ్యాధిక్యత లభించకుండా ఈనూతనరాష్ట్ర విభజన జరిగింది. జెబెల్ డ్రూజ్, లటాకియాలను విడగొట్టారు. రెండింటినీ చిన్నచిన్న రాష్ట్రాలుగా చేసి అక్కడ ఫ్రెంచివారు తమ విమానాశ్రయాలనూ, సైనిక స్థావరాలనూ స్థాపించుకొన్నారు. నానారాజ్యసమితి కమిషన్ను

(18 వ పేజీ చూడుడు)



జెట్ ప్రొపల్షన్ వల్ల నడిచేవి తప్ప తక్కితర విమానాలలో గమనవేగంలో అన్నిటినీ అతిక్రమించిన వేగంతో హాకర్ విమానాన్ని లండన్‌నుంచి రోమ్, లండన్‌నుంచి కరాచీ నడిపిన బ్రిటిష్ వైమానికుడు నెవిల్ డ్యూక్.

కథానిక:



అభ్యాగతులు

శ్రీ వి. సచ్చిదానందశర్మ

"ఊఁ...అప్పుడు వాళ్లేంచేశారు?" అన్నాడు విశ్వనాథం ఉండబట్టలేక, వాసు సంభాషణ రసపట్టులో ఆపుచేసి టిండిధోరణిలో పడేసరికి.

సుందర్రావు, నేను, శ్రీరామ్మూర్తి, నాగభూషణం...అంతా సరైనప్రశ్న వేశావన్నట్టు సమాధానం కోసం వాసువైపు నోరుతెరుచుకు చూస్తున్నాం. విశ్వనాథం ఆప్రశ్న వేసి ఉండకపోతే మాలో ఎవరైనా అదే ప్రశ్న వేసిఉండేవాళ్ళం. అసలు, వాసు ఎంత చమత్కారి కాకపోతే విషయాన్ని అంత క్లైమాక్సులో వదులుతాడు? అందుకనే తరుచు అంటూ ఉంటాం: "వాసూ! అదృష్టవశాత్తు ఏదో ఒక వాసి గ్రహబలం తక్కువైన నువ్విలా ఉన్నావుకాని, కాకపోతే కర్మం కాలి నువ్వో గొప్ప రచయితవయేవాడివిరా" అని!

అట్లు తయారయి వచ్చే లోపల కాలక్షేపానికి తెప్పించిన పకోడీలు ఎంగిలిపడ్డాం. శ్రీరామ్మూర్తి నాలికతో నోటిని పరిశుభ్రంచేసుకుంటున్నాడు. నాగభూషణం గబ్బుమని ఒక తేపు తేపాడు. ఇంతలో సర్వరు పళ్ళాలు ఒకదానిమీద ఒకటి దొంతరగా అమర్చుకొచ్చి మాటేబులు ముందు ఠపీమని ఆగి "క్లీన్"అని అరిచాడు కీచుగొంతుకతో. బల్లలు తుడిచేవాడికి వీలుగా సుందర్రావు ఒకవైపుకు ఒదిగాడు. సర్వరు పళ్ళాలన్నీ అందరిముందూ అమర్చి వెళ్ళిపోయాడు. వాసు ఒకగ్లాసు మంచినీళ్ళతో పూర్వాధ్యాయానికి భరతవాక్యం, నూతనాధ్యాయానికి నాందీ పాడాడు.

"ఆ తరవాత ఏమయిందో చెప్పావు కావు..." అని జ్ఞాపకం చేశాడు నాగభూషణం.

"ఆ! ఎంతవరకు చెప్పాను?" అన్నాడు వాసు, ఆ విషయా లన్నీ టిండి అడుగున పడిపోయినట్టు.

"బిల్లు ఎవరి కందితే వాళ్ళిస్తాం. కింద పడెయ్యమన్నారు; సర్వరు పడేశాడు— అంత వరకు."

"ఇం కేముంది! ఇద్దరూ కుర్చీలమీంచి దూకారు—ఆబిల్లు నేనిస్తానంటే నేనిస్తానని! అలా వాళ్ళిద్దరూ ఎంగిలాకులమీదికి కుక్కల్లాగా బిల్లుమీదికి ఎగబడుతుంటే సర్వరు అవతలగా నిలబడి కుస్తీపందెం చూస్తున్నట్టు కులాసాగా చూస్తున్నాడు. చివరికి ఆ హేమాహేమీల్లో ఒకడు బిల్లు పుచ్చుకుని కౌంటరు ముందుకి నడిచాడు. రెండోవాడు కూడా లేచి నిలబడి కౌంటరుదగ్గిరికి పోతున్న వాడి కండువాపుచ్చుకుని వెనక్కిలాగుతూ 'యహే! నేనిస్తా నుండుడబ్బు' అంటున్నాడు. కౌంటరుదగ్గర మాత్రం ఎంత వాంగామా అయింది? అందులో ఎవడూ డబ్బివ్వడు; రెండోవాణ్ణి ఇవ్వనివ్వడు! హోటల్లో కూర్చున్న వాళ్ళంతా ఆ పల్లెటూరి మర్యాదలు వినోదంగా చూశారు. ఇంతకూ ఎవరు డబ్బివ్వటమనే విషయం ఏ వేళకూ తేలక పోయేసరికి మానేజరుకి ఒళ్ళు మండి 'ఎప్పుడూ హోటలుకి వచ్చిన మొహాలల్లే లేవే!' అని తిట్లకి లంకించుకున్నాడు. ఆనాలుగూ పడింతరవాత అందులో ఒకడు తగ్గి రెండోవాణ్ణి బిల్లు చెల్లించ నిచ్చాడు. అంతా అయిపోయి మెట్లు దిగుతూకూడా ఇదే సంభాషణ—డబ్బు నే నిచ్చేవాణ్ణంటే నే నిచ్చేవాణ్ణని! ఈ వధవ మర్యాదలు చూచే సరికి నా కొకటనిపించింది— ఇలా నే నిస్తానంటే నే నిస్తా నంటున్న వాళ్ళు కాస్తా, నువ్వియ్య మంటే నువ్వియ్యమనటానికి ఎన్నోరోజులు పట్టదను కున్నాను!"

ఇక్కడ మీ రొక్క విషయం గమనించాలి: వాసు రియలిస్టు కాకపోయినట్లయితే వాళ్ళిద్దరూ అంతవరకు హోటలు మొహం చూడని 'పల్లెటూరి మనుష్యులని చెప్పే శ్రద్ధ తీసుకుని ఉండేవాడు కాదు. అంతే కాదు—ఇప్పుడు చెప్పిన విషయాన్నే ఇంకా బిలవలు పలవలుగా అల్లి... వాళ్ళు బిల్లుకోసం తన్నులాడు కోవటంలో బల్లమీద ఉన్న కప్పులు పగలకొట్టారనీ, మరికొన్ని కప్పుల్లోఉన్న కాఫీ తింటున్న వాళ్ళమీద ఒలికిందనీ, వాళ్లూ, మానేజరూ... అంతాపోగై ఇద్దరినీ తలొక నాలుగూ ఉతికి తిన్న డబ్బులు కక్కించి మరీ బయటికి పంపారనీ—ఇలా తన సామర్థ్యం కొద్దీ ఊహాగానంచేసి ఉండేవాడు. ఇంకా నేను మాపార్వతిగాడి విషయం గట్టిగా చెప్పలేనుకాని, వాసు మాత్రం అంత తెలివి తక్కువవాడు కాడు.

ఈలోగా మేము అట్టుతో మాడవపట్టుగా కాస్త ఉప్మాకూడా నంజుకుని కాఫీ దాహం పుచ్చుకుంటున్నాం. సర్వరునోటి లెక్కని బిల్లు తయారు చెయ్యటానికి సతమత మౌతున్నాడు. నేను గబగబా వేడివేడి కాఫీ గొంతులో పోసుకుని చెయ్యి కడుక్కోటానికి అవతలికి వెళ్ళాను. ఈలోగా ప్రతివాళ్లూ గ్లాసులు కిందపెట్టి బయలుదేరారు. నేను మళ్ళా నా కుర్చీ దగ్గిరికి చేరుకునేసరికి వాసు నొచ్చుకుంటున్నట్టు, "ఛా! పాపం. ఇవ్వాళకూడా సుందర్రావునే బిల్లుబరువు మొయ్యమనటం దారుణం!" అన్నాడు వేడివేడి కాఫీ ఊదుకుంటూ తాగుతున్న సుందర్రావు చేతికి సర్వరు బిల్లు అందించేసరికి.

"ఆ బిల్లిలా తేవోయ్!" అంటూ సుందర్రావు చేతులోనుంచి బిల్లు అందుకోబోయాడు శ్రీరామ్మూర్తి.

"అయింది! ఇందాకటినుంచీ నే వినిపించిన నాటకమంతా ఇప్పుడు మళ్లీ మీ రొకసారి ఆడేట్టున్నారే! కానియ్యండి...ఇదో కాలక్షేపం!"అని అందర్నీ నవ్వించాడు వాసు ఒకసారి. ఒక క్షణం ఆగి మళ్ళీ "అపాటి కాస్త లౌక్యమన్నా తెలీకపోతే ఎలారా? కాఫీ అంతసేపు తాగితే బిల్లు మీదపడక ఏ మౌతుంది?" అన్నాడు మర్మం లేకుండా.

"అహఁ...అంత మాత్రానికే ఫరవాలేదులేరా!" అని తన అమాయకతని బుజువుపర్చుకున్నాడు సుందర్రావు.

అంతా బయలుదేరాం. సుందర్రావు లాగూ జేబులోకి చెయ్యి పోనిస్తూ కౌంటరుముందు ఆగిపోయాడు. మేమంతా గుమ్మం దిగి రోడ్డు ప్రక్కన నిలబడ్డాం. ఇంతలో శ్రీ రామ్మూర్తి ఒక ఉదాత్తభావాన్ని వెల్లడిస్తూన్నట్టు, "అస్మదాదులందరికీ – నెలలో చేతికి డబ్బొచ్చిన మొదటివారంఅంతా ఆర్థికసమృద్ధి; రెండోవారంఅంతా సాధారణ ఆర్థిక పరిస్థితులు; మూడోవారం ఆర్థికమాంద్యం; నాలుగోవారం క్షామం!" అన్నాడు.

మాలో ఈ విషయాన్ని కాదనగలవాడు ఎవడూ లేడు కాకపోతే నెలలో మొదటి వారంలోమాత్రం ఆర్థికసమృద్ధితో ఉన్నవాడెవ డని విచారించేవాళ్లే కాని, ఉన్న విషయాన్ని గోరంతలు కొండంతలుచేసి చెపుతున్నాడని అనతగ్గవాళ్ళం ఎవరమూ కాము. అందువల్ల ఎవరిమటుకు వాళ్ళం బాగా చెప్పావన్నట్టు విని ఊరుకున్నాం.

ఇంతలో విశ్వనాథం అందుకుని "పార్వతిగాడు నీ మాటలు విని ఉంటే వెంటనే పీక పట్టుకునేవాడు. 'నెల మొదటివారంలోనైనా ఆర్థికసమృద్ధిగా ఉండగా ఎన్నడైనా నన్ను చూశావా? ఎందుకు వెధవగొప్పలు?' అని" అన్నాడు.

"అన్నట్టు నిన్నా, ఇవ్వాళ్ళా పార్వతి అయిపే లేడేం? ఏ మైనట్టు?" అన్నాడు నాగభూషణం.

"మరేం భయంలా...ఇందాకనే వాడు, వెంకటశాస్త్రి కలిసి కనిపించారు. ఊళ్ళోనే ఉన్నాడు!" అన్నాడు వాసు పార్వతినిగురించి అంత ఆశ్చర్యం అనవసర మన్నట్టు.

పార్వతీశం, వాసులమధ్య ఒక విధమైన ఈర్ష్య మొదటినుంచీ ఉంటూనే ఉంది. దానికి కారణం వాళ్లిద్దరికీ చాలా విషయాల్లో పోలిక ఉండటం అనుకుంటాను. మిగతా విషయాలన్నీ అలా ఉంచి చమత్కారంగా మాట్లాడటంలో ఒకణ్ణి మించినవాడు ఒకడు. అందువల్ల మాటల్లో ఒకణ్ణి ఒకడు చిత్తుచెయ్యాలనీ ఇద్దరూ ప్రయత్నించేవాళ్లు. ఈ ప్రత్యర్థిభావం వాళ్లిద్దరి మధ్యా ఉండటం గమనించి మాపార్కు సమావేశాల్లో వాళ్ళిద్దరినీ ఉసికొలిపి అంతా వింటూ కూర్చునేవాళ్లం.

"వెంకటశాస్త్రికూడా నిన్న పార్కుకి రాలేదు కదూ?" అన్నాడు సుందర్రావు

"ఉఁహుఁ..." అన్నాడు నాగభూషణం.

"వాళ్ళేదో చాలా హడావిడిగా తిరుగుతున్నారోయ్! ఏదో వుంది.. పార్కుకి వచ్చేందుకు వ్యవధి చిక్కటం లేదేమో! ఈ ఉన్న నలుగురిలోనూ ఎన్ని క్లిక్కులు!" అన్నాడు వాసు.

మాటలుసందట్లో తెలియకుండానే పార్కు చేరుకున్నాం. మేము రోజూ కూర్చునేచోటుకి మలుపు తిరగగానే "అడుగో పార్వతి!" అన్నాడు శ్రీరామ్మూర్తి అంత దూరాన్నుంచే గుర్తుపట్టి.

పార్వతి వంచిన తల ఎత్తకుండా ఏదో పరీక్షగా చూస్తూన్నాడు. క్రమంగా దగ్గిరకి వచ్చి చూతుముకదా డబ్బు! కొన్ని నోట్లు, కొన్ని రూపాయలు, కొంత చిల్లర...అంతా లెక్కపెట్టుకుంటున్నాడు!

పార్వతిగాణ్ణి అలా అంత డబ్బుతో చూచేసరికి మాలో ప్రతి ఒక్కరం నిర్ఘాంతపోయాం. పైగా అది నెలచివరివారం. సాధారణంగా ప్రతివాళ్లూ - అందులో ముఖ్యంగా పార్వతి - ఎంత తగ్గించి చెప్పాలన్నా, నిస్సందేహంగా "క్షామం"తో బాధపడవలసిన కాలం! అలాటిది వాడు అంత పచ్చగా కనబడితే ఎవరికళ్లు కుట్టవు?

పార్వతి డబ్బు లెక్కపెట్టటం పూర్తిచేసి, పర్సులో చిందరవందరగా కుక్కేసుకుంటూ "హారి వీడిదుంప తెగా!" అన్నాడు తెల్లమొహంపెట్టి.

వాసు పర్సులో కుక్కుతున్న నోట్లపై ఒకసారి చూసి "ఇంకేం? రెండురోజులనుంచీ వీడు ఊరికే కనపడకండా ఉండటంలే దన్నమాట! అసలిప్పుడు వీడు వెంకటశాస్త్రికోసం ఎదురు చూస్తున్నాడేమో నట్టా!" అని అంటించాడు.

పార్వతి ఇంకా అలాగే మొహం వేళ్లాడేసి చూస్తుండేసరికి "వెంకటశాస్త్రి రాలేదేరా?" అన్నాను.

పార్వతి కాస్సేపటికి తెప్పిరిల్లి ఒకసారి గుటక మింగి "ఇం కెందు కొస్తాడు? ఆరి వీడి దుంపతెగ! ఇందు కన్నమాట...అదరాబాదరా జారుకున్నాడు!" అన్నాడు నోరు వెళ్లబెట్టి ఇందాకటిమాదిరిగానే.

నేను మాత్రం ఇవాళ కాలక్షేపం బాగానే జరుగుతుం దని తాపీగా కూర్చున్నాను.

పార్వతి ఏ వేళకీ తెమిల్చి చెప్పకండా ఇంకా అలాగే చూస్తూండేసరికి శ్రీరామ్మూర్తి "ఏం జరిగిందో చెప్పరా! ఏమిటలా తెల్లమొహం వేసుకు చూస్తావ్? ఏమైం దేమిటి?" అన్నాడు.

"డబ్బేమైనా కాజేశాడేరా?" అన్నాడు నాగభూషణం.

పార్వతి నెమ్మదిగా కోలుకుని "పూర్తిగా కాజెయ్యటం కాదనుకో...చివరికి డబ్బాపోయి, శనీ పట్టె నని – పెట్టి పోషిస్తున్న దాతలాగా ఎన్నితిట్లాడురా! వీడిమొహం తగలెయ్య!" అన్నాడు.

పార్వతి ఉన్న విషయ మేదో సరిగా చెప్పకుండా నాన్చుతున్నా కాని వాసు నాలుగు విసురుళ్లు విసరకండా ఊరికే కూర్చోటం మా అందరికీ ఆశ్చర్యం కలిగించింది. వాడివైపోకసారి చూశాను. ఇంకా అలాగే కూర్చుని ఉన్నాడు తాపీగా.

పార్వతి మాటలధోరణి పూర్తిగా ఎరుగున్న మాకు వీ డేదో సస్పెన్సుకోసం అహోరిస్తున్నాడని అప్పుడే తెలిసిపోయింది. అందువల్ల, "ఒరే అబ్బీ! నీ యీ వెధ వ్వేషాలు మాని ఉన్న విషయమేదో ముక్కుకి సూటిగా చెప్పావా చెప్పు; లేకపోతే నోరు మూసుకూర్చో. అంతే కాని, అన్యాయంగా మా ప్రాణాలు తియ్యక. మాట్లాడుకోవటానికి అనేక విషయా లున్నాయి" అని ఒక ఘాటైన మోతా దిచ్చాను.

"అబ్బే, సస్పెన్సూ లేదు; పాడూ లేదూ – అసలు నేను మాట్లాడితేనే మీ కనుమానం! హోటల్లో టిఫిన్ తీసుకుంటున్నంతసేపూ ఎన్ని మాటలన్నాడురా! తల్చుకుంటే కడుపుతరుక్కుపోతుంది..." గానుగ ఎద్దులాగా అదే విషయం చుట్టూ మళ్లీ ఒకచుట్టు తిరిగాడు పార్వతి.

మాలో ప్రతివాడికీ పార్వతిగాడి విషయం వినాలనే కుతూహలం అసహనంగా మారిపోయినది. ఈ లెక్కని ఆ విషయం విప్పిచెప్పటానికి ఆ సాయంకాలం అంతా మింగెయ్యాలని ప్రయత్నిస్తున్నాడని గ్రహించి ఒక సరైన మార్గంలో ఉన్న విషయ మేదో చెప్పేట్లు చేస్తే నే కాని లాభం లేదని, "ఒరే పార్వతీ! నువ్వు అట్టే ఈ డొంకతిరుగుడు వ్యవహారం మాని, నేను అడిగే ప్రశ్నలకి సమాధానాలుమాత్రం చెప్పు చాలు." అన్నాను.

"ఏమిటి?" అన్నాడు.

"నువ్వు ఇంటిదగ్గిర్నించి ఎప్పుడు బయల్దేరావు?"

"అదే, ఓ గంటా, గంటన్నర అవుతుంది."

"సరే, నీకు వెంకటశాస్త్రి ఎక్కడ కనపడ్డాడు?"

"నేను సందుమలుపు తిరిగేసరికి ఎదురయాడు. 'నీకోసమే వస్తున్నారా' అన్నాడు. 'సరే, అయితే పద' అని ఇద్దరం బజారుకు బయలుదేరాం" అన్నాడు పార్వతి.

ఇక సంభాషణ దారి తప్పకుండా నడుస్తుం దని "ఊఁ...ఇద్దరూ బజారుకి బయలుదేరారు – అక్కడినుంచీ జరిగిన విషయం జరిగినట్టు వరసాగ్గా చెప్పకురా" అన్నాను.

పార్వతి తన చిత్తం వచ్చినట్టు చెప్పుకుపోవటానికి వీలులేకుండా బిగించా నని గ్రహించి ఒక వెకిలి నవ్వు నవ్వి ప్రారంభించాడు: "సరే, బజారుకని బయలుదేరాం. నే నప్పుడే గ్రహించాను వెంకటశాస్త్రి మా యింటికి వస్తున్నాడంటే తగుమైన కారణం ఉండి ఉండకపోదని.


" 'ఏరా! ఇలా ఎదురు బయల్దేరావు?' అన్నాను మళ్లీ.

" 'అబ్బే! మరేం లేదురా' అన్నాడు ఇందాకటి మాదిరిగానే.


"ఇంతలో హోటలు సమీపించేసరికి కాళ్లల్లో సత్తువ జారిపోతోంది. 'ఏరా! కడుపు కాఫీకావా లంటోంది కాదురా?' అన్నాను. వెంటనే వాడుమాత్రం తక్కువవాడా?—'పర్సు డబ్బులేవంటోందిరా!' అన్నాడు.

" 'అలా చెప్పు! మరి ఊరికే వచ్చా నంటావేరా?' అన్నాను.

(16-వ పేజీ చూడుడు)



జలచరప్రదర్శనాలయ సరస్సులు: విమానంనుంచి తీసిన ఛాయాచిత్రం.
ప్రాకారాలయంపైకి మెట్లు, లోప్రాకారానికి వెళ్లడానికి ద్వారాలు ఏర్పాటయినాయి.



సముద్రపు ఈతదుస్తులు ధరించి నౌకర్లు
మట్టంలో గుట్టలు, సున్నపుగుల్ల
మొదలైనవి

సహజపరిసరాల్లో


సహజనైసర్గిక పరిస్థితుల్లో జలచరాలను ప్రదర్శి
ఈ ప్రదర్శనాలయంలో శీతజంతువులు సముద్రాలలో
నాలయాన్ని చూడ్డానికి ప్రతిసంవత్సరం లక్షలాది ప్ర
అనేక అడుగులు ఎత్తున ప్రాకారాలు నిర్మించి వా
ప్రాకారంలో సరస్సుల చుట్టూ తిరిగి దాదాపు 200
ఏర్పాటు చేయబడింది. ఈ రెండు సరస్సుల్లోనూ పక్షి
ప్రదర్శనాలలోవలె విడిగా ఉంచరు. అన్నిటినీ
మహాసాగరంలో పట్టి ప్రదర్శనాలయానికి తీసుకురా
నాలయంలో జలచరాలకి ఆహారం ఇవ్వడానికి నౌకర్లు




గాజు కిటికీలద్వారా ప్రేక్షకులు జంతువుల్ని చూడ్డానికి ఏర్పాట్లున్నాయి.



1500 పౌనులు బరువుగల 'మాంటరే'వంటి పె




జలచరాలకు ఆహారం అందిస్తారు. అడుగు
లు, నీటిమొక్కలు, నాచుమొక్కలు
న్నీ ఉంటాయి.



ప్రదర్శనాలయశాఖకి చెందిన ఈ బోటులో కొందరు అట్లాంటిక్ సముద్రంలో జలచరాల్ని పట్టి తీసుకొస్తారు. పారిపోతున్న జంతువుల్ని ప్రమాదంకలుగకుండా పట్టుకు తీసుకువచ్చే వీ లుంటుంది.

జలచరాలప్రదర్శనం

ంచే ఏర్పాటు ఫ్లారిడాలో సెంట్ అగస్టిన్ దగ్గ చేయబడింది.
లెనే జీవిస్తాయి. అట్లాంటిక్ సాగర తీరానఉన్న ఈ ప్రదర్శ
జలు ప్రపంచం నలుగూలలనుండి నస్తారు. భూ మట్టానికి పైన
మధ్య రెండు పెద్ద కృత్రిమసరస్సులు నిర్మించారు. లో
గాజుకిటికీల ద్వారా లోని జంతువుల్ని చూడ్డానికి ఇందులో
వేల నీటి జంతువులు, చేపలు నివసిస్తున్నాయి. వీనిని ఇతర
పే ఉంచుతారు. నిత్యం కొత్త వానిని అట్లాంటిక్
నికి అధికారులు అనేకమందిని నియమించారు. ప్రదర్శ
ముద్రపు ఈతపరికరాలు ధరించి సరస్సుల్లో దుగుతారు.



ద్ద పెద్ద జలచరాల్ని కూడా పట్టితెచ్చి ప్రదర్శిస్తారు.



ప్రాకారం ఎక్కి తిమింగిలాలకి ఆహారం పడేస్తారుకూడా.



విచిత్రరాజ్యం

శ్రీ పానుగంటి పార్థసారథి

అనగా అనగా ఒక ఊళ్ళో ఒక వర్తకు డుండేవాడు. అతని కొక కొడుకుండేవాడు. అతనిపేరు శ్రీకాంతుడు. శ్రీకాంతుని తండ్రి చాలా ముసలివాడు. అతడు చనిపోయేటప్పుడు శ్రీకాంతునికి ఒక సలహా ఇచ్చాడు. వ్యాపారమునకు పోయేటప్పుడు గుజరాతు దేశమునకు ఎప్పుడూ పోవద్దని, ఆ దేశమువారు క్రొత్తవారిని మోసముచేసి బ్రతుకుతూ వుంటారనీ చెప్పాడు. కాని తండ్రి చనిపోయిన తర్వాత శ్రీకాంతునికి గుజరాతు దేశానికి పోయి వ్యాపారం చేయాలని కోరిక కలిగింది. అతడు తండ్రి చెప్పిన సంగతి లెక్కచేయకుండా, ఆరు పెద్ద పెద్ద పడవలనిండా మంచి మంచి రత్నాలు, ముత్యాలూ నింపుకొని గుజరాతు దేశానికి బయలు దేరినాడు.

నాలుగు రాత్రులూ, నాలుగు పగళ్ళూ ప్రయాణము చేసి, చివరకు శ్రీకాంతుడు గుజరాతు దేశాన్ని చేరుకున్నాడు. పడవలు సముద్రంలో వుంచి శ్రీకాంతుడు ఊళ్ళోకి బయలు దేరి వెళ్ళాడు.


అతడు ఒకదారివెంట పోతూ పోతూ ఒక చెరువును చూచాడు. ఆ చెరువులో ఒకమూల ఒక చాకలివాడు బట్టలు ఉతుకుతున్నాడు. ఆ పక్కనే ఒక కొంగ చేపలకోసం జపం చేస్తోంది. చిన్నప్పటి నించీ శ్రీకాంతునికి వేటంటే చాలా ఇష్టం. తన తుపాకీ తీసి తపీ మని కొంగను కాల్చివేశాడు. వెంటనే చాకలి శ్రీకాంతుని దగ్గరకు పరిగెత్తుకు వచ్చి "అయ్యో! నాతండ్రిని అన్యాయంగా చంపావు. ఎక్కడికి పోతావు? ఉండు." అన్నాడు.

"కొంగ నీకు తండ్రి ఎట్లా అవుతుందయ్యా" అన్నాడు శ్రీకాంతుడు.

"అదేమిటి అట్లా అంటావు! నా తండ్రి కొంగవేషంలో వుండి గుడ్డలు ఎట్లా ఉతకాల్సిందీ నాకు నేర్పుతున్నాడు. అతడిని నీవు చంపావు. నిన్ను రాజుదగ్గిరికి తీసుకుపోతాను." అంటూ శ్రీకాంతుడు ఎంత మొత్తుకున్నా వినకుండా, అతన్ని రాజువద్దకు బరబరా లాక్కుని పోయినాడు. చాకలి చెప్పిందంతా రాజు విని, శ్రీకాంతుడు చేసింది అన్యాయమని చెప్పి అతని రెండు పడవలను చాకలికి యిప్పించాడు.

శ్రీకాంతునికి ఏమి చేయటానికీ తోచలేదు. పాపం ఏడుస్తూ దారి వెంబడి బయలు దేరి పోతుండగా, ఒక ఒంటికన్ను గుడ్డివాడు వచ్చాడు.

"బాబూ ఉండు! ఉండు! నీతండ్రి నాకంటిని మూడువేల రూపాయలకు కుదువపెట్టుకున్నాడు. ఇదుగో రూపాయలు తీసుకుని నాకన్ను నా కియ్యి." అన్నాడు. శ్రీకాంతుడు తన కీసంగతి తెలియనే తెలియ దన్నాడు. వెంటనే గుడ్డివాడు శ్రీకాంతుని రాజుగారివద్దకు లాక్కుపోయినాడు. రాజుగారు అంతా విని, శ్రీకాంతుని మరి రెండు పడవలను గుడ్డివాని కిప్పించాడు. శ్రీకాంతునికి ఆ రాజుపైన ఎంతైనా కోపం వచ్చింది. కాని ఏమి చేయగలడు; పాపం! ఆ విచిత్ర రాజ్యంలో ఇంక ఒక్క నిమిషమయినా ఉండకూడ దని నిశ్చయించుకుని పడవల వద్దకు వేగంగా నడవడం ఆరంభించాడు.



అప్పుడు దారిలో ఒక ముసలమ్మ కనిపించింది. "నాయనా, నీవేనా కొత్త వర్తకుడవు. పాపము మీ నాయన చచ్చి ఎక్కడ వున్నాడో కాని, చాలా మంచి వాడు సుమీ! నేను ఆయన పెళ్ళాన్ని. నాకు ఆయన ముప్పదివేల రూపాయల నిస్తా నన్నాడు. నువ్వు ఆ రూపాయలు ఇచ్చిపో నాయనా." అంది.

శ్రీకాంతుని నెత్తిమీద పిడుగుపడినట్లయింది. ఏడుస్తూ, "మా నాయన గుజరాతీ స్త్రీని పెండ్లి చేసుకున్నట్లు నాతో చెప్పనేలేదే" అన్నాడు. "అదేమిటి! నువ్వు వొట్టి అబద్ధాలకోరులా గున్నావే? నా డబ్బు ఇచ్చి మరీ కదులు" అంది ముసలమ్మ.

"ఒక్క దమ్మిడీఐనా ఇయ్యను" అంటూ పరిగెత్తి పోయినాడు శ్రీకాంతుడు. "ఆగు నీ సంగతి పట్టిస్తాను. రాజు దగ్గరకు పోదాం రా." అంటూ అతన్ని రాజువద్దకు లాక్కుపోయింది. రాజుగారు ముసల్దిచెప్పినదంతా విని, శ్రీకాంతుడు ఎంత మొత్తుకున్నా వినకుండా అతని, మరి రెండుపడవలను ముసలమ్మ కిప్పించాడు.

ఇప్పటికి శ్రీకాంతుని పడవలన్నీ అయిపోయినాయి. చేతులో ఒక్క దమ్మిడీకూడా లేదు. ఊరికి పోవటానికి కూడా డబ్బు లేక, ఒక చెరువువద్ద ఏడుస్తూ కూచున్నాడు. ఇంతలో ఒక సన్యాసిఆ దారినపోతూ, శ్రీకాంతుని చూచి, "ఏమి నాయనా! అంత దుఃఖిస్తున్నావ్! నీకు కలిగిన కష్టమేమిటో కాస్త చెప్పు. నాకు చేతనైన సహాయం చేస్తాను." అన్నాడు.


శ్రీకాంతునికి ఎక్కడలేనీ ఆశ్చర్యం కలిగింది. తాను ఆ దేశం వచ్చినప్పటి నుంచీ ఇంతమాత్రం దయతో ఎవరూ అతన్ని పలుకరించలేదు. వెంటనే ఆయన పాదాలమీద పడి తనకథనంతా మొరపెట్టుకున్నాడు. సన్యాసికి శ్రీకాంతునిమీద దయ గలిగింది. అతన్ని దగ్గరకు పిలిచి, అతని చెవిలో కొన్ని రహస్యాలు చెప్పి, ఆవిధంగా చేయమని వెళ్లిపోయినాడు.

శ్రీకాంతుడు సంతోషంతో రాజుగారివద్దకు వెళ్లి "మహారాజా! న్యాయం కావాలి. దూరదేశపువాడను. బీదవాడను. న్యాయం దయచేయాలి." అన్నాడు. "మా దేశంలో ఎంత బీదవానికైనా న్యాయం లభిస్తుంది. ఏం కావాలి?" అన్నాడు రాజు.

అప్పుడు శ్రీకాంతుడు "మహారాజా, నాతండ్రి చేపరూపంలో వుండి, నాకు పడవనడపడం నేర్పుతున్నాడు. అప్పుడు, చాకలివానితండ్రి కొంగవేషములోవచ్చి నాతండ్రిని చంపి తిన్నాడు. అందువల్ల నేను అతన్ని చంపివేసినాను. నా తప్పేముంది? కనుక, తమరు న్యాయం విచారించి, చాకలీతీసుకున్న పడవల నిప్పించాలి." అన్నాడు. రాజుగారు ఆలోచించి, "నీది న్యాయమే" అని, చాకలిని పిలిపించి, శ్రీకాంతునికి పడవల నిప్పించినాడు.

వెంటనే శ్రీకాంతుడు "మహారాజా! ఇంకొక్క మనవి. మా నాయన కన్నులు కుదువపెట్టుకుని అప్పు ఇస్తూ ఉండేవాడు. ఆవిధంగా వచ్చిన మనుషుల కన్నులు మాయింట్లో చాలా ఉన్నవి. వానిలో ఏది ఎవరిదో గుర్తించటం కష్టం. కనుక ఈ గుడ్డివాని మిగిలినకన్ను ఇప్పిస్తే దానికి సరిపోవు రెండో కన్ను తెచ్చి ఇస్తాను" అన్నాడు. అప్పుడు రాజుగారు గుడ్డివానిని పిలిపించి ఏమి చెప్తావన్నాడు. గుడ్డివాడు కన్ను పోతుందేమో ననే భయంతో, "అయ్యా నాకు కన్నూవద్దు పడవలూ వద్దు" అని చెప్పి, తను తీసుకొన్న రెండు పడవలూ ఇచ్చి వెళ్లాడు.

బొమ్మల కథ. 3



ఉల్లి - నీరుల్లి

శ్రీ నందివాడ పుతలీ

పూర్వం మనదేశంలో అందరూ ఆవుమాంసం తినేవారు. మన కనేక విధాల సహాయపడే ఆవును చంపి తినడం న్యాయమేనా అని ఒకరోజున రాజుగారు ఆలోచించారు. ఆవును చంపడం చాలా తప్పని తోచింది రాజుగారికి, తక్షణమే మంత్రిని పిలిచి గోమాంస మెవరూ తినకూడదనీ, తిననవారికి ఉరిశిక్ష విధించబడుననీ దండోరా వేయించమని ఆజ్ఞాపించారు.

ప్రజలందరికీ రాజాజ్ఞ ప్రకటితమైంది. అందరూ గోవును చంపడం మానేశారు. కాని ఒకాయన గోమాంసం తినకుండా ఉండలేకపోయాడు. ఎవరూ చూడకుండా రహస్యంగా ఆవును చంపేసి దాని గిట్టలు భూమిలో పాతేశాడు. ఆయన గిట్టలు పాతిపెట్టిన చోటునుండి, ఒక మొలక వచ్చింది. అదే వెల్లుల్లి. ఆవు గిట్టలనుండి పుట్టింది కనక వాటిలాగా వెల్లుల్లి నాలుపాయలుగా ఉంటుంది. ఇదీ వెల్లుల్లి జీవిత రహస్యం.

ఇంక సీరుల్లిసంగతి, ఒకరోజున కాయగూరలన్నీ సభ చేశాయి. వంకాయ లేచి సభికులనందరినీ ఉద్దేశిస్తూ ఇలా అంది.

"స్నేహితులారా! ఇవాళ మనమందరం ఇక్కడ కలుసుకున్నందుకు చాలా సంతోషం. అన్ని దేశాలకీ రాజులున్నారు. మానవలోకంలోనూ, దేవలోకంలోనూ కూడా ఉన్నారు. ఒక్క మనలోనే లేరు. అన్ని దేశాలవలె మనకికూడా రాజుంటే బాగుంటుంది."

అందరూ వంకాయఅభిప్రాయానికి సంతోషించారు. గుమ్మడి, పొట్లకాయలు వచ్చి వంకాయ ఉద్దేశాన్ని బలపరిచాయి.

మిరపకాయ లేచి, "వంకాయగారు చెప్పినది సత్యమే. మనకికూడా రాజు కావాలి. ఈ విషయం అందరూ గుర్తించి ఒప్పుకొన్నందుకు చాలా సంతోషం. కాని రాజెవరిని చెయ్యాలో చర్చించాల్సిన విషయం." అని చెప్పి కూర్చుంది.

మిరపకాయ తెలివితేటల కందరూ మెచ్చుకున్నారు. తర్వాత వంకాయ, "భగవంతుడు పుట్టుకతోటే నాకు కిరీట మిచ్చాడు. మీ అందరికన్నా నాలో సార మెక్కువ. రుచి అధికము. వంకాయ ఇష్టములేనివారెవరైనా ఉన్నారా? కనక నేను రాజపదవి కర్హుడనని తలచుచున్నాను" అని పలికింది.

పొట్లకాయ వెంటనే లేచి, "వంకాయగారు పొరబడినారు. నేను చాలా భారీగా ఉంటాను. అందంగా ఉంటాను. నన్ను మర్చిపోయి, తనకు రాజలక్షణాలున్నా యనుకుని అలా చెప్పి ఉంటారు" అని యథాస్థానంలో కూర్చుంది.

రాజెవ్వరో తేలలేదు. ఎవరికివారే తాము రాజపదవికితగుదు మని వాదించారు. గుమ్మడికాయ, "సోదరులారా, మన మిట్లు వాదించుకోవడం బాగాలేదు. అనవసరంగా దెబ్బలాట ఎందుకు? మనని పుట్టించిన బ్రహ్మదేవుణ్ణే నిర్ణయించమందాం,' అంది. దానికి అందరూ అంగీకరించారు. బ్రహ్మదేవునివద్దకుపయాణమై వెళ్లారు.

మార్గమధ్యంలోనే దొండకాయ పండిపోయింది. పొట్లకాయ కుళ్లిపోయింది. మిరపకాయ, వంకాయ ఒడిలిపోయాయి. అలాగే అన్నీ కలిసి బ్రహ్మదేవుడిదగ్గర కెళ్లాయి.

బ్రహ్మదేవుడు వారి తగవు విని, "మీకూ పుట్టిందీ ఈ జబ్బు. పదవీవ్యామోహం, మానవులకే అనుకున్నా; నిద్రకళ్లతో సృష్టించి ఉంటా మిమ్మల్ని" అని నసుక్కున్నాడు.

బ్రహ్మదేవుడు గుమ్మడిని రాజు చేద్దా మనుకున్నాడు. కాని తనయెదుట నిర్లక్ష్యంగా అంతటీవిగా కూర్చున్నందుకాయనకి కోపం వచ్చింది. నలుగురి మధ్యనూ ఒదిగిఉన్న ఉల్లిపాయని ఆయన చూశాడు. దాని నమ్రతకి బ్రహ్మదేవు డెంతో సంతోషించాడు. ఉల్లిపాయ రాజని నిర్ణయించాడు. అందరికీ కోపం వచ్చింది. 'ఛీ ఇదా మా రాజ'ని అన్నీ చీదరించుకున్నాయి. అప్పుడు బ్రహ్మదేవుడు ఉల్లికి పల్చటి రేకులాటి వస్త్రాలిచ్చాడు. శంఖచక్రాలిచ్చాడు. అందుకనే ఉల్లి నడ్డంగా తరిగితే చక్రం, నిలువుగా తరిగితే శంఖం కనిపిస్తాయి.

శ్రీకాంతుడు మళ్ళీ "మహారాజా, ఈ బీదవానిపైన ఈ ఒక్కసారి కనికరించి, న్యాయం కలిగించండి. నాతండ్రి ఇక్కడఉండే గుజరాతీస్త్రీని పెండ్లి చేసుకున్నాడు. ఇప్పుడు నాతండ్రి చనిపోయినాడు. మా దేశాచారప్రకారం భర్త చనిపోయినతరువాత భార్యకూడా ఆయనతోపాటు చనిపోవాలి. అదే విధంగా ఆమె చనిపోవాలి. ఆమె అడిగినట్లే, ముప్పదివేల రూపాయలూ ఆమె పిల్లలకు ఇస్తాను" అన్నాడు. రాజుగారు ముసలమ్మను పిలిపించి, ఏం చెబుతావన్నాడు. ముసలమ్మ ప్రాణం పోతుందేమో ననే భయంతో పడవలను తిరిగి ఇచ్చేసింది.

శ్రీకాంతుని పడవలుఅన్నీ అతనికి వచ్చినాయి. రాజుగారికి ఒక్క నమస్కారం పెట్టి, తన దేశానికి వెళ్లిపోయినాడు. గుజరాతులోఉండే మోసానికి ఆశ్చర్యపోయినాడు. తనకు ఇంతమేలు చేసిన సన్యాసికి మనస్సులో అనేక నమస్కారాలు పెట్టినాడు. తన తండ్రి గుజరాతుకు పోవద్దని ఎందుకు చెప్పినాడో అతని కిప్పుడు తెలిసింది. తండ్రి మాట మీరినందుకు తగిన శాస్తి అయిందని అనుకున్నాడు.



బాల గేయం :

అపూర్వమైనది అమ్మమ్మ పెట్టె...

శ్రీ కామేశ్వరశర్మ

మసితో నల్లగ నున్నప్పటికీ—
అపూర్వ మైనది
అమ్మమ్మ పెట్టె...
* * * *
ముందుకు తాళం
వెనుకకు ద్వారం...
పేరుకుమాత్రం తాళంఅంతే—
పైసాపరకా అన్నీ మనకే—
అపూర్వమైనది
అమ్మమ్మ పెట్టె...
* * * *
మందూ మాకూ అన్నీ వుంటయి
దగ్గరుకూడా మం దుం దందులో.
బరఫీకోవా హల్వాకూడా...
వెతికే ఓపిక వుంటేసరి
* * * *
పలకా బలపం
పుస్తకం పెన్సిలు...
సూదీ దారం...
అన్నీ వుంటయి
అమ్మమ్మ పెట్టెలో...
* * * *
రంగు కాగితా లుంటాయి
రమ్యమైన బొమ్మ లుంటాయి
అపూర్వ మైనది
అమ్మమ్మ పెట్టె—
సాలెపట్టుతోసహా—
అన్నీ వుంటయి
అమ్మమ్మ పెట్టెలో
* * * *
అమ్మమ్మకు పెట్టంటే
అపురూపం మహా జాస్తీ—
ఢిల్లీసింహాసన మైనా
ఆ అక్కరలే దంటుంది...
అపూర్వమైనది
అమ్మమ్మ పెట్టె—



టిటో

'శిష్ట'

యుగోస్లావియా దేశము శాంతికిగాని, సంకట యుద్ధానికిగాని ఆరంభ ప్రదేశము కావచ్చును. ఈ దేశానికి పశ్చిమాన నౌకాశ్రయాలైన అనేక ఓడరేవులు గలిగిన తీరమున్నది. తూర్పున భూమయం మాత్రమే గోచరించే సోవియట్ రష్యా వున్నది. మధ్యన తిష్ట వేశాడు టిటో - ప్రజ్ఞాపరుడు, అప్రమత్తుడు' పూర్వంలో కమ్యూనిస్టు ఏజెంటు!

టిటోనుగురించి అనేకులు అనేకరీతులుగా, ముఖ్యంగా వామపక్ష పత్రికల వారు, రచించారు. మలినపు ఇజార్లు తొడుగుకుని, బొడ్డున కైజారుతో, కొండకనుమలలోంచి, పశ్చిమ శివాజీవలే, ప్రతిపంథిసైన్యాలపై దాడిదుమికి యుగోస్లావియాను రక్షించాడన్నారు. కొంతవరకు నిజమే - కల్పనకూడా కొంత లేకపోలేదు.

జోసిప్ బ్రాజ్ - టిటో యుగోస్లావియాకు మార్షల్. జాతీయ స్వతంత్రతా సైన్యానికి ముఖ్యాధిపతి. కమ్యూనిస్టుపార్టీకి సెక్రటరీ-జనరల్. గతించిన అమెరికాధ్యక్షుడు రూజువెల్టు మాదిరిగా ఇతనివద్దగూడ గొప్ప ఆకర్షణశక్తి ఉన్నది.

ఇతనిని గురించి ప్రచారానికి ప్రకటించే బొమ్మలకునూ తీరుకునూ ఇతని అసలు తీరుకునూ చాల వ్యత్యాస మున్నది. ప్రచారానికి వదిలే బొమ్మలలో ఇతని ముఖ మెప్పుడూ కనుబొమలు చిట్లించి భీకరంగా వున్నట్లు అగుపిస్తుంది. నిజానికి ఇతను నవ్వుతనం ఎక్కువ గలవాడు. ఓ సారి ఫీల్డింగు అనే ఒక అమెరికా మేజరు ఇతనితో భోజనానికి పోయి కుర్చీమీద కూర్చుంటుండంగా కుర్చీ వొరిగి ఆయన నేలమీద బోర్లపడ్డాడు. అది చూచి టిటో పకపకా ప్రక్కలను పట్టుకొని నవ్వాడు.

టిటో సన్యాసివంటి జీవితం గడపడంలేదు. చక్కగా విం దారగిస్తాడు. అతిథి సత్కారం చెయ్యడంలో కోటీశ్వరుడల్లే చేస్తాడు. దుస్తులను మాత్రం అభేషజంగా ధరిస్తాడు.

ఇతని ప్రక్కన ఎప్పుడూ ఇతని మొదటి భార్య "ఓల్గా నిన్నిచ్" ఉంటూ ఇతనికి తెలియదన్న ఇంగ్లీషు మాటా డేవారున్నప్పుడు తర్జమా చేస్తుంది.

రెండవ భార్య కిసాను పడుచు - ఇతని ముఖ్యకార్యస్థానంలో సామాన్యంగా ఉంటూ ఉండదు.

ఇతనికి ఇంగ్లీషు అసలు రాకపోలేదు. రానట్లు నటన ఎక్కువ.

జోసిప్ బ్రాజ్ - టిటో క్రోషియాలో జన్మించాడు. ఇతని తండ్రి వడ్రంగి. ఇతని తల్లి రైతుబిడ్డ. 1914 సంవత్సరంలో ఆస్ట్రో-హంగేరీ సైన్యంలోకి ఇతన్ని అధికారులు లాగారు. త్వరలోనే ఇతను రష్యను సైన్యాల వైపుకు వెళ్లిపోయాడు. అక్కడైనా, జారు చక్రవర్తి పక్షమున పోరాడడానికి ఇతను విముఖత్వం చూపగానే ఇతన్ని సైబీరియా దేశాంతరవాసం వేశారు. 1907 సం॥లో బోల్షివిక్కులు ఇతనిని వదిలించారు. ఆలగాయతు మూడు వర్షాలు టిటో విప్లవవిద్యను విధేయంగా నేర్చుకున్నాడు.

1920 నుంచి 1923 వరకూ టిటో మాస్కోలోని "అతిరహస్య పశ్చిమ పాఠశాల"లో అనేకవిధ్వంసక విధానాలను నేర్చుకున్నాడు. ఇక్కడ విదేశాలలో రహస్యకార్యక్రమాలను ఎట్లు జరపాలనో నేర్పుతారు. ఇక్కడ ఆరితేరిన తరువాత ఇతను స్వదేశమైన క్రోటియాకు తిరిగి వెళ్లాడు. అచ్చట రైల్వేలోహయంత్రశాలా కార్మికవర్గంలో చేరి అనేక హడావుళ్లను చేస్తుండగా అధికారులీయనను జైలులో వేశారు. అయిదుసంవత్సరాలు కారాగారవాసమైన తర్వాత షుమారు ముప్పది మూడవయేట బయటపడ్డాడు గాని ఆరుమూడైనా సరే కమ్యూనిస్టులకు విరోధులైనవారు నాశమైపోవాలనే పట్టుదలతో తయారయాడు. ప్రచ్ఛన్నవాసంలోకి దిగి కమ్యూనిస్టుకార్యక్రమంలో కదురై నిలిచాడు. ఆనాటినుంచే అతనిని "టిటో" అని ప్రజలు పిలువ నారంభించారు.

హిట్లరు యుగోస్లావియాపై 1941 సంవత్సరాన ఏప్రిలు 6 తేదీలో దాడి యెత్తాడు. దండుదారుల నెదుర్కోడానికి యుగోస్లావియాలో అనేకులు తయారయారు ప్రయాణీకుల వేషాలతో అనేకమంది టిటో అనుచరులు దేశము ప్రవేశించారు. కమ్యూనిజమును గురించి ఎక్కువ మాటాడకుండా జాతీయత పేరును రేగగొట్టుచూ యీ అనుచరుల కృషికి ఫలితంగా టిటోపక్షము దేశంలో బలపడ్డది. అది చూచి అప్పటిదాకా మిఖాలోవిచ్‌కు మద్దతిస్తున్న ఇంగ్లాండుగూడా టిటోకే సాయపడ్డది. తొమ్మిది మాసాల తర్వాత అమెరికా గూడా టిటోకే చేయూత నిచ్చింది.

1948 సంవత్సరము నవంబరు 29 తేదీ యుగోస్లావియా స్వాతంత్ర్య దినంగా ఎంచబడింది. తదనుకూలంగా టిటో డిక్టేటరయాడు. ఇతను డిక్టేటరయిన యుగోస్లావియా రిపబ్లిక్‌లో, వెయ్యి సంవత్సరాల యీమధ్య మొదటిమాటుగా క్రోటులు, సర్బులు, స్లోవీనులు, బోస్నియనులు, మాసిడోనియనులు, మాన్టినీగ్రియన్లు అనే ఆరు రకాల జాతులవారు ఒకే అధికారానికి లోబడినారు. ఈ రిపబ్లిక్ విస్తీర్ణము 96,000 చదరపు మైళ్లు. ఈదేశాన్ని టిటో లోహముష్టితో ఏలినప్పటికీ సర్వశక్తి విధాలా అనేక అభ్యుదయకరమైన మార్పులను గూడ తెచ్చినా డని ఒప్పుకోక తప్పదు.

పెద్ద ఎస్టేట్లు మాయమైపోయి చిన్న చిన్న ఫారములు తయారయాయి. వీటిని స్వతంత్ర రైతులే అనుభవిస్తున్నారుగాని సాముదాయక వ్యవసాయాన్ని అమలులోనికి తేలేదు. కాని ఇట్టి రైతులతోబాటు సహకార వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టిన కారణాన దేశము ఆహార విషయంలో స్వయంపోషకత్వం కలగగలిగి మిగులును గూడ చూపగలిగింది. ఈ మిగుల్లతో టిటో దేశపరిశ్రమలకు కావలసిన ఉన్నత యంత్రసామగ్రిని కొనగలిగాడు. "అన్రా" సామగ్రిగూడా ఇతనికి తోడయింది. ఇందుచే విశాలమైన విద్యుచ్ఛక్తి నుత్పత్తిచేసే కర్మాగారాన్ని నెలకొల్పాడు. అనేకమైన నూతన రహదారులను నిర్మాణించాడు. ఈ నిర్మాణ కార్యక్రమాల వల్ల టిటో తాను రష్యనులమీదికి దృష్టి మరల్చడముకన్న పశ్చిమ రాజ్యాలవైపుకే చూడడం మంచిదనుకున్నాడు.

కాపిటలిస్టు దేశాలయిన స్విట్జర్లాండు ఇటలీలతో వ్యాపారపు టొడంబడికలను కుదుర్చుకున్నాడు. ఒకమూల రష్యాను సంతోషింపజేయడానికై ఇంగ్లాండును తిడుతూ అవసరానికి వెనుదీయకుండా ఇంగ్లాండుకు కొయ్యసామగ్రికి బదులీగా ఇనుపసామగ్రిని అందజేశాడు.

టిటో రష్యాను పొగడుతూ ఆ పొగడికలను అస్తమానం దేశజనులమీద రుద్దుతూన్నా, పశ్చిమరాజ్యాలను తీవ్రంగా విమర్శిస్తూ తిడుతున్నా రష్యాకు ఇతనిమీది ప్రేమ తగ్గిపోతూన్నది.

ఆగ్నేయ ఐరోపాదేశంలో చాలకాలం నుంచి యుగోస్లావియా నాయకత్వం వహిస్తున్నది. ఇది రష్యాకు ఇష్టంలేదు. ఏది జరిగినా ముందు రష్యాతో సంప్రతించలేదని వారికినుక. ఇదిగాక ఒకవేళ బాల్కను అంతా ఒక ఫెడరేషను అయి కొంచెం హెచ్చుతగ్గుగా రష్యాకే ఎదురుమోడి వేసే బలిష్ఠత కలగడంగూడా రష్యాకు ఇష్టంలేని పని.

బాల్కను ఫెడరేషను నిర్మాణ విషయంలో బల్గేరియా డిక్టేటరయిన డిమిట్రావు మొదట తల వూచినా రష్యావారి డొక్కపోట్లకు తాళలేక ఆ విషయంలో తన మాటలను తానే గద్దిమింగుకున్నాడు. అతని మాదిరిగా గాక టిటో నిలబడడంతో రష్యాకంటిలో నలకగా తేలాడు.

టిటోయొక్క అదృష్టం ఎటు మారితే అటు జాతకచక్రాలు మారే అతని ముఖ్యానుచరులు ముగ్గురున్నారు.

40 సంవత్సరాల యీడుగల రాన్కోవిచ్ ఒకడు. ఒకప్పుడితడు దర్జీక్రింద కూలి చేసేవాడు. ఇప్పుడితను ఆంతరంగిక మంత్రి. దేశమందలి క్రమపద్ధతిని సక్రమంగా నడిపించుట యితని ముఖ్యకార్యక్రమం. ఇట్లు చేయుటలో బల్గేరియా రాజధానిలో నివసిస్తున్న రష్యనులపై గూఢచారులను నియోగించాడనే నేరం ఆరోపిస్తారు కోమిన్‌ఫారంవారు.

టిటో పక్షమునను అతని పార్టీ పక్షమునను ప్రచారముచేయుటకు నియమింపబడినవాడు డిజిలాసు అనేవాడు. ఇతని భార్యపై టిటో మక్కువ చూపుతున్నాడని కొందరంటారు. ఆవిడ ధరించే రత్నాభరణాలు అతను కానుకగా యిచ్చినవే అంటారు.

మూడవవాడు కార్డెజీ. ఇతను విదేశాలలోనూ ముఖ్యంగా యూనోలోనూ కృషి చేస్తూంటాడు.

టిటోతోబాటు యీ ముగ్గురూ గూడా కోమిన్‌ఫారంవారి ఆగ్రహానికి అనగా రష్యా ఆగ్రహానికి లోబడినవారే. ముఖ్యంగా టిటో యీమధ్య పశ్చిమదేశాలవారితో ఏర్పరచుకున్న వాణిజ్య ఒడంబడికలు కమ్యూనిస్టు దేశాలవారికి సిగ్గుబాటయిన విషయం. దీనిని పురస్కరించుకొనియే రుమేనియా మంత్రి టిటోను జ్యూడాసు (క్రైస్తును పూర్వకాలంలో మోసగించినవాడు) అని పిలిచాడు. ఈ విధంగా కోమిన్‌ఫారంవారు అనేకయత్నాలు చేస్తున్నారు. వాటికి ఎదురెత్తు లెత్తుతున్నాడు టిటో.

ఇదంతా చూస్తే యుగోస్లావియా ముందు రాబోయే యుద్ధానికి మూలకారణ మౌతుందా అనిపిస్తుంది. ఈ దేశానికి పడమట తీరాన అనేక నౌకాశ్రయాలు పశ్చిమరాజ్యాల యుద్ధనౌకల కాశ్రయం ఇవ్వగలుగుతాయి. తూర్పువైపున భూమి ఆధారంగా విశాలరాజ్యమైన సోవియట్ రష్యాఉన్నది. మధ్యన ఉన్నాడు టిటో నిశ్చింత చూపుతూ, నిమిషాలు లెక్కిస్తూ, నివురుగప్పిన నిప్పుమాదిరిగా!

అభ్యాగతులు

(11-వ పేజీ తరువాయి)

" 'నీదగ్గిర డబ్బులుంటే సరే సరి. లేకపోతే మరి ఊరికే వచ్చినట్టేగా!' అన్నాడు దిగాలుపడి. "అదృష్టవశాత్తు నిండుగా ఉన్న నా పర్సు వాడి స్థితి చూసి జాలిపడ్డది. పాపం, నిన్ననల్లా హోటలుఖర్చుకి వాడి కొ వ్వేనాయెకాలింది! అంత తిని ఒక్కసారి ఎలా మరిచిపోగలను? అందుకని, 'ఫరవా లేదులేరా! నా పర్సుడబ్బుకి భయంలేదు; కడుపులి కింత మేత పడెయ్యండంట్లోంది. నడు, లోపలికి' అన్నాను.

"వెంకటశాస్త్రి మొహం చాటంత అయింది. బుజమ్మీదిగా చెయ్యి పోనిచ్చి గుండెమీద కొట్టి 'చంపావుపోరా! ఇంత శుభవార్తని ఇంత నెమ్మదిగానుట్రా చెప్పేది? నడూ...లోపలికి!' అన్నాడు హడావిడిగా."

పార్వతి మా అందరివైపు ఒకసారి చూశాడు. తన సంభాషణ అతిగా పొడిగిస్తున్నందువల్ల మేమంతా నీరసంగా వింటున్నట్లు గ్రహించి సంభాషణక్రమం మార్చవలసిన అవసరం గుర్తించాడు.

అప్పటికే ఓపిక తగ్గిన నాగభూషణం, "నీకో నమస్కారం. మామీద దయుంచి జరిగిం దేదో ఒక్కగుక్కలో చెప్పు - చివరికి బిల్లును వ్వు చెల్లించావు. అంతేనా?" అన్నాడు. నాగభూషణం ఈ మాటలనటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అసలీ మాటలు ఇందాక మా బిల్లు చెల్లించిన సుందర్రావు సగర్వంగా అని వుండవలసింది. లేకపోతే ఏకాన్త సమయం దొరికినా పార్వతిగాణ్ణి కాకి పొడిచినట్టు పొడిచేవాడు అన్నా అర్థం ఉండేది. అసలు' వాసు మౌనంగా కూర్చోటం ఈ సంభాషణ రక్తి కట్టకపోవటానికి ముఖ్యకారణం అనుకున్నాను.

ఇంతలో పార్వతి "ఛా! అది కాదురా విషయం. వెధవ కాఫీ బిల్లులకి అంత మొహమోహాలూ చూసుకుంటా ననుకున్నా వేరా?", అని చురుకుగా సంభాషణ ప్రారంభించాడు: "కొందరు మనుష్యులికి అదో వెధవలక్షణ మనుకుంటాను - హోటల్లో కూర్చున్న దగ్గరనుంచీ నా తిండినిగురించే వాడి వెటకారం. 'ఇంత తింటావు, అంత తింటావు,' 'మరో పట్టు పట్టు,' 'లగాయించు' - ఇదీ వెధవపదజాలం! ఏదో ఒకసారి రెండుసార్లంటే నవ్వులాటకని ఊరుకోవచ్చునుకాని, తింటున్నంతసేపూ అలా ఆడిపోసుకుంటుంటే ఎలా సహించటం? అందుకనే వాడితో హోటలుకి వెళ్లటమంటే నాకు పెద్ద అసహ్యం. అందులో నాదగ్గర డబ్బులు లేకపోతే కాఫీ మానుకుని తలనొప్పితోనన్నా బాధపడతానుకాని, వాడి మాటలు భరించలేను.

"అసలు ఇనాళ్లయినా ఈ పెడ వదిలించుకునేవాణ్ణే! కాని, వాడిదగ్గర ఎలాగో డబ్బులు లేవంటున్నాడుకదా; నేను బిల్లు చెల్లిస్తానని చెప్పేతిరికదా ఇవ్వాళ్లన్నా నోరు మూసుకుని కూచోకపోతాడా అనుకున్నాను. ఊఁ...హు... వాడెందు కూరుకుంటాడు? పూర్వంకన్నా రెచ్చిపోయాడు! చిట్టిబుస్సుల్లో సర్వర్లని హడలగొట్టేస్తున్నాడు. వీడి జోరు చూసి వీడెవడో పైలాపచ్చీసుగాడులా ఉన్నాడని ప్రతివాళ్లూ వింతగా చూస్తున్నారు. నిజానికి, వాడి ప్రవర్తన నాకే తమాషాగా కనబడ్డది. ఇంత హంగామా చేసి, ఆవక బిల్లు చెల్లించేటప్పుడు తెల్లమతాబా కాల్చటానికి ఎలా మొహం చెల్లుతుందా అని ఆశ్చర్యపోతున్నాను. సర్వరు వచ్చేలోపల నాలుగుసార్లు పిలిచాడు. మానేజర్ని రెండుసార్లు గదమాయించాడు.

"మానేజరు తిట్లకి బెదురుతూ వచ్చి నిలబడ్డ సర్వరును రెండు బోండా తీసుకురమ్మన్నాడు. వాడు బోండా కొంచెం ఆలస్య మౌతుండనే సరికి మరింత విసుక్కుంటూ 'అయిందీ! అడుగులో హంసపాదా? సరే అయితే, ఏమున్నాయో చెప్పు' అని వాడిచేత ఒక దండకం చదివించాడు.

"చివరికి చదివిన వన్నీ ఏమీ వినిపించుకోనట్లు 'సరే, అదంతా ఎందుక్కానీ, వేడిగా, రడీగా ఏముందో చెప్పు, చాలు!' అన్నాడు.

" 'మైసూర్ బజ్జీ'

" 'అచ్ఛా! రెండు మైసూర్ బజ్జీ తీసుకురా' సర్వరు పరుగెత్తుతుండేసరికి వాణ్ణి పిలిచి 'ఇదుగో! ఏమి టలా వెళ్లిపోతావ్! రెండు మసాలాదోశెకూడా చెప్పు త్వరగా' అన్నాడు. సర్వరు 'మసాలాదోశె రెండు' అని బిగ్గరగా లోపలికివినబడేలాగ అరుచుకుంటూ బజ్జీ తేవటానికి వెళ్లాడు. బజ్జీ తెచ్చిన వాణ్ణి ఖాళీగా ఉంచటం ఇష్టంలేనట్లు 'స్వీట్సు ఏమున్నాయ్?' అన్నాడు. వాడు 'మైసూర్ పాక్, లడ్డూ, జహాంగీర్...' స్వస్తి మొదలు పెట్టాడు. వెంకటశాస్త్రిగాడు 'రెండు జహాంగీర్' అన్నాడు ధీమాగా.

"ఇక నేను వాణ్ణి కాస్త ఆపుచేస్తేనే కాని లాభం లేదని 'ఇంక నాకేమీ ఒద్దురా. కావలిస్తే నువ్వు తీసుకోరా జహాంగీర్...ఏయ్! ఒకటే జహాంగీర్' అన్నాను సర్వరుతో. వెంటనే వెంకటశాస్త్రి 'వోరే! వెధవ భేషజం పోకరా... మహచక్కగా తినగలవ్! ఎందుకీ వెధవ బెట్టు? నీ కెందుకు నేనున్నాగా. ఊఁ...కొట్టేయ్!' అన్నాడు.

"అప్పటికప్పుడే సర్వరు నా మాటలు వినిపించుకోకుండా రెండు జహంగీర్లు తీసుకు రావటానికి అవతలికి వెళ్లాడు. చుట్టూ ఉన్న ప్రతివాళ్లూ నేనేదో పీడిమీద పడి తేరగా తినటానికి వచ్చి బెట్టుపోతున్నానని నావంక వెకిలిగా చూడటం గమనించాను. నాస్థితి చూస్తే నాకే జాలిగా వుంది.

"మరీ వద్దు వద్దంటే బాగుండదని మెదలకుండా తినటం మొదలుపెట్టాను. ఇకచూడండి వాడి ధోరణి!-'ఇలాటి సమయాల్లో కూడా ఇలా నెమ్మదిగా తింటే ఎలారా? ఊఁ...కొంచెం పెద్ద పడిలో పోనీ; మరేమీ లేకపోయినా కాస్త త్వరగా తినటమన్నా నేర్చుకోరా!'-ఈవరసని ప్రారంభించాడు!

"నాకు తిక్క రేసతోంది. ఆ కోపంలో ఎంగిలి పళ్లాలు ఎత్తి వాడి మొహాన కొడతానేమోనని భయపడ్డాను. కాని, తమాయించుకొని ఇంత హడావిడి చేస్తున్న వెధివాయ్ తెల్లమొహం వేసుకు మాస్తుంటే, మనం బిల్లు చెల్లించామంటే తెలిసిపోదా వీడి బండారంఅంతా, అని వాడనే మాటలన్నీ దిగమింగి ఊరుకున్నాను.

"ఇంతలో సర్వర్‌తో 'రెండు బాదాం ఖీర్' అన్నాడు! దాంతో నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. నాకు కాఫీయే కావాలి; లేకపోతే నాకు తలనొప్పి వస్తుం' దన్నాను. 'అబ్బా! ఏం సాగదీయించుకుంటావురా! ఈ ఒక్కపూటకేగా, బాదాంఖీర్ రుచిమాడు.

రోజా తాగుతూనే వుంటావుగా వెధవకాఫీ!'- ఇదీ వరస! వాడినోటికి వెరిచి మెదలకండా ఊరుకున్నాను!

"బిల్లు నేను చెల్లిస్తూ కూడా వీడిచేత, నిన్న వాడు చెల్లించినప్పటికంటె ఎక్కువ మాటలు పడ్డానేమిటా అని మనసంతా కొద్దె చిరాకుగా ఉంది. వెంకటశాస్త్రి నెమ్మదిగా బాదాంఖీర్ తాగుతూ కాలయాపన చేస్తున్నాడు. ఈ వెధవ వేషం గమనించి నేను ధీమాగా కౌంటరు ముందుకి నడిచి జేబులో చూసుకుంటే పర్సు లేదు! కొయ్యబారిపోయాను.

"వెంకటశాస్త్రి సగం తాగిన గ్లాసు టేబులు మీద పెడుతూ 'ఒరేయ్! ప్రజ్ఞ లెందుకు వెలగబెడతావ్ కాని, నేను వస్తున్నాగా. రా! అందాకా ఎలా వచ్చి కూచో!' అన్నాడు.


"అంత డబ్బుతో పర్సు కనబడక తల దిమ్మెగా ఉన్న నాకు వీడి మాటలు శూలాల్లాగా గుచ్చుకుంటున్నై. హోటల్లో వాళ్ళంతా నావైపే చూస్తున్నట్లనిపించింది. 'నిజంగారా! ఒకటీ రెండూ కాదు. చాలా డబ్బుందిరా పర్సులో. ఏమైందంట!' అన్నాను ఏమీ అనలేక. వెంకటశాస్త్రి కూడా సానుభూతి చూపుతున్నట్లు 'నువ్విప్పుడు కొనవలసిన పెద్ద వస్తువులేమీ లేవుకదా, అంత డబ్బు బజారేమని తెచ్చావంట! పద! వెతుకుదాం...' అంటూ గ్లాసు ఖాళీచేసి బయలు దేరాడు. నేను హోటలు గుమ్మందాటాను. కాళ్లు చచ్చుపడిపోతున్నై. ఏమీ ఆలోచన పాలుపోవటంలేదు. వెంకటశాస్త్రి రెండుకిళ్లీలూ, సిగరెట్లూ తెచ్చి అగ్గిపుల్ల గీసి 'ఒరే అబ్బీ! ముందు నువ్వు అగరువత్తి అంటించు! నీ పర్సెక్కడికి పోతుందిరా. అసలు మనసొమ్ము పరాయివాడెవడన్నా తింటే జీర్ణం కావద్దటా!, నీడబ్బుకొచ్చిన భయమేమీ లేదు. ఊఁ...పోగ పెల్చు!' అన్నాడు.

"ఈ వెకిలిమాటలు వినేసరికి కొంత ప్రాణాలు చేరుకున్నై. ఇదేదో వీడి హస్తలాఘవమే నని ధైర్యం తెచ్చుకుని 'నీకు పుణ్యం ఉంటుంది. తీస్తే తీశానని చెప్పు, అనవసరంగా వేధించకండా' అని వాణ్ణి బతిమాలి బతిమాలి ప్రాణాలు పోయాయంటే నమ్మండి. ఎలాగైతేనేం చివరికి — ఎవరైనా ఎత్తుకుపోయి ఉండవలసిన పర్సుని తను దాచి జాగ్రత్తచేసినట్లు - నా అజాగ్రత్తకి మందలిస్తూ నా పర్సు నాకు పారేసి ఎవరో ఎదురయేసరికి వాళ్లతో ఉడాయించాడు.

"వచ్చి లెఖ్ఖచూసుకుంటే ఏముంది? మా హోటలు ఖర్చంతా దీనిలోది పెట్టాడు! నా డబ్బెట్టి తిని, నన్నెన్ని మాటలన్నాడో మాడు నెత్తవసినుగ! ఇందాక హోటల్లో నన్ను హేళనగా చూసినవాళ్ళందరికీ ఈ శాస్త్రిగాడి చావు తెలివి ఏం తెలుస్తుంది? నన్ను ఉట్టి పరమబేవార్సుగా దనుకున్నారు...పెద్ద దాతలాగా ఎన్ని పోజులు పట్టాడు! నా డబ్బెట్టి తిని నన్నెన్నిమాటలన్నాడు!..."

పార్వతి ధోరణి ఆగేట్టు లేదు. మేమంతా వెక్కిరింపుగా నవ్వటం మొదలుపెట్టేసరికి వాడి తిట్లు మరి ఎక్కువైనై. చివరికి వాసు అందుకుని "మహా...నీడబ్బెట్టి మీ రిద్దరూ తిన్నందుకే అంత లబలబలాడతావేమిటి? నిన్న మీ రిద్దరూ వెంకటశాస్త్రి డబ్బుతో హోటలుకి పోయారన్నావే-నిజంగా ఆ డబ్బు ఎవరిదో తెలుసా? నాది! మొన్న - ఇవ్వాళ మీరిద్దరిలాగే - మే మిద్దరం హోటలుకి పోతే, ఇలాగే, నాపర్సుకూడా దాచి.. ఇవాళ నీ కిచ్చినట్టన్నా వెంటనే నాపర్సు నా కివ్వకండా, ఆ డబ్బుతోనే నిన్న నల్లా నిన్నుకూడా మేపి, ఇవ్వాళపొద్దున మిగిలిన డబ్బుతో నా పర్సు నామొహాన పారేశాడు! నువ్వు నాకంటె అదృష్టవంతుడివే! అట్టే విచారించక మెదలకండా ఊరుకో" అన్నాడు!

అయితే, మీ కొక్క విషయం చెప్పాలి - వాసుమాటలు అంత తేలిగ్గా నమ్మకండి. వాసు చెప్పిన సంగతి.. పార్వతి ఇంతసేపూ ఈడ్చిగా చెప్పిన విషయాన్ని మించింది నాలుగుమాటల్లో చెప్పా ననిపించుకోవాలని కల్పించిన కట్టుకథ అయినా అయుండొచ్చు; లేదా వెంకటశాస్త్రి ఇప్పుడు పార్వతిగాడికి జరిపిన గౌరవమే వాడికి కూడా జరిపినా జరిపిఉండొచ్చు- ఈ రెండూ జరగతగ్గవే.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౩౨

అన్నమాచార్యుల రచన: (సం. ౩; ప. ౧౩)

భైరవి రాగం - ఝంపెతాళం

[పల్లవి]

(౧) ని ని గ రి సా , రి స ని ధా ప ధ ప ధ మ । ప ప ధ సి రి సా , , ,
వ ని త భా గ్యం బు దే వ ర చి త్త ము

(౨) ని ని మ గ రి సా రి గ రి స ని ధ పా పా ధ ని ధా మా । ప ప ధ ని స రి గా , రి సా , , ,
వ ని త భా గ్యం బు దే వ ర చి త్త ము

(౩) స ని రి స గ రి ని స రి గ రి సా రి స ని ని ధ ప మ గ రి గ । మ ప ధ ని స రి గా రి సా , , ,
వ ని త భా గ్యం బు దే వ ర చి త్త ము

(౪) ని ని మ గ రి సా రి ని సా ప ప మ గ రి గ । ,, ,, సా సా స ప
వ ని త భా గ్యం బు దే ,, ,, ము మా కు

(౧) ప ప రి స ని ధా ప మ ప గా రి రి ని సా । రి , , గ మ ప ద ప ధ మ ప ధ ని
ప ని గా దు ఇం క నీ పా దం బు లా న

(౨) ప ప రి స ని స ప ధ ప మ గ రి గ మ ప ధ ప మ గ రి ప । రి , గ మ ప ధ నీ ధ ప
ప ని గా దు ఇం క నీ పా దం బు

(౩) ,, ,, ,, । గ గ రి స ని ని ధ ప గ మ గ రి స ని ధ ప మ ప ధ ని॥
పా దం బు లా న (వనిత)

[చరణం]

(౧) మ మ మా మ మా ప ధ ప మ గా రి । , రి గ రి గ మ ప ధ ని ప ధ మా పా ప
అ డ బా ల స తి బో న మా ర గిం చు మ టం చు

(౨) మ మా , మా , మ మా ప ధ ప మ గా రి । , రి గ మ ప ధ ని స ని ప ధ మా పా ప
అ డ బా ల స తి బో న మా ర గిం చు మ టం చు

ధ ప గ మ ప మ గ ప మ మ ప గా రి । గ రి గా మ స ధ పా , , ,
బ డి బ డి ని క డు వి న్న ప ము సే య గ

పా ధ ని ప ధ ధ మ ప ధ నీ రి సా । ని ని ని మ గా రి ని ని రి స ని ధా ప
ఈ డు గ ని ప రా కు న ఉం డి నె చ్చె లి మీ ద

ని ని ని ని ని ని ని స ని ధ ప । పా , స సా , ప ప మ గ రి గ మా పా ధ ని
బ డ లి వా ర గి న ది నీ పా దం బు లా న ॥ (వనిత)

ఇట్లె క్రింది చరణములు:

(౨) అడపంబు పతి వీడె - మడధరింపు మటంచు
అడరి కప్పురపుబలు - కందియ్యగా,
కడగంట జూడ దిదె - కాంతాళమో మఱపో!
పడతి యిప్పుడు నీ - పాదంబులాన॥ (వనిత)

(౩) ఆలవట్టము విసరు - నతివలను వల దనదు;
పాలిండ్లపై కొంగు - పచరించదు;
ఏలా గానో వేంక - టేశ నీ విపు డిట్టె
పాలించకున్న నీ - పాదంబులాన॥ (వనిత)

లఘుటీక: మాకు బనిగాదు = మా శక్తిని మీఱినది; అడబాల సతి = వంటలక్క. 'అడు' ధాతువు 'వండు' అనే అర్థంలో తెలుగులో లేదు. కన్నడమున నున్నది. దానిపై వళ్ళ-వళ-వాళ-బళ-ప్రత్యయములు కర్త్రర్థమున ఆ భాషలో వచ్చును. 'అడబళ' తెలుగులోనికి వచ్చి 'అడబాల' అయినది. సంస్కృత 'బాల' ఇందు లేదు. ఇట్టిది కన్నడ 'మడివాళ' తెలుగులో మడివాలు; బోనము = భోజనము; బడిబడిని = వెంటవెంటనే; అడపంబు = తిత్తి-వక్కలాకులది; అడరి = ముందుపడి; కాంతాళము = ఉదాసీనత. కాతాళ మనియు రూపము. కాతరళబ్ధవముగా 'కాతళ' కన్నడమందు గలదు. కాంతారళబ్ధవమైనా కావచ్చును. గర్వము, అసూయ, కోపము, విఱ్ఱవీగు-ఇత్యాదిచ్ఛాయార్థములు దీనికి సంక్రమించినవి; ఆలవట్టము = తాళవృంతము-విసనకఱ్ఱ.

ముద్రిత పాఠములు: బడిబడినీకడు, కొంగుపవరించదు.

మధ్యప్రాచ్యము:

(10-వ పేజీ తరువాయి)

ధిక్కరించి సాంజక్, అలెగ్జాండ్రెట్టాలను టర్కీ ఆక్రమణకు విడిచిపెట్టాయి. ఈప్రాంతాల్లో టర్కీ దేశస్థులు నూటికి 39 వంతులు మాత్రమే ఉన్నారు. అసలు దేశాన్నంతనీడమాస్కస్, అలెప్పో అనే రెండు రాజ్యాలుగా సిరియాను విభజించడానికి కూడా ప్రయత్నం జరిగింది. దేశాన్ని ఛిన్నాభిన్నాలు చేసి, మిగతాపద్ధతులు అవలంబించ నారంభించారు. ఫ్రెంచి ద్రవ్యప్రమాణం(ఫ్రాంక్)తో సిరియన్ ద్రవ్యాన్ని ముడిపెట్టారు. దేశంలో ఫ్రెంచి భాష నిర్బంధంగా విధించారు.

సిరియన్లపై విశ్వాసం లేక ఉద్యోగాలలో అనేకమంది విదేశీయుల్ని నియమించారు. సిరియన్ ప్రభుత్వానికి అధికారాధికారాలివ్వాలనే ఉద్దేశంతో 1936 లో ఒక సంధిని ప్రతిపాదించారు. కాని రెండో ప్రపంచ సంగ్రామం ప్రారంభం కావడంతో సంధి ప్రతిపాదనలు ఉపసంహరించుకోడానికి వారికి సాకు దొరికింది.

మొత్తానికి బ్రిటన్ మధ్యప్రాచ్యంలో తన ప్రాభవాన్ని సుస్థిరపరుచుకోడానికి మిత్రరాజ్యాలతో రహస్యసంధులు చేసుకుంది. మధ్యప్రాచ్యంలో మూడో జాతిని అడుగుపెట్టకుండా, ఇతరులెవ్వరూ సైనికస్థావరాలు, విమానాశ్రయాలు మొదలైనవి స్థాపించుకోకుండా జాగ్రత్తపడ్డారు. ఈ కారణంవల్లనే బ్రిటన్ మొదటినుంచీ యువకుడైన వాహబీ ఇబన్ సాద్‌తో స్నేహసఖ్యతలను పెంపొందించుకుంది. అయితే బ్రిటన్ ఎంత ఒత్తిడిచేసినా టర్కీపై అరబ్ విప్లవంలో ఇబన్ సాద్ చేరలేదు. దీనికి ముఖ్యకారణం నిరాడంబరజీవులైన వాహబీలు, మక్కా హుస్సేనీవర్గంవారు అవినీతిపరులని తలిచి వారిని ద్వేషించడం. షరీఫ్ హుస్సేన్ అరబ్బులకందరికీ రాజని ఎప్పుడు ప్రకటించుకున్నాడో అప్పుడు ఉభయవర్గాల మధ్యా విద్వేషం విపరీతంగా పెరిగిపోయింది. హజాజ్ జాతులమధ్య తీవ్రప్రచారం సాగించి హజాజ్‌ను స్వాధీనపరుచుకోడానికి ఇబన్ సాద్ సర్వసన్నాహాలూ చేశాడు. కాని యుద్ధానంతరం అరబ్బీ దేశాలకు జరిగిన ద్రోహం బాల్ఫర్ ప్రకటనకు దారితీసింది. ఈ ప్రకటనతో షరీఫ్ హుసేన్ బలం క్షీణించిపోయింది. వెంటనే ఇబన్ సాద్ హెజాజ్‌పై దాడిచేసి ఆక్రమించుకున్నాడు. దానితోపాటు నెజద్ మొదలైన ప్రాంతాలన్నిటినీ చేర్చి ఇప్పటి సాదీ అరేబియా స్థాపించాడు. జరిగినదానికి బ్రిటిష్‌వారు అట్టే చింతించలేదు. ఇబన్ సాద్ నూత్న రాజ్యాన్ని గుర్తించారు.

మిత్రరాజ్యకూటమి చేసిన ద్రోహంవల్ల అరబ్బులకు చీకాకు హెచ్చింది. ఆక్సిస్ ప్రభుత్వాలు (జర్మనీ, ఇటలీ) ఈ పరిస్థితిని గమనించాయి. మిత్రరాజ్యాలవలెనే వారుకూడా, మొదటి ప్రపంచయుద్ధం సమయంలో ఏ ప్రాంతాన్ని ఎవరికి విడిచిపెట్టాలో ముందే కూడబలుక్కున్నారు. లెవాంట్, ఈజిప్టుల్ని ఇటలీ, ఇరాక్, పర్షియాలను జర్మనీ పంచుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఈజిప్టునగరాల్లో చెదిరి ఉన్న 60 వేలమంది ఇటాలియన్లద్వారా కైరోలోని ఇటాలియన్ లెగేషన్, తీవ్రప్రచారం చేసింది. పాలస్తీనా కల్లోల సమయంలో ఆక్సిస్ ప్రభుత్వాలు అరబ్బీలకు ఆయుధసామగ్రి సరఫరాచేసినట్లుకూడా చెప్పుకున్నారు. నాజీ నాయకులు మధ్యప్రాచ్యరాజధానీ నగరాలను తరుచు దర్శించి జాతీయోద్యమవర్గాలతో సఖ్యతాసాధనకు యత్నించారు.

అయితే ప్రపంచసంగ్రామం ఆరంభకాలానికి ప్రజల్లో అత్యధికులకు ఇవేవీ రాజకీయచైతన్యం తెచ్చిపెట్టలేక పోయాయి. ఈ యుద్ధంతో కాని రాజకీయాలతో కాని ఏ నిమిత్తమూ లేకుండా ఉన్నారు. రెండోసారి ఎవరికీ తోడ్పడి వారివలన మోసపోకూడదనుకున్నారు. తమ కేమీ కొరగాని ఈ యుద్ధంలో పాల్గొనజాలరని భారతీయులు ఘంటాపథంగా చెప్పారు. ఇదే పరరాజ్యపీడితదేశాలన్నిటిలోనూ ప్రతిధ్వనించింది. పాశ్చాత్య ప్రభుత్వాలు, మిత్రకూటంలో చేరినవైనాసరే, ఆక్సిస్ కూటంలో చేరినవైనా సరే అన్నీ సామ్రాజ్యవాద ప్రభుత్వాలేననీ, ఏవీ విశ్వాసయోగ్యమైనవి కావనీ ఈ పీడితదేశాలకు చక్కగా తెలిసిన విషయాలే. అందువల్లనే ఇరాక్‌లో రషీద్ ఆలీ తిరుగుబాటు, గ్రాండ్ముఫ్తీతిరుగుబాటు విఫలమైపోయినాయి.

రెండో ప్రపంచయుద్ధం అనంతరంకూడా సామ్రాజ్యవాద ప్రభుత్వాల సామ్రాజ్యతత్వం మారలేదు. జీవన్మరణ సంఘర్షణలో చిక్కుకున్న స్వతంత్ర ఫ్రెంచి సంఘంకూడా సిరియన్లపై బాంబులు, శతఘ్నులు ప్రయోగించడానికి వెనుదియ్యలేదు. యుద్ధసమాప్తితో పశ్చిమదేశాల స్నేహకూటాలలో చాలామార్పులు వచ్చాయి. మధ్యప్రాచ్యంలో బ్రిటన్ అమెరికాల ప్రాబల్యం వచ్చింది. బ్రిటిష్‌వారు రాజకీయ తంత్రాలకోసమూ, అమెరికన్లు ధనార్జనాభిలాషతోనూ మధ్యప్రాచ్యంలో పీఠం వేసుకున్నారు. ఈనాడు అరబ్ దేశాలన్నిటికీ స్వాతంత్ర్యం పేరుకి మాత్రమే మిగిలింది. కాని వాస్తవంలో అన్నీ అన్యదేశాలకు లోబడే ఉన్నాయి. ప్రతివలసదేశంలోనూ, అర్ధవలస ప్రతిపత్తిగల దేశంలోనూవలెనే అరబ్ ప్రపంచంలోకూడా తంత్రాలకు నాయకత్వం వహించినది బ్రిటన్. అందువల్ల అందరికంటే అత్యధికంగా ద్వేషించబడుతున్న దేశంకూడా అదే కావడం సహజమే. పూర్వకుత్సిత తంత్రాలనే అనుసరిస్తూ అరబ్ ప్రజల స్వాతంత్ర్యాన్ని బ్రిటన్ హేళనప్రాయంగా చేస్తోంది. ఈ పూర్వ తంత్రాలను బ్రిటన్‌లోని సామ్యవాదప్రభుత్వం కూడ మార్చుకోలేకపోవడం ప్రపంచంలో పెద్ద అనర్థకంగా ఉంది.

నేటి ప్రపంచరాజకీయాలలో మధ్యప్రాచ్యం స్థితిగతుల్ని గమనిద్దాం. మధ్యప్రాచ్యం ప్రపంచ రహదారుల్లో ముఖ్యమైనది. బ్రిటన్ దిగుమతి చేసుకునే నార, తేయాకు, రబ్బరు సరుకుల్లో నూరింట 90 మొదలు 100 వంతులవరకూ, జనుము మేంగనీస్‌లలో నూరింట 70 మొదలు 80 వంతుల వరకు, బియ్యం, ఉన్ని, కాఫీ, తగరం, సీసం మొదలైన వానిలో నూరింట 50 మొదలు 65 వంతుల వరకూ సూయజ్ కాలువ ద్వారానే రవాణా అవుతాయి. ఇదే కాదు. ఎంత పురాతనపుదైనా భూమిపై మార్గంకూడా ప్రధానమైనదే. ప్రథమ ప్రపంచసంగ్రామం ప్రారంభం కావడానికి తక్షణకారణం జర్మనీ బెర్లిన్ - బాగ్దాద్ రైల్వే నిర్మించడానికి యత్నించడమే. మధ్యప్రాచ్యం ప్రపంచానికి రహదారి. అందువల్లనే క్రైస్తవమత యుద్ధాల మొదలు 20 వ శతాబ్దిలో ఈనాటివరకూ బలవత్తర ప్రభుత్వాల సంఘర్షణకు మధ్య ప్రాచ్యమే హేతువయింది. రవాణామార్గాలు మానవుల మధ్య సఖ్యపా సామరస్యాలను సాధించడానికి బదులు శాంతిని స్థాపించడానికి బదులు సామ్రాజ్యవాదుల ప్రాబల్యంలో నలుగుతున్న ప్రపంచంలో ప్రపంచయుద్ధాలకు హేతువులైనాయి.

సూయజ్ కాలువ నిర్మాణారంభ సమయంలో డిలెసెప్స్‌ను ఆహ్వానిస్తూ రెనాన్ ఇలా అన్నాడు: "నేను శాంతిని సాధించడానికి రాలేదు. సంఘర్షణని తెచ్చాను. ఈ సామెత మీకు చెవిలో ఇంకా గింగురుమంటూనే ఉంటుంది. ఈ భూఖండాన్ని ఇప్పుడు ఖండించాం కాబట్టి ఇది కలుషితమైపోయింది. అంటే ఇది రణరంగమయిందన్నమాట. నాగరిక ప్రపంచాన్ని పీడించడానికి ఇంతవరకూ బాస్ఫరస్ ఒక్కటే చాలింది. ఇప్పుడు మరొకటి సృష్టించారు. ఇది మొదటిదానికంటె బీభత్సమైనది. యుద్ధం వచ్చిందంటే దీని ప్రాముఖ్యత అందరికీ తెలిసిందేకాబట్టే, అందరూ దీనినే ముందుగా ఆక్రమించుకోడానికి యత్నిస్తారు. మీరు మున్ముందు పెద్దరణరంగాన్ని సృష్టించారు."

ఈ ప్రాంతాన్ని బ్రిటిష్‌వారే శాశ్వతంగా ఆక్రమించుకొనుచున్నారు. సూడాన్‌నుకూడా ఆక్రమించుకుని ఈజిప్టుని అరచేతిలో పెట్టుకుని ఆడిస్తున్నారు. ఈదారిప్రక్క గల దేశాలన్నీ అనుభవించక తప్పదు.

మధ్యప్రాచ్యంలో లభించే ముడి వస్తువుల్లో నూని, ప్రత్తి అత్యంతప్రధానమైనవి. అమెరికా ఎంత పోటీ చేస్తున్నప్పటికీ ఈ ముడి వస్తువుల సేకరణ విషయంలో బ్రిటన్‌దే ఇప్పటికీ పైచెయ్యి. తయారీ వస్తువుల అమ్మకానికి మధ్యప్రాచ్యప్రదేశాల మార్కెట్లు అపారావకాశాలిస్తాయన్నమాట నిజమే. కాని అక్కడ పెట్టుబడి పెట్టే అవకాశాలు మరీ అధికం. అక్కడ ప్రభుత్వాలకు ఋణాలిచ్చి తంత్రాలు నడపడం పూర్వంనుంచీ జరుగుచున్నదే. కాని ఇప్పుడు అక్కడి రాజకీయాలలో ఆ తంత్రాలు మరింత వీలిస్తున్నాయి. ఈ ఋణాలపైన లాభాలు రెండు చేతులా గుంజుకోడానికి వీలు చిక్కడమే కాదు. ప్రభుత్వాల్ని చెప్పినట్లు ఆడించడానికి వీలిస్తున్నాయి.

యుద్ధానంతర పరిణామాలు ఈజిప్టు వ్యవహారాలలో ద్యోతక మౌతున్నాయి. 1936 సంధిని సవరణచేసి తమకు కొన్ని సదుపాయాలు కలుగచెయ్యాలని ఈజిప్టు కోరింది. ఈజిప్టు కోరిన సవరణలలో రెండు ముఖ్యాంశాలున్నాయి. బ్రిటిష్ సైన్యాలు దేశం విడిచి పోవాలన్నది ఒకటి. సూడాన్‌పై ఈజిప్టుకు సకలరంగాలలోనూ పాలనాధికారం ఇవ్వాలనేది రెండోది. బ్రిటిష్‌వారి ప్రోత్సాహంపై సూడాన్‌లోని ఉమ్మా పార్టీ సూడాన్ స్వాతంత్ర్యం కోసం ఆందోళన చేస్తోంది. సూడాన్‌కి కూడా ఈజిప్టు రాజే ప్రభువని ఇదివరలో గుర్తించబడినప్పటికీ, ఈ విషయాన్ని లక్ష్యపెట్టకుండానే, సూడాన్‌లో ప్రజలను స్వపరిపాలనకు సంసిద్ధపరచడమే తమ ఆశయమని ప్రకటించి బ్రిటిష్‌పాలకులు ఆ విధముగా వ్యవహారాలు నడుపుతున్నారు. బ్రిటిష్ గవర్నర్ జనరల్ ప్రజాస్వపరిపాలనాశయాన్ని ప్రకటించాడు. ఇంక రెండో అంశానికి, యుద్ధకాలంలో గాని యుద్ధభీతి కలిగినప్పుడు గాని ఈజిప్టు బ్రిటిష్ సైన్య సహాయం నిర్బంధంగా తీసుకోగల పక్షంలో మాత్రమే ఆ సైన్యాలు ఈజిప్టు విడిచి పెట్టి వెళ్లిపోడానికి అంగీకరించగలరని బ్రిటిష్‌వారు షరతు పెట్టారు. ఈ నాటికీ కాలువ ప్రాంతం బ్రిటిష్ సైన్యాల ఆక్రమణలోనే ఉంది. తమ స్వాతంత్ర్యానికి గల ఆటంకాలేవో తెలిసిన ఈజిప్టు ప్రజలు, నిత్యం మారుతున్న తమ ప్రభుత్వాలనెదిరించి ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులకు ఈజిప్టు ప్రభుత్వమే మూలమని నిందిస్తున్నారు.

ఇరాక్ దేశాన్ని వాస్తవానికి బ్రిటన్ వలసగా వినియోగించుకుంటోంది. బ్రిటిష్‌వారి సలహాలపై, బ్రిటిష్‌వారెంచిన వ్యక్తులతో అక్కడ ప్రభుత్వం నడుస్తోంది. 1921 మొదలు 1936 వరకూ ఇరాక్‌లో 36 ప్రభుత్వాలు మారినాయని చెప్తే బ్రిటిష్‌వారి విధానానికి ఫలితమైన నిత్యచంచలరాజకీయ వాతావరణాన్ని గ్రహించవచ్చును. ప్రభుత్వం నిజంగా డిప్యూటీస్ ఛేంబర్ (శాసనసభ) అధీనంలో లేదు. అక్కడ ఎన్నికల్ని గురించి ఒక ఇరాకీ నాయకుడీ రీతిగా అన్నాడు: "ఎన్నికలలో అభ్యర్థులనెంచేటప్పుడు పూర్వమంత్రులు ఇదివరలో శాసనసభల కధ్యక్షత వహించినవారు, ప్రభుత్వంవల్ల పెన్షన్ పుచ్చుకుంటున్న పూర్వప్రభుత్వోద్యోగులు, కులపెద్దలు, ఉద్యోగులు, విభిన్న జాతుల నాయకులు, మొదలైనవారందరినీ తిరిగి ఎంచుతారు. వీరంతా సభలో దాదాపు నూరింట 60 వంతు లుంటారు. మిగతావారంతా ప్రభుత్వానుగ్రహంపై ఆధారపడినవారై ఉంటారు."

యుద్ధానంతరం ఇరాక్ కూడా 1930 సంధిని సవరణ చెయ్యాలని చెప్పింది. బ్రిటిష్వా రంగీకరించారు. ఇరాక్ ప్రధానిపై ఒత్తిడి తెచ్చి 1948 జనవరిలో పోర్ట్స్‌మత్‌లో సంధిపత్రంపై సంతకం చేయించారు. తీరా అది చూస్తే పూర్వసంధికి నకలుగా ఉంది. బ్రిటిష్‌వారి కవే సదుపాయాలు. స్థావరాలు బ్రిటిష్‌వారికి తిరిగీ ఒప్పగించబడ్డాయి. శత్రురాజ్యాలతో మిత్రరాజ్యకూటం శాంతిఒడంబడికలు చేసుకునేవరకూ బ్రిటిష్ సైన్యాలు ఇరాక్‌లోనే ఉంటాయి. అంటే మిత్రరాజ్యాలు శత్రుదేశాలనుంచి తమ సైన్యాల నెప్పుడు తొలగిస్తాయో అప్పుడన్నమాట. సహజంగానే ఇది దేశంలో కల్లోలాలకు హేతువయింది. సంధిని ప్రభుత్వం అంగీకరించదని వాగ్దాన మిచ్చినప్పుడే ఈ కల్లోలం చల్లారింది. [సశేషము]



అవనిగడ్డ కాంగ్రెస్ సేవాదళకేంద్రసభ్యులు. అఖిలభారత సంస్థ నిర్మాతలు శ్రీ ఇనాందార్ వచ్చినప్పుడు తీసిన చిత్రం.

సముద్రలవణము: చరిత్ర, ఉపయోగాలు

శ్రీ గుండెపూడి శ్రీరామమూర్తి

గాలి నీరు తరువాత సముద్రలవణమువలె అన్ని పరిచితమయిన పదార్థము మరొకటి లేదు. మానవాహారమునకు ముఖ్యమైన పదార్థమే యీ సముద్రలవణము. ప్రపంచములోని జనసంఖ్యలో ప్రతియొక మనుష్యుడు 29 పౌనులవుప్పు ఏటేట యిలాగే వుపయోగించుచున్నాడు. 1907సం॥లో 2,000,000 టన్నుల వుప్పును సముద్రజలము నుండియున్నూ శిలాలవణమునుండియున్నూ ఒక బ్రిటను దేశములోనే తయారుచేశారు. కొద్ది కొద్దిగా లవణము చిన్న చిన్న కొండ గుట్టలలో కూడా యున్నటుల కనుగొనబడినది. ఈ చిన్న కొండగుట్టలనుండి నీటిలో కరుగుటచే లవణము కాలంకషములలోకిని అటనుండి సముద్రజలముల లోకిని గొంపోబడును. నిరంతరము సముద్రజల మావిరి నొందుటవలన లవణము సముద్రము లోనే వదలివేయబడును. సాధారణ సముద్ర జలము 3%వరకును లవణమును కలిగియుండును. అంతకు పూర్వమెన్నడో కాసారములును, సరస్సులును, లేదా సముద్రములును పూర్తిగా ఆవిరి అయిపోయి యెండిపోవుటచే శిలాలవణము నిలవ జేరుచున్నదని కనుగొనబడినది. శిలాలవణమనునది స్ఫటికాకృతి దాల్చిన లవణము, మాలిన్యములు లేనపుడు వర్ణము లేకను, మాలిన్యములతో కూడినపుడు పసుపు పచ్చగనో గోధుమరంగుననో లేక వూదావర్ణముగనో ఘనస్ఫటికాకృతి దాల్చియుండును కొన్ని కొన్ని ప్రదేశాలలో. కానీ యెక్కువగా ఘనాకృతి దాల్చి రంగుగలిగిన పదార్థములలాకన్పడును. సోడియహారిదము ధనవంతమైన ఇంగ్లీషు లవణము దొరకు తావు నార్త్‌విచ్. విన్సఫర్డు చేరువనయున్న చెషైరు జిల్లాలోనే యున్నది.

శిలాలవణమునకు తోడు బ్రయిను అనబడు సోడియహారిదపు యూటలనేకస్థలములందు కలవు. ఈ యూటలు దాదాపు సంపూర్ణ ద్రావణములా పరిగణింపబడు లవణము కరగిన నీటినిచ్చుచుండును. ఒక సంపూర్ణ ద్రావణము 15°లవద్ద నూరుపాళ్ళనీటిలో ముప్పదియారుపాళ్ళ లవణమును కలిగియుండును. లవణపు కరుగుదల యుష్ణోగ్రత పెరిగినకొద్దీ చాలా నెమ్మదిగా హెచ్చుచుండును.

సాధారణముగా పిలువబడు సముద్రలవణము శాస్త్రవేత్తలచే సోడియహారిదమని పిలువబడును. సోడియహారిదమునే మనము ప్రతిదినము ఆహార పదార్థములలో కారముతోపాటుపయోగించుచున్నాము. లవణము లైదురకములు. దిగువ నుదహరింపబడిన ఐదులవణములును పంచలవణము లనంబడును. (1) కాసాలవణము, (2) బిడాలక లవణము, (3) సవర్చసలవణము, (4) సైంధవలవణము, (5) సముద్రలవణము (మామూలువుప్పు). పంచలవణములను విరివిగా ఔషధములలో నుపయోగించెదరు. ముఖ్యముగా జీర్ణకోశము పనిచేయక అజీర్తివ్యాధులకు చిత్రకాది మొదలగు సౌషధముల తయారుచేయుటలో చాలా ముఖ్యము. మన మిప్పటికినీ అనేక ప్రదేశములందు చూచుచున్నాము. సముద్రము పరిసరములలో లేకపోవుటచేతను సముద్రలవణ మందుబాటు లేకపోవుటచేతను సముద్రలవణపు స్థానే సైంధవలవణమునే యుపయోగించుచున్నారు. రాజపుటానా, ఢిల్లీ మొదలయిన ప్రదేశాలలో సైంధవ లవణమునే యుప్పుని వాడుచున్నారు.

మొట్టమొదట రోమనులు బ్రిటనుదేశాన్నాక్రమించినపుడు చదరపు సీసపుపళ్ళెరములలో కొద్దిగాలనుల నీటినిమాత్రమే యావిరిచేయుచు వుప్పును సముద్రజలములనుండి తయారుచేసెడివారు. కానీ యిప్పుడు కొన్ని వేల గాలనుల నీరు పట్టునటువంటి విశాలమైన ఆయసపళ్ళెరములలో సముద్రజలము నావిరి యొందించి లవణమును తయారుచేసెదరు. యిప్పుడు చెషైర్ జిల్లాలో నవీనకాలపు పద్ధతిన లవణము తయారయినను యిదియును రోమను పద్ధతిపైనే ఆధారపడి యున్నది. భూమిలో చేయబడిన బోరింగుల ద్వారా వుప్పునీటిని పైకి లాగెదరు. ఒక వేళ భూమిలో నీరు లేకపోయిన ముందు మరియొక గొట్టముద్వారా నీటిని భూమిలోకి పంపెదరు. నీరు భూమిలోని లవణమును కరగించుటచే సంపూర్ణద్రావణములా మారును. సంపూర్ణద్రావణము నేరుగా ఆవిరియొనర్చు పళ్ళెరములలోనికి పంపోబడును. ఇలా లవణము నీటిలో కరగుటవలన భూమిలో పెద్దపెద్ద ఖాళీ లేర్పడుటచేత ప్రమాదకరముగా భూమి కూలిపోవుట సంభవించును.

సముద్రజలము క్రింద చూపబడిన యితరపదార్థముల నాయా నిష్పత్తిలో కల్గియుండును.

సోడియహారిదము	25. 79	పాళ్ళు
కల్సియగంధకితము	. 450	,,
మగ్నీషియహారిదము	. 093	,,
కాల్సియకర్బనితము	018	,,
కాల్సియహారిదము	. 044	,,
నీరు	73 . 605	,,

సముద్రజలము నావిరి యొనరించుట చాలా నెమ్మదిగా కొనసాగబడిన నిలవచేరునప్పటి కాకృతిలోయున్న లవణస్ఫటికముల యాకృతి చాలా పెద్దదిగా యుండును. వన్నెగల జాతిని బట్టి సోడియహారిదమును క్రింది విధముగా విభజంప వీలగును. 1. పరిశుభ్రమయిన లవణము. 2. పరిశ్రమలనుండి లభించు లవణము. 3. మీనవర్తకుల కుపకరించు లవణము. 4. అఘాత జలము నుండి వచ్చులవణము. వాటివాటి పరిశుభ్రతలను బట్టి పై విధముగా సముద్రలవణమును విభజింపనగును. అన్నిటికన్నను మొదట యుదహరింపబడిన లవణమే మిక్కిలి పరిశుభ్రమైనది, శ్రేష్ఠమైనది. మరికొన్ని పరిశ్రమలలో సముద్రజలమును వాయువుతీసివేయబడిన పళ్ళెరములలో తక్కువ వత్తిడియొద్ద ఆవిరిచేసెదరు. యివి వర్తులాకారముగా గొట్టములచే చుట్టబడి నీటియావిరితో వేడిచేయబడునట్టి ఇనుప కుళాయీలు. ఒక పళ్ళెరములో నావిరిచేయుటవలన వచ్చు నీటి యావిరి రెండవపళ్ళెరముచుట్టూ చుట్టబడిన గొట్టములద్వారా పంపెదరు. హిందూదేశము మొదలయిన యుష్ణప్రదేశాలలో 'వుప్పుతొట్లు' అనబడి పెద్ద విశాలమైన భూములలో యేర్పరుపబడిన తొట్లలో సముద్రజలమును సూర్యరశ్మిచే నావిరి యొనరించెదరు. యిలా తయారయిన లవణమును సోలార్ సాల్ట్ (*Solar Salt*) అనెదరు. వుప్పును తీసివేయగా మిగిలిన సముద్రజలమును బిటర్న్ అనెదరు. దీనిలో కాల్సియమగ్నీషియ లవణముల మాలిన్యములులా మిగిలిపోవును. సాధారణ సముద్రలవణము (సోడియహారిదము) మగ్నీషియ హారిదమును కలిగియుండుటచే వర్షాకాలములో వాతావరణములోయున్న తేమను చేపట్టి ద్రవరూపము దాల్చుచున్నది. బాగుగా పరిశుభ్రమయిన లవణమునీ క్రింది విధముగా తయారుచేసెదరు. లవణముతోనూ నీటితోనూ ఒక సంపూర్ణ ద్రావణము తయారుచేసి వడపోసెదరు. మగ్నీషియమునూ కాల్సియమునూ తీసివేయుటకొరకు క్షారకర్బనితమును కలిపెదరు. తిరిగి వడపోయగా వచ్చిన సోడియహారిద సంపూర్ణ ద్రావణములోకి వుదజనిహారిదవాయువును పంపెదరు. స్ఫటికాకృతిలో సోడియహారిదము అవక్షేపము నొందును. ఈ పరిస్థితులలో మగ్నీషియ హారిదమవక్షేపమొందదు. తయారయిన సోడియ హారిదము (లవణము) వేరుపరుపబడి ఆరబెట్టబడి పరిశుభ్రపరుపబడును. తయారయిన లవణము చాలా శ్రేష్ఠమయినది.

వాతావరణములోనే సముద్రజలము మనకు లభించుచున్నప్పటికి లవణము నంఏరు తయారు చేయుట కర్హులు కారు. ప్రభుత్వానుమతి పొందిన యే కొద్దిమంది మాత్రమే అలా తయారుచేయ వీలగును. యిలాంటి పద్ధతి నములులో లేకుండా చేయుటకొరకే కీర్తిశేషులైన మోహన్‌దాస్ కరంచంద్ గాంధి 1930సం॥ మార్చిలో వుప్పు శాసనాల నుల్లంఘించి సహాకారనిరాకరణోద్యమం లేవదీశాడు. వుప్పుసత్యాగ్రహములో పాల్గొని కృష్ణ జన్మస్థానము పాలయ్యారనేకమంది దేశభక్తులు. 1930సం॥ మార్చిలోనే గాంధీజీనికూడా ఖైదీ జేసింది బ్రిటిష్ ప్రభుత్వం వుప్పుశాసనాల నుల్లంఘించి వుప్పు తయారుచేయ నుద్యుక్తుడవగా.

సోడియహారిదము-ప్రయోగములు

మన యాహార పదార్థములను రుచిగను, రుచికరముగనూ చేయునది సముద్రలవణమే. తీసుకొన్న ఆహార పదార్థముల త్వరగా జీర్ణింపచేయుశక్తి లవణములో కలదు. కూరలలోను యితర పదార్థములతోను దీసికొనిన సోడియహారిదము జీర్ణకోశములో వుదజహారికామ్లములా మార్చివేయబడును. తయారయిన యుదజహారికామ్లము ఆహారము జీర్ణింప జేయుటలో సహాయకారిగా పనిచేయును. అదియునుగాక మండు వేసంగిలో మాత్రమే మామిడికాయల రుచి చూడగలము సోడియహారిదము లేనిచో. కానీ యిప్పుడు వర్షాకాలములో నయినను చలికాలములో నయినను మామిడికాయ రుచిచూడగలుగుచున్నామంటే వూరగాయలా తయారయిన మామిడికాయలో నుపయోగించిన లవణమే కారణము. యిలాగే మాగాయి, నిమ్మకాయ మొదలగు నూరగాయలకనేకవిధముల తోడ్పడుచున్నది సముద్ర లవణము. ఆహార పదార్థముల నిలవచేయుటలో కూడా సోడియహారిదముపయోగింప బడుచున్నది. చాపలను నిలువచేసి యితర దేశముల కెగుమతి చేయుటలో సోడియహారిద ముపయోగించబడుచున్నది. లేనియెడల దూరప్రదేశముల చేరులోపల లోనున్న యాహారపదార్థములన్నియు కుళ్ళి పురుగులపాలు కావలసిందే.

నీరు మొదలగు ద్రవపదార్థముల గొంపోవుటకుపయోగించు మృణ్మయగొట్టములను మలినములనుండి శుభ్రపరచి నునుపొందించుటకును సోడియహారిదము వాడబడుచున్నది. రోడ్లమీద పేరుకొనియున్న మంచును కరగించుటకును సోడియహారిదమే యుపయోగించబడుచున్నది. నీటి ఘనీభవోష్ణత దానిలో లవణము కలుపుటచే తగ్గిపోవుటవలన మంచు కరుగుచున్నది.

చంటిపిల్లలు సరిగా పాలు త్రాగకపోయినను, కారణ మేమియు లేక యేడ్చుచుండినను బాగుగోరు తల్లులనేకమంది పిల్లవానికి దిష్ఠితాకినదని వో గుప్పెడు లవణమును మూడు పర్యాయములు పిల్లవానిచుట్టుత్రిప్పి పొయ్యిలో పోస్తుంటారు పూర్వాచారాలమీద నమ్మకమున్న వనితలు. మేవిధమైన దిష్టినైనను చాలవరకు వుప్పు నుపయోగించే తీయుట జరుగుచుండును.

హిందూసాంప్రదాయ వివాహాల్లోకూడా లవణము చేయుపని లేకపోలేదు. వధూవరు లిద్దరికిని తారాబలాలు చూచు టందరికీ అలవాటే. తారాబలాలు చూచినాక సరయినవి కాకపోయిన వివాహసమయాన దానా లిస్తూ వుంటారు. అలా దానము లిచ్చుటలో ప్రత్యుక్తా రయినప్పుడు లవణ దానమిచ్చెదరు. తారలు:— "జన్మసంపద్విపత్ క్షేమ ప్రత్యు త్సాధన నైధనం" ఈ తారలలో జన్మవిపత్ ప్రత్యుగత్ నైధన తారలకు మాత్రమే దాన మిచ్చెదరు. మిగత తారల కీయి నవసరము లేదు. దానములు—శాకం గుడంచ లవణం సతిలం కాంచనంతథా, తారాబలము సరయినది కానప్పుడీ దానముల నిచ్చెదరు. లవణము (సోడియహారిదము) పైచెప్పిన విధములగా కాక అనేకగొప్ప పరిశ్రమల నభివృద్ధి నొందించుటకెలా తోడ్పడునో చూతము.

సోడియహారిదమునుండి సోడియకర్బనితము— లిబ్లాంకు పద్ధతి— ఛేంపరువద్ధతి నుండి తయారయిన గంధకికామ్లమును సోడియహారిదముతో వేడిచేయగా సోడియగంధకితమున్నూ వుదజహారికామ్లమున్నూ తయారగును. వుదజహారికామ్లము నామ్లీకరణ మొందించి హారిణమును తయారుచేసెదరు. హారిణమును ధావనచూర్ణము (*Bleaching Powder*) తయారుచేయుటలో నుపయోగించెదరు. సోడియగంధకితము కర్బనముతోనూ బొగ్గుతోనూ సున్నపురాయి యున్నప్పుడు వేడిచేసెదరు. తయారయిన పదార్థమును నీటిలో కరగించి సోడియ కర్బనితమును తయారుచేసెదరు. సోడియ కర్బనితము మలినపదార్థములతో కూడిన వస్తువుల శుభ్రపరుచుటకును గాజు పరిశ్రమలోనూ విరివిగా నుపయోగించబడుచున్నది.

దాహకసోడా— లిబ్లాంకు పద్ధతినుండి తయారయిన సోడియకర్బనిత ద్రావణమును నీటియావిరితో సంయోగ మొందింప చేయగా సోడియకర్బనిత మంతయూ సంపూర్ణముగా దాహకసోడాలా మారును. తయారయిన దాహకసోడా అద్దకపరిశ్రమలలోను సబ్బుపరిశ్రమలోనూ వుపయోగించ బడుచున్నది.

సోడియహారిద ద్రావణములోనికి విద్యుచ్ఛక్తిని ప్రవహింపచేసినచో సోడియలోహమును, హారిణమున్నూ వచ్చును. సోడియము నీటితో సంయోగమునొంది దాహకసోడా నిచ్చును. పెద్ద పెద్ద పరిశ్రమలుకూడా యీవిధముగానే కొనసాగబడుచున్నవి. విద్యుచ్ఛక్తివలన సోడియహారిదము వియోగమునొంది సోడియహారితమునూ, దీనినుండి తయారుచేయ వీలగు పొటాసియ హారితమునూ యిచ్చును. సోడియము వెండిలా మెరిసే తెల్లని లోహము. మంచి విద్యుద్వాహకము వెండిలాగా. కొన్ని సమయములంమ విద్యుచ్ఛక్తి నిచ్చివేయు లాంపులలో నుపయోగించెదరు. టెలీవిషన్‌లోనూ ఒకరకపు ఛాయాచిత్ర గ్రహణములోనూ విరివిగా నుపయోగించుచున్నారు. ఒకరకపు రబ్బరుపరిశ్రమ సోడియము లేనిదే జరుగదు. ముఖ్యముగా సోడియమును జంతువృక్షసంబంధపు రసాయన శాస్త్రములో వాడుచున్నారు. సోడియముతో ఇతర ముఖ్యమయిన రసాయన పదార్థముల తయారుచేయుచున్నారు. మగ్నీషియహారిదమను ఖనిజమునుండి మగ్నీషియమును తయారుచేయుటలో పూర్వకాలము సోడియము నుపయోగించెడివారు. ఏదేశపు నాగరికతయినను ఆదేశ ముపయోగించు సబ్బు కాగితముల నుండియే తెలిసికొన వచ్చునట. అలాంటప్పుడు దాహకసోడా (*Sodium Hydronide*) విరివిగా వాడితేనేకానీ దేశము నాగరికత నొందిన దన వీలులేదు. యెందువల్ల ననగా, దాహకసోడానుండి యోగాసబ్బు తయారగుచున్నది.

హారిణము— నిర్జలగంధక ధృతికి సోడియహారిదము కలుపగా వచ్చు వుదజహారికామ్లమును మంగనద్వి ఆమ్ల జనిదముతో నామ్లీకరణ మొందింపగా హారిణము తయారగుచున్నది. హారిణము క్రిముల నాశ మొందించుటకును నీటిని శుభ్రపరుచుటకునూ అనవసరమైన వూలరంగులను దూది వూళ్ళ రంగులనూ మాపుట కుపకరించుచున్నది.

సోడియహారిదము సబ్బుపరిశ్రమలో నేరుగా సబ్బున నక్షేపమొందించుటకు కొద్దికొద్దిగా వాడెదరు. అలా చేయుటవలన సబ్బంతయూ పూర్తిగా నవక్షేపమొంది పరిశుభ్రముగా తయారుచేయు నవకాశ మిచ్చుచున్నది. సోడియహారితము పొటాసియహారితము తయారగుటవలన నిప్పుపెట్టె పరిశ్రమలకును మందుగుండు సామగ్రి పరిశ్రమాభివృద్ధికిని యెంతయో సహాయకారులవుచున్నవి.

మనది హిందూదేశము. మొదటనుండియూ పరిశ్రమలలో వెనకంజ వేసియున్న దీ దేశము. వీలైనన్ని విధము లాపరిశ్రమ లభివృద్ధి నొందించుటకై ప్రభుత్వం యత్నించాలి. దానికి ప్రజలు కూడా ప్రోద్బలమివ్వాలి. సోడియహారిదము హిందూదేశములో యెక్కువగా తయారగుట కవకాశములు లేకపోలేదు. సముద్రతీరము మూడు వైపులా యుండుటచేత. కాన సోడియహారిద పరిశ్రమ నభివృద్ధి నొందించి దానినుండి యభివృద్ధి నొందించుటకు తగిన పై యితర పరిశ్రమలకు కూడా కావలయు నవకాశము లేర్పరచిన ఓ అడుగు ముందంజ వేయవచ్చు. మనిదిప్పుడు స్వతంత్ర దేశముకాన యే యితరదేశము పైనను పరిశ్రమలకొరకాధారపడ నవుసరం ఏమాత్రమూ లేదు. మనకు మనమే నూతనమైన అనేక విధములగు వేనకువేల పరిశ్రమ లభివృద్ధి నొందించి హిందూదేశమునుకూడా అమెరికా మొదలయిన వాటిలా పరిశ్రమలలోనూ, భాగ్యములోనూ తులతూగేలా చేస్తేనే భరతమాత పరిపూర్ణత నొందుతుంది. అప్పుడే భారతదేశకీర్తి భారతదేశ శాస్త్రవేత్తల కీర్తి వేనోళ్ళ శ్లాఘించ వీలు కలుగుతుంది.



★ పారిస్ సమావేశం
★ ఆస్ట్రియా గురించి సమాధానం

పారిస్ సమావేశం సమాప్తి కావచ్చింది. నాలుగువారాల చర్చ నిష్ఫలం కాలేదు. నిర్ణీత కార్యక్రమంలోని నాలుగు అంశాలలో ఆస్ట్రియా శాంతి ఒడంబడికపైన మాత్రం నలుగురి మధ్యా అంగీకారం కుదిరింది. బెర్లిన్ నగరంలోనూ, జర్మనీలోనూ ఉభయప్రాంతాల మధ్యనూ రవానా సౌకర్యాలు తిరిగి నెలకొల్పడానికీ, జర్మనీలో ఉభయపక్షాలూ తగువులు పెంచుకోకుండా ఎవరిమట్టుకు వారు వీలైనంత వరకూ సహకారం నెరపడానికీ అంగీకారం కుదిరింది.

ఎప్పటికప్పుడు విఫలమైపోతుం దనుకుంటూనే నాలుగు వారాలుపైగా నడిచింది సమావేశం. మూడు వారాలుకంటె అమెరికా విడిచిఉండలే నన్నాడు - అమెరికన్ విదేశాంగ కార్యదర్శి డీన్ ఆఛిసన్. రష్యన్లతో చర్చలకంటె పార్టీ వార్షిక సమావేశమూ, బ్రసెల్స్ ప్రభుత్వ వ్యవహారాలూ ప్రధాన మని సూచించినట్లు బ్రిటిష్ విదేశాంగ మంత్రి బెవిన్ ఈ నాలుగు వారాల్లోనూ రెండురోజులు స్వదేశం వెళ్లి వచ్చాడు. లగ్జెంబర్గ్‌లో బ్రస్సెల్స్ సంధి ప్రభుత్వాల (బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, హాలండ్, లగ్జెంబర్గ్) విదేశాంగ మంత్రుల సమావేశానికని వెళ్లి అక్కడ రెండురోజులు గడిపారు బెవిన్, షూమన్.

పశ్చిమజర్మనీ ప్రభుత్వస్థాపన, యూరోపియన్ కౌన్సిల్, అట్లాంటిక్ ఒడంబడికల సందర్భంలో అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు వీసం వెనుకాడలేదు. పట్టుదలతో తలచిన కార్యాలని కొనసాగిస్తున్నారు. జర్మనీలో ప్రజ లెంత మొరపెట్టుకున్నా వినక, నిరోధించినా జంకక భారీపరిశ్రమల్లో అనుకున్న వానిలో యంత్రపరికరాలు పీకివేస్తున్నారు. బెర్లిన్ దిగ్బంధనవిషయంలో ప్రజ లెన్ని బాధలకులోనైనాసరే నగరాన్ని విడిచి వెళ్లకూడ దని పట్టుదల పట్టి మాట నెగ్గించుకున్నారు. నానాటికీ జర్మన్ ప్రజల ఆర్థికస్థితి దుస్తర మౌతున్నది. తూర్పు యూరప్‌లోకూడా ఆర్థికస్థితి హీనంగా ఉన్నట్లు వార్తలు ప్రచార మైనాయి. వాస్తవానికి తూర్పు యూరప్, పశ్చిమ యూరప్ ఆర్థికంగా పరస్పరం ఆధారపడి ఉన్నాయి. పశ్చిమంనుంచి భారీపరిశ్రమల తయారీవస్తువులు తూర్పుకీ, తూర్పునుంచి ఆహారపదార్థాలు ముఖ్యంగా రవాణా కావాలి. తూర్పు నుంచి ఖనిజపదార్థాలుకూడా పశ్చిమదేశాల కవసరం.

రష్యా అమెరికాల వైషమ్యాల ఫలితంగా యూరప్ రెండు ఖండాలుగా విడిపోయింది. యుద్ధకాలంలో శత్రుదేశాలమధ్యవలెనే ఉభయ ప్రాంతాలమధ్యనూ వాణిజ్యాది వ్యవహారాలన్నీ స్తంభించిపోయాయి. ఉభయ ప్రాంతాల మధ్యనూ ప్రజలరాకపోకలు నిలిచిపోయాయి. పశ్చిమ యూరోపియన్ దేశాలు ఆర్థికంగా, రాజకీయంగానే గాక సైనికంగాకూడా ఆయత్త మౌతున్నాయి. సైనికాయత్తాలు పూర్తి అయితే యుద్ధం ఆరంభం కావడానికి హేతువు ఎంత అల్పమైనదైనా ఎప్పుడో ఎక్కడో సంఘటించకపోదు. పరిస్థితులు ఈరీతిగా ఉంటే ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాల్లోకూడా కమ్యూనిస్టుపార్టీలు బలహానపడకతప్పదు. ఇటలీ, జర్మనీలలో అతి జాతీయవాదులు తిరిగి బలపడుతున్నారు.

ఫాసిస్టు, నాజీబలాలు వృద్ధి అవుతోంటే పశ్చిమప్రభుత్వాలు చూస్తూ ఊరుకుంటున్నాయి. ఈ పరిస్థితులు మారితేగాని, ఉభయ ప్రాంతాలమధ్యనూ రాకపోకలు వాణిజ్యం తిరిగి చురుగ్గా జరిగితేగాని ఆదేశాలలో రష్యా తంత్రాలకి అవకాశం పూర్తిగా పోతుంది. ఆదేశాల కమ్యూనిస్టుపార్టీలకు రష్యా తగినంత తోడ్పాటు ఇవ్వడం అసంభవం. కాందిశీకుల సమస్య కమ్యూనిస్టుల అరాచకప్రోద్బలానికి చక్కని పరికరం. ఆ పరికరాన్ని ఉపయోగించుకోగలగాలంటే పరిస్థితులు మారాలి.

పశ్చిమరాజ్యాలకు కావలసింది బెర్లిన్‌లో దిగ్బంధం తొలగింపు. బెర్లిన్ దిగ్బంధంవల్ల బ్రిటన్ అమెరికాలు అపారనష్టానికి గురౌతున్నాయి. పశ్చిమ బెర్లిన్‌లో ప్రజల బాధలు నానాటికీ పెరుగుతున్నాయి. జర్మనీ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. పరిస్థితులు మారవలసిన అగత్యం ఉభయపక్షాలకీ కలిగింది.

అయితే పరిస్థితుల మార్పుకోసమని జర్మనీలో ఏపక్షమూ తమ స్థావరాలు కార్యక్రమాలు విడువరు. సంధికి అవకాశం ఎక్కడుందో నాలుగు ప్రభుత్వాలకూ తెలిసేవచ్చినట్లు కొందరి అనుమానం. యుగోస్లావియా రష్యాల మధ్య ఏర్పడిన వైమనస్యాలనుగురించి బ్రిటన్ అమెరికాలలో ప్రచారం అత్యధికంగా ఉంది. ఈ వైమనస్యాలను అవకాశంగా తీసుకుని అమెరికా యుగోస్లావియాతో ఆర్థిక వాణిజ్యబాంధవ్యాలు నెరపడానికి యత్నించింది. టిటో నిరాకరించాడు.

ఆస్ట్రియాతో సంధివిషయమై ఇదివరలో సమాలోచనలు జరిగినప్పుడు రెండు విషయాలపై అంగీకారం కుదరలేదు. 1. రష్యా కోరే యుద్ధనష్ట పరిహారధనం. 2. ఆస్ట్రియా-యుగోస్లావియా సరిహద్దు మార్పులు. ఇప్పుడు రష్యా-యుగోస్లావియాల మధ్య వైమనస్యాలు వచ్చినందువల్ల రష్యా సరిహద్దు తగాదా విషయంలో అంతగా పట్టుబట్టలేదు. 1938 లో సరిహద్దే ఇప్పుడూ ఉండేటందుకు రష్యా అంగీకరించింది. రష్యా కోరిన పరిహారం ఇప్పించడానికి మిగతా మూడు ప్రభుత్వాలూ అంగీకరించాయి. అయితే వివరాలను గురించి ఇంకా చర్చలు జరుగుతున్నాయి. ప్రధానాంశాలమీద అంగీకారం వచ్చింది.

పోతే చర్చనీయాంశాల్లోని మూడు అంశాలపైనా నలుగురు విదేశాంగమంత్రులమధ్యా అంగీకారం కుదరలేదు. ఇవి 1. జర్మనీ ఆర్థిక రాజకీయ భవిష్యత్తు, దేశైక్యత, 2. బెర్లిన్ పరిపాలన, రవానాలసమస్య, 3. జర్మనీతో శాంతి ఒడంబడిక.

ఈ అంశాలపైన అంగీకారం కుదరకపోయినా, ఉభయప్రాంతాలమధ్యనూ రవానా వాణిజ్యాది సౌకర్యాలు తిరిగి నెలకొల్పడానికీ, ఎవరి వీలునుబట్టి వారు పరిపాలించుకోడానికీ అంగీకారం కుదిరింది.

ఒకరి వ్యవహారాలలో ఒకరు జోక్యంచేసుకోకూడదు. జర్మనీలో నాలుగు ప్రభుత్వాలూ తగువులు పెంచుకోకుండా ఎవరికి వీలైనట్లు వారు వ్యవహరిస్తుంటే క్రమంగా కొన్ని దినాలకి నలుగురికీ అంగీకారయోగ్యమైన పరిష్కారమార్గం గోచరిస్తుందని ఆశిస్తున్నారు. బెర్లిన్‌పై తిరిగి దిగ్బంధం విధించకూడదనే షరతుకు రష్యన్ విదేశాంగమంత్రి విషిన్స్కీ బేషరతుగా అంగీకరించలేదు. కాని ఈవిషయమై కూడా ఏదో ఒకవిధంగా అంగీకారం కుదరవచ్చును.

ఈ పైన ప్రపంచానికి యుద్ధప్రమాదం తప్పిందని అగ్రరాజ్యాలు ప్రచారం చెయ్యవచ్చును. కాని చీకటి కుస్తీలు (కోల్డ్‌వార్) ఏమీ తగ్గవు. జర్మనీప్రజల బాధల కిప్పుడప్పుడే అంతం లేదు. [సూర్యం]

మనరాష్ట్రం - మనదేశం

(9 వ పేజీ తరువాయి)

కర్తవ్యవిస్మృతి అన్నిరాష్ట్రాలలోనూ, మంత్రివర్గాలపైనా, కాంగ్రెస్ సంఘాలపైనా ఆరోపించవచ్చును. మంత్రులు ప్రజాస్వామ్యమంటే ఏమిటో మరిచి, విశృంఖలంగా ప్రవర్తిస్తున్నారు. కాంగ్రెస్ సంఘాలతో విరోధపడి, వానికి ప్రత్యర్థి సంఘాలను స్థాపించి, కాంగ్రెస్ మాతృసంస్థకు ద్రోహం చేస్తున్నారు. కాంగ్రెస్ సంఘాలు మంత్రివర్గ వ్యతిరేక ప్రచారంలోనే కాలం గడుపుతున్నాయి. పరిపాలనాక్రమానికి ఆటంకాలు కలిగిస్తున్నాయి. జాతియసంస్థగా కాంగ్రెస్ కర్తవ్య మేదో ఆ సంఘాలు పూర్తిగా విస్మరించాయి. దూషణభూషణలు తప్ప వారికి వేరే పనే లేదు.

కమ్యూనిస్టు ఉపద్రవాన్ని నిరోధించడానికి ప్రభుత్వాలకు సహాయపడటానికి బదులు కాంగ్రెస్ సంఘాలు ప్రభుత్వాన్నెదిరించి ప్రవర్తిస్తున్నాయి కూడా. ప్రజల్లో కొన్ని వర్గాల్లో అరాచక ప్రవృత్తి ఈనాడు బీభత్సంగా చెలరేగుతోందంటే దానికి కాంగ్రెస్ వాదుల బాధ్యత కూడా కొంత ఉంది. దౌర్జన్యం మంత్రివర్గ ప్రతికూలురపై జరిగినప్పుడు, ప్రభుత్వాలు కిమ్మనకుండా ఊరుకున్న సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఇదంతా చూస్తే కాంగ్రెస్‌వాదులు కాంగ్రెస్ సంస్థ క్షేమాన్ని గురించి రవంతైనా యోచించడం లేదని ధృవపడుతోంది.

దేశమంతా పరిస్థితి కొద్దిగానో హెచ్చుగానో ఇలాగే ఉంది. అందువల్ల కాంగ్రెస్ నాయకులు దీనికి వెంటనే చికిత్స చెయ్యాలి. అవసరమైతే కాంగ్రెస్‌సంస్థకు చెందినవారినైనాసరే కొందరిని ప్రజలకు విశ్వాసపాత్రులైనవారిని నియమించి పరిస్థితిని పరిశీలింపచేయాలి. వ్యక్తిగత మైత్రివిరోధాలను పాటించకుండా, అవినీతి ఉన్నచోట దండించాలి. చెన్నపట్నంలో జరిగిన విచారణవంటి అర్థమనస్క-వ్యవహారాలవల్లనూ, ఆశ్రితపక్షపాతంవల్లనూ కాంగ్రెస్ అధోగతిపాలైతే, బాధ్యత ఇప్పుడు కాంగ్రెస్ సంస్థకు సారథ్యం వహించిన వారిదే కాగలదు.

కాంగ్రెస్‌సంస్థలో సభ్యుల సంఖ్యాబలం క్షీణిస్తుం దనిగాని, కొందరు వ్యక్తులు లేకపోతే కాంగ్రెస్ సంస్థ కూలిపోతుందని కాని భావించి దోషాల్ని కమ్మకోచూచినట్లయితే కాంగ్రెస్ నాయకుల ధర్మనిరతిలో న్యాయబుద్ధిలో ప్రజలకు విశ్వాసం క్షీణిస్తుంది.

శాసనసభ:

చెన్నరాష్ట్రశాసనసభ ఈవారం సమావేశమై కొత్తపన్నులు, పన్నులహెచ్చింపులకు సంబంధించిన శాసనాలు చర్చించింది. పన్నుల విధానంలో రాష్ట్రప్రభుత్వ వైఖరిలో చెప్పుకోతగ్గ మార్పేమీ లేదు. కొబ్బరికాయలపైనా (కొబ్బరపైనమాత్రం విడిచిపెట్టరు), మిర్చిపైనా వాణిజ్యసుంకం విధించే ప్రతిపాదన విరమించుకోడానికిమాత్రం అంగీకరించారు. సెలక్టు కమిటీలో జరిగిన మార్పులవల్ల ఎవరికీ ప్రయోజనం కలగదు. పరిశ్రమల కవసరమైన ముడిసరుకులు, ఎగుమతి వస్తువులపైన వాణిజ్యసుంకం విధించడం కేంద్రప్రభుత్వ విధానాలకు, ఆర్థిక కార్యక్రమాలకు విరుద్ధమని తెలిసికూడా గోపాలరెడ్డిగారు ఈ రాష్ట్రంలో ప్రత్తి, నూనెవిత్తనాలు, రబ్బరు, తేయాకులపై పన్ను ఎందుకు విధిస్తున్నారో వారికే తెలియాలి. త్వరలోనే కేంద్రప్రభుత్వం గోపాలరెడ్డిగారిని హెచ్చరిస్తుం దని భావించవచ్చును. ధనికుల్ని వొదిలి, వ్యవసాయాదాయ సుంకాన్ని వొదిలి పేదల పొట్ట కొట్టడానికే రెడ్డిగారు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తుంది. వాణిజ్యసుంకభారం అంతా కొనేవారిపైనే పడుతోందికాని, వర్తకులు పైసా చెల్లించడంలేదు. పదిరూపాయల వస్త్రం కొంటే దానిపైన చెన్నరాష్ట్రపు వాణిజ్యసుంకం, బొంబాయి వాణిజ్యసుంకం, ఎక్సైజ్ పన్ను వగైరా రూపాయిన్నరకి వస్తున్నాయి.

ఒక్కొక్క మనిషి సాలుకి రూపాయి చొ॥ వాణిజ్యసుంకం చెల్లిస్తే నాలుగుకోట్లు ఆదాయం వస్తుం దన్నారు గోపాలరెడ్డిగారు. వాస్తవానికి మనిషికి రోజుకి మూడునాలుగణాలు వాణిజ్యసంకాల భారం పడుతోంది. ప్రజలనెత్తినే సుంకమంతా రుద్దే వర్తకుల్ని ఏమీ చెయ్యలేదు ప్రభుత్వం. వాణిజ్యసుంకం తామే భరించి పూర్వపు ధరకే పత్రికలు విక్రయిస్తున్న పత్రికల యజమానులికి మాత్రం ప్రకటనల ఆదాయంపైన పన్ను విధించబూనుకుంటున్నారు. తమ అకార్యాలన్నిటినీ పత్రికలు కప్పిపుచ్చలేదని మంత్రుల ఆక్రోశం. మన మంత్రిగారి వింత ఆర్థికసూత్రాల ఫలితం త్వరలోనే తెలిసిరాగలదు. [స్వార్యం]

గ్రంథ స్వీకారము

జై హింద్

నాటకము. కర్త యరగుడిపాటి రామయోగి. త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్టణం వెల 12 అణాలు.

పరీక్ష

నవల: మూలం జైనేంద్రకుమార్. అనువాదం అయాచిత్. విజ్ఞానసాహిత్యవనం, విజయవాడ, సికింద్రాబాద్. వెల 1-8-0.

కులాసా కబుర్లు

కామధేనువు - ఖజానామంత్రి

శ్రీ జి. యస్. సూరి

చన్నపట్నం పౌరులకు వారఫలాలు ఇవ్వమంటే ఈ విధంగా చెప్పివేస్తాం. జూలై మొదటి తేదీనుండి గడ్డుకాలం ఆసన్నమవుతుంది. రాజ్యస్థానంలోఉన్న పాపగ్రహవీక్షణంవల్ల కించిత్ మనఃక్లేశమూ, ఇసుమంత శరీరశ్రమ, రవంత వినోదము సంభవించే సూచనలు కనబడుతున్నవి. ఒకటి రెండు మూడు తేదీలలో పన్నులు అధికమైనందున హోటళ్లు మూయటం జరుగుతుంది కాబట్టి అవసరమైనవాళ్లు బంధుమిత్రుల ఇళ్లలో వారాలు చెప్పుకొనటం మంచిది. జీతాలు పెంచనందువల్ల ట్రాంబండ్లునిలచిపోగలవు కాబట్టి తలపెట్టిన ప్రయాణాలు ఆగిపోయే పరిస్థితులు ఏర్పడవచ్చును. వినోదపు పన్ను హెచ్చుఅయినందున సినిమాప్రదర్శనములు బందు అయి వినోదాలకు అవకాశం ఉండదు. ప్రకటనలపై అదనపుసుంకాలను విధించటం వల్ల పత్రికలకోసం అధికంగా వ్యయం చేయవలసి ఉంటుంది. పంపులలో నీళ్లు రానందువల్ల గృహకల్లోలాలు బయలుదేరవచ్చు. శెలవలలో నీలగిరికి వెళ్లివచ్చిన జడ్జీలకు మొదటి రెండుమూడు రోజులూ బడలికగా ఉంటుంది కాబట్టి హైకోర్టు వ్యవహారాలు అనుకూలంగా ఉండవు. శంకరరావ్ దేవ్ గారి విచారణ విషయంలో స్వైక్యులేషను లాభకరం కాదు. వారాంతంలో శుభవార్త. అప్పులవాళ్ల సమాగమం.

ఇవి మామూలు వారఫలాలనుకొని సరదాకోసం చదివిమరచిపోకండి. అక్షరాలా జరిగితీరుతవి. ఆయాబాపతులవాళ్లు అధికార్లకు నోటీసులు అప్పుడే జారీచేశారు. పత్రికలలో ప్రకటించారు. కరపత్రాలను ప్రచురించారు. ముందుగా జాగ్రత్త పడమని తెలియచేశారు. మేమూ హెచ్చరిక చేస్తున్నాం. అప్పటికీ ఉపేక్ష చేస్తే, చేసినవారిదే జవాబుదారీ.

భారతీయుడి రాబడి సగటున దినం ఒక్కటికి అణన్నర మాత్రమేనని మరచిపోవద్దు అన్నాడు గాంధీ మహాత్ముడు. ఉప్పుమీద పన్ను తీసివెయ్యాలన్నాడు. మద్యపానం నిషేధించమన్నాడు... మహాత్ముడి ఆజ్ఞలు నిరాఘాటంగా శిరసా వహిస్తున్నామన్నారు శిష్యకోటి. కేంద్ర ప్రభుత్వంవారు ఉప్పుమీది పన్ను తీసివేశారు. మనరాష్ట్రప్రభుత్వంవారు మద్యపానాన్ని నిషేధించారు. ఇక కావలసిందేమున్నది? రామరాజ్యం వచ్చిపడ్డదని మనలాంటివాళ్లు చంకలు కొట్టారు.

అంతటితో మన ఖామందులు ఊరుకుంటే బ్రతికిపోయేవాళ్లం. కాని ఊరుకోలేదు. మనం మోస్తున్న భారాన్ని ఒకతులం కుడిచేతితో తగ్గించి ఒకమణుగు ఎడమచేతితో కలిపారు. అర్ధణా కార్డు ముక్కానీ అయింది. మైలుకు నాలుగు దమ్మిడీల రైలు టిక్కెట్టు అర్ధణా అయింది. ఏవస్తువ కొన్నా ఖరీదులో నాలుగోవంతు పన్ను చెల్లించమన్నారు.

ఇస్త్రీకు పాడికి ఇదివరకు సరిపోయే డబ్బుకు ఒకటిన్నర సినిమాటిక్కెట్టుకంటె వచ్చేందుకు వీలుకావటం లేదు. అణా కాఫీ కప్పు రెండణాలు అయింది. కానీ చుట్టపొగాకు అర్ధణా అయింది. వక్కలమీద పన్ను, అరటిపండ్లమీద పన్ను, మిరపకాయలమీద పన్ను, బంగాళాదుంపలమీద పన్ను, ఇకమీద గడ్డం గీయించుకుంటే పన్ను; ఖాండ్రించి దగ్గితే పన్ను, "భారాలలో కల్లా పన్నుభారం ఎక్కువో, సిద్దయ్యగారూ" అని పాడుకోవలసివచ్చింది.

ఊరిమీద ఊరువచ్చి పడినా కరణం గారికి గడ్డిపోచ అయినా పోదంటారు అనుభవజ్ఞులు. అదే విధంగా ఏ కొత్తపన్ను అమలులోకి వచ్చినా వ్యాపారస్థుడికి పోయేది ఏదీ లేదు. బరువంతా జనసామాన్యంమీదనే విరుచుకు పడుతుంది. అమ్మకపు పన్ను పెంచితే ఖరీదులో కలుపుతాడు షావుకారు. లైసెన్సు రుసుము హెచ్చిస్తే కప్పు కాఫీ కూడణాలు చేస్తాడు హోటలు కామందు. బస్సుపన్ను అధికం చేస్తే ఛార్జి పెరుగుతుంది. వినోదపు పన్ను మరింత అయితే టిక్కెట్టు గిరాకీ అవుతుంది. ప్రకటనలపైన సుంకాలు విధిస్తే అడ్వర్టయిజర్ల పరుకులు ప్రియం కావటమేగాక పత్రికలధరకూడా ఎక్కువవుతుంది. అణన్నర సంపాదించే భారతీయుడు అణా కానీని ప్రభుత్వానికి అర్పించి మిగిలిన కానీతో రామరాజ్యం అనుభవిస్తాడు. అందుకనే అవతారం చాలించాడు మహాత్ముడు!

చొక్కాగుడ్డ కొందామని ఈ మధ్య బజారుకు వెళ్లటం తటస్థించింది. నూలు వడకటం బద్ధకం అయింది కాబట్టీన్నీ నూలు ఇస్తేనేగాని గుడ్డం అమ్మరు కాబట్టీన్నీ, అమాంబాపతుల వారికందరికీ బురఖా అయింది కాబట్టీన్నీ, ఖద్దరు షాపుకు వెళ్లేందుకు వీలు లేకపోయింది. శనగగింజలు మేసే చూపుల గుఱ్ఱం మాదిరిగా ఉన్న ఒక కరాచీ జవుళీ వ్యాపారస్థుడి కొట్టుకుపోయినాము. బల్లమీద ఒక తాను మమ్మలను ఆకర్షించింది. దాని మీద ధర పది అణాల అయిదు దమ్మిడీ లని ఉన్నది. రెండు రూపాయలకు చొక్కా వచ్చిందని లొట్టవేసి నాలిగింటికి చింపమన్నాం. బిల్లు చేతికి ఇచ్చేప్పటికి కాళ్లు చల్లపడ్డవి. దానిమీద ముద్ర, మిల్లు రేటుట. ఆ రేటుకు ఆరవవంతు చిల్లర షాపువాడు కలుపుతాడుట. దానిమీద సూపర్ ఫైన్ గుడ్డ కాబట్టి గజానికి మూడు అణాలు ఎక్సయిజు పన్నుట. ఆపైన బొంబాయి రాష్ట్రపు అమ్మకపుపన్నుట. చివరకు మద్రాసు అమ్మకపుపన్నుట మొత్తం చేసి చూచేప్పటికి గజం ఒక్కింటికి రూపాయికి మించిపోయింది. అంతటితో నయం. మన నాటు వ్యాపారస్థుడయితే ధర్మం కూడా కలిపేవాడు. ఆరోజుకు ఆ నాలుగు చొక్కాలతో తృప్తిపడి మిగతావి వచ్చే నెలకు వాయిదా వేసి కొంపకు చేరుకున్నాం.

మన ఖజానామంత్రి గోపాలరెడ్డిగారికి ఎటు చూచినా కామధేనువులు కనబడుతున్నవట. అమ్మకపుపన్ను బ్రహ్మాండమైన కామధేనువు; మిగతావి చిన్నవి. పాలపోటు ఎక్కువై "రెడ్డిసచివోత్తమా! మమ్మలను చేతనయినంత వరకు పితికి మా బాధను శమింపజేయుమా" అని మొరలెత్తి మొరపెట్టుకున్నవట. పేరునుబట్టి అయినా గోపాలుడు కాబట్టి రెడ్డిగారు గోవులను కటాక్షిస్తున్నారుట. అట్లా పితకటంలో అడుగుతగిలితే వారు ఏమి చేయగలరు.

శ్రీవారికి ఈ ఇబ్బంది యావత్తూ బడ్జెట్‌ను లోటులేకుండా చేయజూడడం వలన సంభవించింది. మద్యపానం అంతరించకపోయినా మద్యపాన నిషేధపు శాసనంవల్ల ఈ బడ్జెట్ బరువెక్కింది. అనేకమైన అనవసరపు ఖర్చులు ఈ బరువుకు తోసరు అయినవి. శ్రీకృష్ణతులాభారములో వలె త్రాసు ఒకవైపుకే ముల్లు చూపుతున్నది. సత్యభామ మాదిరి మన ఖజానామంత్రి ఎంతసరంజామానుపెట్టినా తక్కెడ సమానం కావటంలేదు. ఎన్ని కామధేనువులను పిదికినా ప్రయోజనం ఉంటుందని తోచదు. ఏ దళాన్నో వేయటానికి రుక్మిణీ దేవిలాంటి వ్యక్తిని ఆహ్వానిస్తే గాని ఖాటా నిలబడదు.

అయితే సత్యభామ పురాణకాలపు మనిషి కాబట్టి తన శక్తికి మించిందని తెలియగానే తక్షణం రమ్మని రుక్మిణీదేవికి కబురు పంపించింది. ఆవిడ రాగానే సంగతి సందర్భాలు తెలియచేసి ఛార్జి పుచ్చుకోమన్నది. హోమియోపతిమందులాంటి మోతాదులో తులసీదళం త్రాసులో వేసి తల్లక్రిందులు చేసింది. కాని ఇది పురాణయుగం కాదు. మనం పురాణపురుషులం కాము. ఖజానామంత్రి సత్యభామ కాదు. తక్కెడలో కూర్చున్నది శ్రీకృష్ణుడూ కాడు. అటువంటప్పుడు రుక్మిణీదేవి పాత్ర ఎట్లా వస్తుంది? ఎట్లారానిస్తారు ఇప్పట్లో? అందాకా ఇదే మన రామరాజ్యం!

నాకబలి

(5-వ పేజీ తరువాయి)

పుల్లయ్య స్పృహ తప్పిపడిపోయారని మాత్రం చెప్పగలిగాడు.

శర్మ తక్కిందంతా వర్ణించటం మొదలు పెట్టాడు.

శర్మ చివరదాకా నే లేడని తనకి పూర్తిగా తెలుస్తోంది. లాఠీఛార్జికి ముందే పారిపోయి వచ్చేసినట్లున్నాడు. కాని తుపాకి కాల్పుల విషయం కూడా చూచినట్లు వర్ణిస్తున్నాడు.

"పుల్లయ్య, ఆంజనేయులు బ్రతికి ఉన్నారంటావా?" అని శర్మ అడిగాడు.

అంతవరకు ప్రాణాపాయం అన్న స్పృహ రాఘవరావుకు రాలేదు. ఆ విషయంగా ఆలోచించటం మొదలు పెడితే ఒళ్లంతా ఖంగారెత్తి మనస్సు గగ్గోలయింది.

ఇద్దర్నీ వార్డెన్ పిలుస్తున్నారంటూ చౌక్‌దారు వచ్చిచెప్పాడు. దేనికో అని బయల్దేరి వెళ్లారు.

రోల్‌కాల్‌లో సంతకం పెట్టలేదు. తన సంజాయిషీ చెప్పక పూర్వమే శర్మ యిద్దరి తరఫునా సంజాయిషీ చెప్పటం మొదలెట్టాడు.

పికిటింగ్‌కి వెళ్లారనేటప్పటికి వార్డెన్‌కి చాలా సంతోషమయింది. దేశభక్తిమీద మహోపన్యాసం ఆరంభించాడు. ఆంజనేయులు, నారాయణ, పుల్లయ్యలు యింకా పడిపోయిన విద్యార్థుల పేర్లు, వీళ్లందరి పేర్లు వార్డెన్‌కు చెప్పాలసొచ్చేటప్పటికి శర్మ రాఘవరావు నడక్క తప్పలేదు.

వార్డెన్‌కు రాఘవరావుమీద చివరవరకు నిలిచాడన్న కారణంగా మరింత గౌరవం హెచ్చింది. అతన్ని దేశభక్తుడని అభినందిస్తూ వెన్నుచరుస్తున్నాడు, వార్డెన్.

రాఘవరావుకి ప్రాణం చచ్చిపోయినట్లయింది.

తను ఉద్దేశపూర్వకంగా పికిటింగ్‌కి బయల్దేర లేదు. సాహసయుతంగా అక్కడ నిల్చిందీ లేదు. తనతో వచ్చిన పుల్లయ్య వందల కొద్దీ లాఠీ దెబ్బలు తింటూ ధీరోదాత్తుడై అహింసా సమరరంగంలోకి ఉరుకుతూంటే తానసమర్థుడై పిరికిపందై నిలిచి, పారిపోయి వెనక్కి వచ్చేశాడు. తనను దేశభక్తుడని, వీరుడని వార్డెన్ అభినందిస్తూంటే సిగ్గుతో కుమిలిపోయి మౌనంగా మొగం వాల్చి కూర్చున్నాడు. అది తెలియని వార్డెన్ అదికూడా వినయసంపత్తిక్రిందే లెఖ్ఖవేసుకుంటున్నాడు.

తనను తను జేదరించుకుంటూ శలవు తీసికొని గదిలోకి వచ్చేశాడు.

తలుపు తీయగానే గుమ్మంలో పడివున్న కార్డు కనపడింది. యిందాకటి హడావుడిలో అదికూడా చూసుకోలేదు.

కార్డు చదువుకున్నాడు. తండ్రివద్దనుంచి ఉత్తరం. సత్యాగ్రహోద్యమం కాశీ విద్యార్థుల్లో బలీయంగా వున్నట్లు అక్కడ పేపర్లలో తెలుస్తోందనీ, రాఘవరావు అల్లాంటి వాట్లల్లో వేట్లల్లోనూ పాల్గొనకుండా భద్రంగా చదువు పూర్తి చేసుకుని యింటికి రావలసిందనీ రాసివుంది.

అతి కోపంతోటి ఉత్తరం ఛప్రున చించాడు. లైటార్పి అల్లాగే కుములుతూ నిద్దరపోయాడు.

లేఖలు



గ్రామపంచాయతీబిల్లు

అయ్యా,

గ్రామపంచాయతీలకు ఎక్కువ అధికారాలు యిస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనలో 1. అధ్యక్షుని వోటర్లే సరాసరి ఎన్నుకోవడం, 2. ప్రత్యేకస్థానాలు ఎత్తివేయడం, 3. ఇదివరకున్న అధికారాలతోబాటు సివిల్ క్రిమినల్ హక్కులు, అల్లే రిజిస్ట్రేషన్, ఇర్రిగేషన్, ధర్మాదాయ నిర్వహణ మున్నగునవికూడా యివ్వబడినవి. 4. ఆర్థికంగా రివిన్యూలో ఎంత యిచ్చేదీ చెప్ప లేదు గాని అది కాక ఖర్చునుబట్టి 12½ వంతున యిస్తా మన్నారు. 5. పంచాయితీలపై అజమాయిషీ జిల్లాబోర్డుల నెత్తివేసి ప్రభుత్వంచేతులో పెట్టారు—అనేవి ముఖ్యం.

అయితే అధ్యక్షుని ఎన్నుకునే హక్కు ప్రజల కిచ్చినపుడు, అతనిని తొలగించే హక్కు ప్రభుత్వం తీసుకొనే బదులు వోటరులకే యివ్వడం అవసరం.

ప్రత్యేకస్థానాలు యెత్తివేయడం, కులమత ప్రాతినిధ్యాలు తీసివేయడం మంచిదే; గాని మైనారిటీలను ఊరి కక్షల కారణంగా అణగిపోకుండా తమ ప్రతినిధులుకూడా వుండడానికి అవకాశం యిచ్చేటందుకు ఈ నాడు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘం జిల్లా సివిల్ బోర్డుల ఎన్నికలకు అమలుజరుపుతున్న సింగిల్ ట్రాన్స్ ఫరబుల్ వోటుపద్ధతి అమలు జరుపడం అవసరం.

అధికంగాయిచ్చిన అధికారాలు సూక్ష్మంగా సూత్రప్రాయంగా అంగీకారయోగ్యమే అయినా, ఆచరణలో వుండే యిబ్బందులను గురించి పూర్తి వివరాల చర్చచేసి నిర్ధారణ చేయవలయును. బిల్లు పూర్తిరూపం ప్రభుత్వ విమర్శకు వెలితేగాని యిదమిత్థమని తేల్చలేము.

ఆర్థికంగా గ్రామఖర్చులనుబట్టి 12½ వంతున యిస్తామంటే చాలదు. భూమిపన్నును అభివృద్ధి క్రమానుగతంగా వేసి, అందులో కనీసం నాల్గవ వంతు అయినా గ్రామఖర్చుల కివ్వాలి.

అజమాయిషీ జిల్లాబోర్డులనుండి ప్రభుత్వం తీసికున్నందువలన ఈ విమానయుగంలో పెద్ద తేడా కాన్పించదు. ఆచరణలో ప్రయోజనం లభించితే సంతోషింపదగిందే. ఈ బిల్లులోని సూత్రాలు ప్రజాస్వామికాభివృద్ధికి అనుగుణంగా శాసన మయ్యేటట్లు, ఆచరణలోకూడా ప్రజాస్వామ్యాభివృద్ధి జరిగేటట్లు ప్రజలు పూనుకోవాలె.

వావిలాల గోపాలకృష్ణయ్య
సత్తెనపల్లి.

* * *

అయ్యా,

'గ్రామ పంచాయితీ బిల్లు' త్వరలో చట్టరూపము పొందునని వినుటకు రాష్ట్రప్రజలు, ముఖ్యముగా పల్లెవాసులు గౌ॥ కల్లూరి చంద్రమౌళిగారిని అభినందించవలసినదే. కాని, ప్రజాభిప్రాయమునకు వదలిపెట్టబడిన, 'చిత్తుబిల్లు'ను సమగ్రముగా పరిశీలించినచో, ఈ క్రింది ముఖ్యలోపములు ప్రతివ్యక్తీ గమనించకపోదు.

1. కొన్ని అవాంతరములవల్లనూ, నిర్లక్ష్యభావముచేతనూ, చాలమంది క్రిందటి అసెంబ్లీ ఎన్నికల సమయములోకూడా ఓటర్లుగా చేరలేదు. అట్టివారిలో గ్రామపంచాయితీని సమర్థతతో నిర్వహించు కొంతమంది వయోజనులు కూడా ప్రస్తుత ఓటర్ల లిస్టులో లేరు. ఒక గ్రామములోని ప్రజ లందరూ ఏకగ్రీవముగా సమర్థులైన కొంతమంది సభ్యులను ఎన్నుకుంటే, ఆ సభ్యులు ఓటర్లలిస్టులో లేరనే కారణముచే, త్రోసివేయబడినపుడు మరి ఆ గ్రామములో 'పంచాయితీ' సక్రమముగా జరుగునా? గనుక వయోజనవోటింగు ప్రస్తుత మాచరణలో పెట్టుటకు వీలు లేకపోయిననూ, పంచాయితీ సభ్యులు, అధ్యక్షులు మాత్రము వయోజను లైతే, అట్టివారిని ప్రజ లెన్నుకున్నపుడు, వారి పేర్లు ఓటర్ల లిస్టులో లేకపోయిననూ, అట్టి ఎన్నికలు సక్రమమైనవిగా ప్రభుత్వము భావించవలయును.

2. పంచాయితీలకు సివిల్, క్రిమినల్ అధికారము లుండునని ప్రభుత్వము ప్రకటించినది. కాని వీటికంటె ముఖ్యమైన ఫారెస్టు అధికారములు, ప్రతిపంచాయితీకి ఉండునని ప్రకటించకపోవుట మిక్కిలి శోచనీయము. సివిల్, క్రిమినల్ అధికారము లున్ననూ, ఎల్లపుడు తగాదాలాడి కోర్టుల కెక్కు బహుకొద్దిమందికి మాత్రముతప్ప, తక్కిన సామాన్యప్రజలకు ఏమీ మేలు కలుగదు. ప్రస్తుతము ఫారెస్టు ఉద్యోగుల దౌర్జన్యము లంచగొండితనమువల్ల రిజర్వుఫారెస్టు పరిసర గ్రామములలోని, కడు బీదప్రజలుకూడా పడు అవస్థ వర్ణనాతీతము. వారు పెట్టుకేసులు న్యాయమైననూ, కాకపోయిననూ, ఉన్నతోద్యోగులు వారినే బలపర్చుచూ, ఎండుపుల్లల మోపుకుకూడా 6, 8, 10 రూపాయల చొప్పున కాంపౌండు విధించి, మేజస్ట్రేటు కోర్టులలో చెల్లించునట్లు చేయుచున్నారు. స్వరాజ్యము వస్తే, గ్రామపంచాయితీ పరిపాలనలోనైనా ఈ ఫారెస్టువారి దౌర్జన్యము కొంతవరకైన తగ్గునని, ఎంతో ఆశించిన ప్రజలకందరికి ప్రస్తుత పంచాయితీ బిల్లు నిరాశాపూరితమైనది. ఇప్పటికైనా, రిజర్వుఫారెస్టుకు, 3, 4 మైళ్ళ దూరములో నున్న గ్రామములలోని 'పంచాయితీ'ల కన్నింటికి కొన్ని ఫారెస్టు అధికారము లిచ్చి, రిజర్వు ఫారెస్టులోని చిన్నచిన్న నేరములు, ఫారెస్టు ఉద్యోగులచే గ్రామపంచాయితీలకే రిపోర్టు చేయబడునట్లు, అటువంటి నేరములకు పంచాయితీలే కాంపౌండు విధించి, వసూలు చేయునట్లు చిత్తుబిల్లును మార్పుచేయవలయును.

3. 500 జనాభాగల ప్రతిగ్రామమునకు పంచాయితీలు విధిగా ఏర్పాటుచేయబడు ననే క్లాజుమేరకు కొన్ని శివార్లలో (మజరాలు) కూడా పంచాయితీలు ఏర్పడును. ప్రస్తుతము శివార్లన్నియు ప్రభుత్వమువారి దృష్టిలో లేకుండా, రివిన్యూగ్రామముల క్రింద బానిస గ్రామములుగా పరిగణింపబడుచున్నవి. శివార్లలో వసూలైన శిస్తంతయు, రివిన్యూ గ్రామముల లెక్కక్రింద జమకట్టుకుంటూ, వానిపై వచ్చు ఆదాయమంతా ఆ గ్రామములే అనుభవించుచున్నవి. అట్లుగాక, క్రొత్త పంచాయితీ బిల్లులోనైనా, ఏగ్రామమునుంచి ఎంత శిస్తు వసూలైనది క్రమముగా లెక్కతేల్చి, (భూములు ప్రక్క గ్రామములలో చేరయున్ననూ,) శిస్తు చెల్లించు పట్టాదార్లు నివసించు గ్రామముల పంచాయితీలకే, దామాషా ప్రకారము ఆదాయము పంచుట శ్రేయస్కరము, న్యాయము నైయున్నది. అట్లుగాక, పట్టాదార్లు ఒక గ్రామములో నివసించి శిస్తు చెల్లించుచూయుంటే, భూములు వేరే గ్రామములో లెక్కదాఖలా యున్నంతమాత్రమున, వేరొక గ్రామప్రజలు ఆ శిస్తుపై వచ్చు ఆదాయమువల్ల మేలుపొందుట ఎంత ఆశ్చర్యకరమైన విషయము? ఈ విషయములో స్పష్టముగా క్రొత్త పంచాయితీ బిల్లులో ఒక క్లాజు చేర్చుట తప్పనిసరి.

4. అధ్యక్షుని గ్రామములోని ప్రజలే ఎన్నుకోవలెను. సామాన్యముగా అధ్యక్షస్థానమునకు, స్థితిపరుడు, పలుకుబడి కలిగిన వ్యక్తి (విద్య లేకపోయినను) ఎన్నుకోబడుట పరిపాటి. విస్తృతాధికారములుగల పంచాయితీలకు, విద్యాజ్ఞానములేని అధ్యక్షులు ఉంటే అట్టి పంచాయితీలు సక్రమముగా సాగవు. కనుక అధ్యక్ష ఉపాధ్యక్షులు కనీసము మాతృభాషలో చదువను, వ్రాయను విధిగా నేర్చియుండవలె ననే నిబంధన యుండవలయును.

ఎన్నికలు జరిగినపిదప ఒక్కొక్క తాలూకాలోని అధ్యక్ష ఉపాధ్యక్షు లందరికి, ఒక నిర్ణీత ప్రదేశములో, తాలూకా తహశీలుదారుగాని, డిప్యూటీ కలెక్టరుగాని 1, 2 వారములు పంచాయితీల విధులు అధికారములనుగురించి విపులముగా బోధపరచవలయును.

5. ప్రతి ఫిర్కాకు సమర్థులైన సభ్యులతో కూడిన ఒక ఫిర్కా పంచాయితీ యుండవలయును. ఆ ఫిర్కాలోని గ్రామపంచాయితీల నుండి ఫిర్కాపంచాయితీకి సభ్యుల నెన్నుకోవలయును. వీరికితోడు ఫిర్కాలోని ప్రభుత్వోద్యోగులనుకూడా ఫిర్కాపంచాయితీకి కో ఆప్టు చేసుకోవలెను. ఇట్టి ఫిర్కాపంచాయితీలు 'గ్రామ పంచాయితీలు'కు 'ప్రభుత్వము'నకు మధ్య సలహాసంఘములుగా పనిచేయవలయును. కాని ఫిర్కాపంచాయితీలకు ఏ అధికారము లుండరాదు. పంచాయితీల విధులు, అధికారములలో ఏమైన సంశయముంటే, గ్రామపంచాయితీలు, 'ఫిర్కాపంచాయితీ' ద్వారా అట్టి సంశయ నివృత్తి చేసుకొనునట్లు అవకాశము కలుగజేయవలయును.

పైలోటన్నియు గమనించి పల్లెప్రజ లందరికి న్యాయము సుఖము కలుగునట్లు ప్రస్తుత చిత్తు బిల్లును సవరించి, త్వరలో చట్టముగా చేయుట ప్రభుత్వ కర్తవ్యము. కొన్నికోట్ల ప్రజల నిత్యజీవితమునకు సంబంధించిన ఈ పంచాయితీ బిల్లును ప్రతి శాసనసభ్యుడు తర్జన భర్జనచేసి లోపములు సవరించి, సావకాశముగా చర్చించి, ప్రజాభిప్రాయమునకు ప్రాముఖ్య మొసగి, బిల్లుగా చేయుట, ప్రతి శాసనసభ్యుని విధి.

పంచాయితీలు సక్రమంగా నెరవేరవలె నంటే, తాలూకాలోని ఉద్యోగులందరు కనీసము ఒకవారము, పంచాయితీబిల్లునుగురించి ఆయా తాలూకాలోని గ్రామము లన్నిటి యందు, విపులమైన ప్రచారము చేసి, ప్రజలందరికి 'పంచాయితీబిల్లు'లోని సంగతులు పూర్తి అర్థమైన పిదప ఎన్నికలు జరుపుట ఉచితము.

చప్పిడి వెంగయ్య,
పెద్దనల్లగాల్వ,
కంభంపోస్టు, కర్నూలుజిల్లా.

గ్రామీణవైద్యులు, ఆయుర్వేదము


అయ్యా,

గ్రామీణవైద్యుల శిక్షణగూర్చి ప్రభుత్వము వారు ఇంకనూ అశ్రద్ధవహించుచునేయున్నారు. అభివృద్ధి నడగారియున్న దేశీయ వైద్యశాస్త్రము, పాశ్చాత్య వైద్యశాస్త్రములో గల గొప్ప లోపములను తొలగించుటకూడా తోడ్పడగలదు. పాశ్చాత్యవైద్యముకూడా దేశీయవైద్యవిభాగమునుండి నేర్చుకోతగినది ఎంతేనికలదు. ముఖ్యముగా దేశీయవైద్యవిధానమునకు ఆధారభూతమైన తాత్వికదృష్టి, ధాతుసామ్యసిద్ధాంతము, పథ్యాపథ్యవిధానము, విశిష్టమును, సమగ్రమునైన సిద్ధాంతముల సమీకరణ, వాని వ్యాప్తి, అతీంద్రియ విజ్ఞానబోధకములగు ఆధిభౌతిక విషయములు పాశ్చాత్యవైద్యము స్వీకరింపవచ్చును. పాశ్చాత్యవైద్య విధానమునుండి ఉపయోగకరమైన విషయములగు శస్త్రచికిత్స, ప్రసూతివైద్యము, ఫిజియాలజీ, రోగనిర్ణయ సాధకములైన నవీన పరికరములు దేశీయవైద్యము స్వీకరింపవచ్చును. దేశీయ వైద్యమును, పాశ్చాత్యవైద్యమును ఏకము చేయుటకు దేశీయ వైద్యమున పరిశోధనావశ్యకత ఎంతేని కలదు. ఈ ఏకీకరణవిధానమువలన, పాశ్చాత్యవిధానములోగల మేళ్లను, మన ప్రజలు పొందగలుగుట మాత్రమే గాక, మన ప్రజల ఆచార వ్యవహారములకు అవసరములకు తగినట్లు, మన ఆర్థికవిధానమునకును అనువగు చౌకయైన వైద్యవిధానము ఏర్పడగలదు. దేశీయ, పాశ్చాత్య వైద్యవిధానముల ఏకీకరణ సాధ్యము మాత్రమే కాక ఆచరణయోగ్యముకూడ కాగలదు. భారతదేశమున రెండు లక్షలమంది దేశీయ వైద్యులు కలరు. వీరిలో కొందరికి 6 నెలలపాటు శిక్షణ నొసంగి, కళాశాలలందు, పాఠశాలలందు శిక్షణ పొందవచ్చును. ప్రత్యేక శిక్షణ పొంద నక్కర లేకుండానే, పరీక్షకుమాత్రమే హాజరై ఉద్యోగమును పొందు అవకాశము నివ్వవచ్చును. ఈ పరీక్షలో ప్యాసయినవారలే గ్రామవైద్యులుగా పరిగణింపబడవలెను. ఈ విషయములన్నియూ చోప్రా కమిటీవారిచే సూచించబడినవి. ఇది ప్రభుత్వ విధానము నడపు చికిత్సాలయములు, డాక్టర్లకు సంబంధించియుండి, ఉపయోగకరముగా నుండును.

మరియు వైద్యులను నిర్బంధముగా రిజిష్టరు చేసి, కువైద్యులను విడదీయవలసియున్న దనియు కమిటీవారు తెలిపిరి. రిజిష్టరు అయిన దేశీయ వైద్యుల సంఖ్యకంటె, రిజిష్టరు కాని దేశీయ వైద్యులు అనేకరెట్లున్నారు. వీరి నెల్లరిని ప్రభుత్వమువారు ముందుగా రిజిష్టరుచేయుటకు పూనుకొనవలెను. వీరలకు యిప్పటివలె దేశీయవైద్యము చాలమందికి అందుబాటులో నుండి, బాహుళ్యముగా ఆచరింపబడుతోంది. ప్రజలును బహుళ సంఖ్యాకులుగా దీనినే కోరుచున్నారనెడి వాక్యములను జ్ఞప్తియం దుంచుకొని, చిరకాలం నుండి ఈ వృత్తి అవలంబించిన దేశీయ వైద్యులకు దేశీయవైద్య కుటుంబములకు, ఆయుర్వేద వృత్తి వ్యాపారములకు భంగము కలుగకుండా, వీరికి కావలసిన చికిత్సాదిసాధన ద్రవ్య సంపత్తియు పూర్తిగా లభించేటట్లుగా ఆయుర్వేద శాస్త్ర అభ్యున్నతికి భంగము కలుగకుండా, ఆయుర్వేద వైద్యవిధానము ననుసరించి, ప్రత్యేక పాఠశాలలను ఆయుర్వేద వైద్య విద్యార్థులకు అందుబాటులోనుండే ప్రదేశములందు నేర్పరచి యువకులగు విద్యార్థులెల్లరు అందు ఉత్తీర్ణులైన పిమ్మట రిజిష్టరు చేసి, ఆయుర్వేదాభివృద్ధిని పెంపొందచేసి, భారతదేశచికిత్సాశాస్త్రమగు ఆయుర్వేదమును, పోషించగలందులకు ప్రభుత్వము వారిని కోరుచున్నాను.

అల్లెన దామోదరరావు,
వైద్యవిద్వాన్, పాలకొండ.

పూరీ పుణ్యక్షేత్రంలో జగన్నాథ దేవాలయం




శ్రీ మందిరం, తత్ప్రాకారం




పండితసన్మానం : ఖర్గపురంలో ఇటీవల శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణగారికి స్థాని
ఆంధ్రమహాసభవారు సన్మానం చేసినప్పుడు తీసిన చిత్రం. చిత్రంలో ఆంధ్రరత్న
శ్రీ బి. దండపాణి, ఖర్గపురం తెలుగు విద్యాపీఠం రిజిస్ట్రార్ శ్రీ యస్. రామాం
నేయులు, ఆంధ్రమహాసభాధ్యక్షులు శ్రీ ఆర్. పి. శర్మ మొదలగువారున్నారు

వార్తాచిత్రాలు



భారతనౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ పారీ : పూనాలో ఒకరోగి కృత్రిమకాళ్లతో ఉన్నప్పటికీ, కారు నడపటం నేర్చుకుంటుండగా వీక్షిస్తున్నారు.



జూన్ 11, 12 తేదీలలో శ్రీ చావలి వెంకట హనుమంతరావుగారి అధ్యక్షతను విజయవాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర పత్రికారచయితల సభకు హాజరైన ప్రతినిధులు. అధ్యక్షుడు హనుమంతరావు, బ్రిటిష్ సమాచారశాఖాధికారి హారీహీప్, ఆహ్వానసంఘాధ్యక్షుడు సుమ్మిడిదల సుబ్బారావు, మల్లెల శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి ఫణిభూషణరావు, ఆంధ్రపత్రిక సంపాదకుడు శంభుప్రసాద్, సంయుక్త కార్యదర్శి నీలంరాజు వెంకటశేషయ్య ప్రభృతులు ముందువరుసలో నిలబడియున్నారు.

Regd. No. M. 4479

ఉత్తమ శైవమత గ్రంథము

పండితారాధ్యచరిత్ర

వెల రు **5-0-0** లు.

ప్యాకింగు పోస్టేజి రూ, 1—4—0.

పాల్కురికి సోమనాథకవి రచించిన ఉత్తమ ద్విపద కావ్యము. డా॥ చిలుకూరి నారాయణరావుగారిచే పరిష్కరింపబడినది. దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వతము లను అయిదు ప్రకరణములును ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈ గ్రంథము నిదివర కెవ్వరును ప్రచురించి యుండలేదు. నారాయణరావుగారు రచించిన అమూల్యమైన పీఠికయూ కలదు.

ఆంధ్రగ్రంథమాల, పోస్టు బాక్సు నెం. **212,** మదరాసు 1.

శ్రీమద్భగవద్గీత

సంస్కృత మూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు.

వెల రు **4-0-0** లు.

తపాలా ఖర్చు అ. **0-9-0.**

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు **212** మదరాసు 1.

తెలుగు మెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

తెలుగుదనము, తెలుగుసంప్రదాయాలు, తెలుగుభాష అవతరించిన విధము, తెలుగు తేటదనము, తెలుగు కవితా పారమ్యము, ప్రాచీన గ్రంథాల పలుకుబడికి మనపై చెల్లుబడి, తీక్ష్ణమైన మన అరసున్న చరిత్ర, వింత వింత నిఘంటువులు, మన గ్రంథాలలో గ్రంథులు, అవీ ఇవీ, ఇంకా తెలుగులో ఉన్న ఎన్నో మెఱుగులను చూపెట్టుచున్న వ్యాసముల సంపుటి. శాస్త్రిగారి పాతిక ముప్ఫయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించియున్నది. ఆంధ్రాభిమానముగల వారందరు అవశ్యము చదువవలసిన గ్రంథము. ప్రతులకు త్వరపడవలెను.


వెల ౨ రూ. తపాలాఖర్చులు ౭ అణాలు.

ఆంధ్ర గ్రంధమాల, పోస్టుబాక్సు నెం. 212, మదరాసు.

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర



సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రలనన్నిటిని అవలోడనచేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయినచరిత్ర. శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్కఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు **2-0-0** లు, తపాలాఖర్చు **0-7-0** ఆంధ్రగ్రంథమాల, పో. బా. **212,** మద్రాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.